

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM



కేజ్రీవాల్ ఆరోపణలపై విచారణకు ఆదేశం

25 బేసిస్ పాయింట్లు తగ్గించిన ఆర్‌బిఐ

9లో



గుంటూరు : fb.com/vaartha

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam


8-2-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 7 పేజీలు: 12 వెల: 6.50


# స్వర్ణాంధ్ర ప్రణాళికకు చేయూతనివ్వండి

## నీతి ఆయోగ్ వైఎస్ చైర్మన్ సుమన్ బేరీని కోరిన సిఎం చంద్రబాబు

### రాష్ట్రంలో అవకాశాలు- ఆకాంక్షలపై నీతి ఆయోగ్ బృందానికి పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్

### గత ఐదేళ్లలో రాష్ట్రంలోని పరిస్థితిని వివరించిన సిఎం



శుక్రవారం విజయవాడలో స్వర్ణాంధ్ర విజన్-2047ను సుమన్ బేరీకి అందజేస్తున్న సిఎం చంద్రబాబు. చిత్రంలో ఆర్థిక మంత్రి కేశవ్

**విజయవాడ,ఫిబ్రవరి 7,ప్రభాతవార్తప్రతినిధి:** వన్ ఫ్యామిలీ.. వన్ ఏఐ ప్రొఫెషనల్ వన్ ఎంట్రప్రెన్యూర్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యంగా స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్ రూపొందించామని, దీనికి కేంద్రసాయం అవసరమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు.ఏపీని అన్నిరంగాల్లో ముందంజన ఉండాలన్నదే తమ ప్రభుత్వం కీలక ఆశయమన్నారు.రాష్ట్ర లక్ష్యాలు,సంక్షేమ పథకాలు,అభివృద్ధికి సహకరించాలని నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ సుమన్ బేరీతో అన్నారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయాలనికి సుమన్ బేరీ వచ్చారు.ఆయనకు ఏపీ సీఎం చన్ద్రబాబు నాయుడు, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ఘనంగా స్వాగతం పలి కారు. అనంతరం ఆయనతో బేటీ అయ్యారు.ఈ సమావేశంలో గత అయిదేళ్ళ పాలనలో రాష్ట్రంలో చోటు చేసుకున్న ఆర్థిక అరా చకత్వం, అభివృద్ధిని తిరోగమనం పట్టించిన చర్యలు తదితరంశాల ప్రస్తావనకు వచ్చింది.ఉగాది నుంచి రాష్ట్రంలో చేపడుతున్న పీ-4 విధానం, 10 కీలక ప్రణాళికల అమలు ఇతర విషయాలను గురించి సీఎం చంద్రబాబు నీతి ఆయోగ్ బృందానికి తెలిపారు.గతంలో ఏం జరిగింది.ఇప్పుడు గత విధ్వంసకర పరిస్థితులనుంచి రాష్ట్రాన్ని శక్తివంతంగా చేసేందుకు అమలు చేస్తున్న విధానాలను వివరించారు.ఏపీ ఆర్థిక పరిస్థితి, గత ఐదేళ్ల వైకాంగ్రెస్ దుష్పరిపాలన, పలు రంగాల వారీగా జరిగిన నష్టంపై నీతి ఆయోగ్‌కు సీఎం చంద్రబాబు ప్రజంటేషన్ ఇచ్చారు. దక్షిణాది రాష్ట్రాల్లో ప్రస్తుతం ఏపీ తక్కువ జీడీపీ ఉండటం, దానికి గల కారణాలపై కూడా ప్రజంటేషన్‌లో వివరించారు. ఇటీవల నీతి ఆయోగ్ ఇచ్చిన ఆర్థిక ఆరోగ్య నివేదికలో ఆంధ్రప్రదేశ్ పరిస్థితి గురించి చెప్పిందన్నారు. రాష్ట్రం అప్పు తిరిగి చెల్లించే స్థితిలో లేదని నివేదించిందని చంద్రబాబు గుర్తుచేశారు. 2014- 19 మధ్య అభివృద్ధికి, ఆ తర్వాత ఐదేళ్లలో చోటు చేసుకున్న దుష్పరిపాలనతో పొంతన లేకుండా పోయిందని, రాష్ట్రం చాలా నష్ట పోయిందని ప్రజంటేషన్‌లో చంద్రబాబు తెలి పారు. 2019-24 మధ్య జరిగిన ఆర్థిక విధ్వంసంపై >>2



# 11 నుండి 3 రోజులు ఫ్రాన్స్, అమెరికాలో ప్రధాని పర్యటన

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7:** అమెరికా అధ్యక్షుడుగా ట్రంప్ ఎన్నికైన తర్వాత భారతప్రధాని తన మొట్టమొదటి అధికార పర్యటనను నిర్వహిస్తున్నారు. ఈనెల 12,13 తేదీల్లో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆహ్వానంమేరకు ఆయన అమెరికాలో పర్యటించనున్నట్లు విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ తెలిపారు. అంతకు ముందు ప్రధాని ఫ్రాన్స్ పర్యటనకు కూడా వెళు తున్నారు. 11,12తేదీల్లో ఫ్రాన్స్‌లో పర్యటించి ఆదేశ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మ్యాక్రాన్‌తో కలిసి భేటీ అవుతారు. కృత్రిమమేధపై జరుగుతున్న అంతర్జాతీయ సదస్సులో పాల్గొని ప్రసంగిస్తారు. భారత సంతతి కుటుంబాలతో భేటీ అయ్యే మోడీ అక్కడి పెట్టుబడిదారులు, ప్రముఖ కంపెనీల సిఇఒలను కూడా కలుసు >>2



# వైఎస్సార్సీపీలో చేరిన శైలజానాథ్

2లో





# 24 నుంచి బడ్జెట్ అసెంబ్లీ

## 3 వారాలు సమావేశాలు

**విజయవాడ,ఫిబ్రవరి 7,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 24 నుంచి జరుగనున్నాయి. 24న ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించనున్నారు.దాదాపు మూడు వారాల పాటు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. సెలవులతో కలుపుకుని 20 రోజుల పాటు సభ నిర్వహించే యోచనలో ఉన్నట్లుసమాచారం. మొదటిరోజు బీఏసీ తర్వాత సభ ఎన్నిరోజులు నిర్వహించాలనే అంశంపై నిర్ణయం తీసుకోనున్నారు. ఈనెల 28నశుక్రవారం 2025-26 >>2

# ఎస్సీ, ఎస్టీలకు విద్యుత్ ఉచితం

## సౌరఫలకాలు ఏర్పాటు

**విజయవాడ ఫిబ్రవరి 7 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన 20.10 లక్షల విద్యుత్ కనెక్షన్లకు పీఎం సూర్యఘర్ పథకం కింద ఉచితంగా సౌర విద్యుత్ పలకలు ఏర్పాటుచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్కో ఇంటిపై 2 కిలోవాట్ల పలకలు ఏర్పాటుచేయనుంది. దీనికి సంబంధించిన సర్వేను రాష్ట్రప్రభుత్వం పూర్తిచేసింది. ప్రతినెలా కొన్ని దరఖాస్తులను ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసేలా చర్యలు చేపట్టింది. ఈ మేరకు రాష్ట్ర ప్రతిపాదనను కేంద్రం ఆమోదించింది. నిబంధన మేరకు కేంద్రం ఇచ్చే రాయితీ విడుదల చేసేందుకు అంగీకరించింది. వాటి నిర్వహణ బాధ్యతలను డిస్కంలకు అప్పగించాలని నిర్ణయించింది. వీటిద్వారా 2412 మెగావాట్ల సౌర విద్యుత్ అదనంగా అందుబాటులోకి వస్తుందని అంచనా. ఒక్కో ఇంటిపై 2 కిలోవాట్ల సౌరవిద్యుత్ పలకలకు రూ.1.15 లక్షలు అవుతుందని ప్రభుత్వం అంచనా. అందులో కేంద్రం రూ.60 వేలరాయితీ అందిస్తుంది. మిగిలిన రూ.55వేలను రాష్ట్రప్రభుత్వం భరిస్తుంది. ప్రభుత్వం సుమారు రూ.వెయ్యి కోట్లు భరించాలి. ఎస్సీ ఎస్టీలకు ఉచిత విద్యుత్ పథకం కింద నెలకు 200 యూనిట్లు ప్రభుత్వం అందిస్తోంది. ఈ పథకం అమలుకు ప్రతి నెలా రూ.200 కోట్లను సబ్సిడీగా డిస్కంలకు చెల్లిస్తోంది. ఎస్సీ ఎస్టీలకు ఇళ్లపై దశలవారీగా సౌర పలకల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. సబ్సిడీ కింద చెల్లిస్తున్న మొత్తాన్ని ప్రాజెక్టు అమలుకు >>2

# సౌత్‌కోస్ట్ రైల్వేజోన్‌కు గ్రీన్‌సిగ్నల్

## విశాఖ కేంద్రంగా ఏర్పాటు

## నైపుణ్యభారత్‌కు రూ.8,800కోట్లు: కేంద్ర కేబినెట్ ఆమోదం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7:** దక్షిణకోస్తా రైల్వేజోన్‌లో కొత్తగా ఏర్పడతున్న విశాఖ పట్టణం డివిజన్‌ను వాల్తేర్ డివిజన్‌లోని కొంతభాగాన్ని వేరుచేసి ఏర్పాటుచేసేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. వాల్తేరు డివిజన్‌లోని కొన్ని ప్రాంతాలు పలాసా విశాఖ, దువ్వాడ, కూనేరు, విజయనగరం, నౌపడా జంక్షన్, పర్లాకిమిడి, బొబ్బిలి జంక్షన్, సాలూరు, సింహాచలం నార్త్, దువ్వాడ బైపాస్, బదలపూడి దువ్వాడ విశాఖ స్టీల్‌ప్లాంట్, జగ్గయ్యపాలెం ప్రాంతాలు మొత్తం 410 కిలోమీటర్లను విశాఖపట్టణం డివిజన్‌పరిధిలోకి చేర్చారు. ఈ డివిజన్ ఇపుడు కొత్తగా ఏర్పాటవుతున్న దక్షిణకోస్తాజోన్‌లోకి వస్తుంది. అలాగే వాల్తేరు డివిజన్‌లో ఇతర ప్రాంతాలు కొత్తవలస, బచేలి, కూనేరు, తేరువాలిజంక్షన్; సింగాపూర్‌రోడ్డు, కోరాపుట్‌జంక్షన్; పర్లాకిమిడి, గున్‌పూర్ మొత్తం 680 కిలోమీటర్లను కొత్త డివిజన్‌కింద మార్చి రాయగడ డివిజన్‌గా మారుస్తున్నారు. ఈ డివిజన్ తూర్పుకోస్తా రైల్వేజోన్‌పరిధిలోకి వస్తుంది. బ్రిటిష్ వలసవాదుల కాలంనాటి పేరు కావడంతో వాల్తేరుపేరును మార్చేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. అలాగే కేంద్ర ప్రభుత్వపరిధిలో కొనసాగుతున్న నైపుణ్యభారత్ పథకాన్ని 2026వరకూ కొనసాగించేందుకు ప్రధానిమోడీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్‌కమిటీ ఆమోదం తెలిపింది. 2022-23 నుంచి 2025-26 వరకూ కొనసాగే ఈ పథకానికి 8800 కోట్లు నిదులు కూడా కేటాయించింది. స్కిల్ ఇండియా కార్యాచరణతో నిపుణులైన, భావితరం పారిశ్రామికరంగానికి అవసరమైన వర్క్ ఫోర్స్‌ను సిద్ధంచేయడమేనని, డిమాండ్‌కు అనుగుణంగాను, >>2




# వైఎస్సార్సీలోకి శైలజానాథ్



శుక్రవారం వైఎస్ జగన్ సమక్షంలో వైఎస్సార్సీలో చేరుతున్న డాక్టర్ శైలజానాథ్

## అదే బాటలో డిసిసి మాజీ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి

**అనంతపురం, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త బ్యూరో:** అనంతపురం జిల్లా శింగనమల రాజకీయాలు రసవత్తంగా మారాయి. రాజకీయాల్లో శత్రువులు, మిత్రులు ఎప్పుడు అవుతారు మిత్రులు శత్రువులు ఎప్పుడు అవతారో చెప్పలేని పరిస్థితి. ఇన్నాళ్లూ కాంగ్రెస్‌లో ఉంటూ వైఎస్.జగన్‌ను, వైసిపి నేతలపై విమర్శలు గుప్పించిన డాక్టర్ శ్రీశైలజానాథ్ శుక్రవారం వైసీపీ కండువా కప్పుకున్నారు. డా.శైలజానాథ్ వైసిపిలోకి రావడంతో ఆ పార్టీ బలం చేకూరినట్లు అయింది. మాదిగ సామాజిక వర్గానికి చెందిన డాక్టర్ శైలజానాథ్ మంచి వాగ్దాటిగా, దూకుడుగా ముందుకెళ్లే వ్యక్తిగా గుర్తుంటుంది. శింగనమల స్థానంనుంచి 2004, 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున గెలుపొంది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో రాష్ట్ర క్యాబినెట్ మంత్రిగా పని చేశారు. దివంగత నేత వైఎస్.రాజశేఖర్‌రెడ్డితో కాంగ్రెస్ పార్టీలో మంచి సంబంధాలు కొనసాగించారు. వైఎస్ఆర్ మరణం తర్వాత వైఎస్.జగన్ కొత్తపార్టీ పెట్టినా ఇప్పటి వరకు కాంగ్రెస్‌లోనే కొనసాగుతూ వచ్చారు. కర్ణాటక తదితర రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగినప్పుడు కాంగ్రెస్ పరిశీలకునిగా కూడా వెళ్లి విధులు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ పిసిసి అధ్యక్షునిగా కూడా పని చేశారు. శింగనమల స్థానం నుంచి కాంగ్రెస్ తరపున ఐదు సార్లు పోటీ చేయగా రెండు సార్లు గెలుపొంది మూడు సార్లు ఓడిపోయారు. ఎన్నికలకు ముందే వైసిపిలో చేరాలని డాక్టర్ శైలజానాథ్ ప్రయత్నించినా అప్పట్లో ఆయన ప్రయత్నాలు ఫలించలేదు. తాజాగా డాక్టర్ శైలజానాథ్, పిసిసి సభ్యుడైన మాజీ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ప్రతాప్‌రెడ్డి శుక్రవారం వైసిపి అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో తాడేపల్లిలోని వైఎస్ జగన్ నివాసంలో కాంగ్రెస్ నుంచి వైసిపిలోకి చేరారు. ఈ కార్యక్రమంలో ఎంపి పెద్దిరెడ్డి, మిథున్‌రెడ్డి, వైఎస్ఆర్‌సిపి సీనియర్ నాయకులు అనంత వెంకటరామిరెడ్డి, వేంపల్లి సతీష్‌రెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, వై.విశ్వేశ్వర్‌రెడ్డి, తలారి రంగయ్య, మేరుగ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.


**.ప్రజా సమస్యలపై పోరాడుతా: డాక్టర్ శైలజానాథ్:** వైఎస్ఆర్‌సిపిలో చేరిన అనంతరం సాకే శైలజానాథ్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో వైఎస్ జగన్ నాయకత్వంలో పని చేస్తూ, ఎన్‌డిఏ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను అడ్డుకుని ప్రజల పక్షాన పోరాడాలని నిర్ణయించుకున్నానన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలు అమలు చేయడం లేదు. మరోవైపు ప్రభుత్వ మెడికల్ కాలేజీలను నిర్వీర్యం చేయడం ద్వారా, పేదలకు వైద్య విద్య దూరంచేస్తున్నారన్నారు. గతంలో జగన్ విద్యారంగంలో చేసిన అమలు చేసిన అనేక సంస్కరణలను ఈ ప్రభుత్వం పక్కన పెట్టిందని విమర్శించారు. ప్రజల సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం పూర్తిగా గాలికి వదిలేసిందన్నారు. రాయలసీమ జిల్లాల్లో రైతుల కష్టాలను కూడా చంద్రబాబు ప్రభుత్వం అస్సలు పట్టించుకోవడం లేదని అన్నారు. ప్రజల తరపున ప్రభుత్వాన్ని నిలదీస్తామని, ప్రజల పక్షాన పోరాడుతామన్నారు. మొక్కవోని ధైర్యంతో పని చేసే నాయకత్వం జగన్‌ది అన్నారు. అందుకే ఆయన నేతృత్వంలో పని చేసేందుకు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు సాకే శైలజానాథ్ వెల్లడించారు. ఈ సందర్భంగా వైసిపి అనంతపురం జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ శైలజానాథ్ మా వైఎస్ఆర్‌సిపి కాంగ్రెస్ పార్టీలోకి చరడాన్ని ఆహ్వానిస్తున్నామన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై ప్రజల్లోపెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. చంద్రబాబు నిజ స్వరూపం బయటపడుతోందన్నారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వైఎస్ఆర్‌సిపి పని చేస్తుందని అనేకమంది మా పార్టీలోకి వస్తున్నారని చెప్పారు. రాయలసీమ కృష్ణా జలాలు తీసుకొస్తానని చంద్రబాబు చెబుతన్నది శుద్ధ అబద్ధమన్నారు. చంద్రబాబు 1996లో ఆ పనులకు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత పట్టించుకో లేదన్నారు. కానీ వైఎస్ ఆర్ సీఎం అయిన తర్వాత కృష్ణ జలాలను రాయలసీమకు అందించారని, అనంత వెంకటరామిరెడ్డి గుర్తు చేశారు. చంద్రబాబు రాయలసీమకు ద్రోహం చేశారన్నారు. జగన్ సిఎంగా రాయలసీమ అభివృద్ధి కోసం అనేక చర్యలు తీసుకున్నారు. కానీ ఇప్పుడు కూటమి ప్రభుత్వం మా రాయలసీమకు మళ్లీ అన్యాయం చేస్తోందన్నారు.

## తెలుగింటి అమ్మాయి మిస్ గ్లోబల్ విన్నర్ 'భావన రెడ్డి చిన్నతంబు'కు ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందనలు



**చంద్రగిరి, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:** తెలుగింటి అమ్మాయి మిస్ గ్లోబల్ విన్నర్ భావన రెడ్డి చిన్నతంబు అంతర్జాతీయ స్థాయిలో అందాల పోటీలలో రాణించడం అభినందనీయమని అన్నారు. గురువారం భావన రెడ్డి తన తండ్రి గోపికృష్ణతో కలసి ముఖ్యమంత్రిని కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు చంద్రబాబు శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామీణ ప్రాంతాల నుండి వెళ్ళి అంతర్జాతీయ వేదికలపై ప్రతిభను కనబరిచి విజేతగా రాణించడం తెలుగు రాష్ట్రాలకు గర్వకారణమన్నారు.

భవిష్యత్తులో కాలుష్య నియంత్రణకు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిం చనున్నట్లు ఆమె సిఎం దృష్టికి తీసుకువచ్చారు. ప్రజాహిత కార్యక్రమాలు చేయడంలో తనవంతు సహకారం అందిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు సిఆర్ రాజన్, పులికంటి మోహన్ రెడ్డి, ఆర్.బాలాజీ, ఆర్.ప్రదీప్, చెరుకూరి శేఖర్, కోటేశ్వర్ రావు, భాషా, తదితరులు పాల్గొన్నారు.




ఇఓఎస్-06 ఉపగ్రహం సముద్రాన్ని దగ్గరగా తీసిన దృశ్యం

## నీలి సముద్రం సొగసు చూడతరమా..

### మన ఇఓఎస్-06 తీసిన చిత్రం ఇది

**శ్రీహరికోట (తడ), ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ శ్రీహరికోట నుంచి గతంలో ప్రయోగించిన ఇఓఎస్-06 ఉపగ్రహం మహాసముద్రాల రంగు పరిశీలనలు తెలుపుతూ విలువైన ఫొటోలు తీసింది. ఈ ఉపగ్రహంలోని ఓసిఎం సెన్సార్ ప్రపంచ స్థాయిలో అత్యంత మెరుగైనది. ఓషన్ కలర్ మానిటర్ (ఓసిఎం) సెన్సార్ ఇటీవల సముద్రానికి దగ్గరగా చిత్రాలు తీసి పంపించింది. గత ఏడాది డిసెంబర్, ఈ ఏడాది జనవరి మధ్య కాలంలో ఒక కిలోమీటరు రిజల్యూషన్‌తో కూడిన శాటిలైట్‌లోని కెమెరాలు ఈ చిత్రీకరణ చేశాయి. ప్రపంచ స్థాయిలో మహాసముద్రాల బయో-జియో రసాయన వైవిధ్యంపై విలువైన సమాచారాన్ని సేకరించడంలో ఈ ఉపగ్రహంలోని ఉపకరణాలు ఉపయోగపడుతున్నాయి.

## 24 నుంచి బడ్జెట్ అసెంబ్లీ

>> ఆర్థిక సంవత్సరానికి గాను సభలో ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశపెట్టే అవకాశం ఉంది. అసెంబ్లీ సమావేశాలకు మంత్రులు తమ శాఖల్లో అడిగిన ప్రశ్నలకు పూర్తిస్థాయి సబ్జెక్టుతో హాజరుకావాలంటూ ఆదేశాలు జారీ అయ్యాయి.

**ఎమ్మెల్యేలకు అవగాహన తరగతులు:** అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ఈ నెల 22, 23 తేదీల్లో ఎమ్మెల్యేలకు ఓరియంటేషన్ (అవగాహన) తరగతులు జరగనున్నాయి. రెండు రోజుల పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు వర్క్‌షాప్ జరగనుంది. కొత్తగా వచ్చిన వారికి సభా నియమాలు, సభలో సభ్యుల పనితీరు, వ్యవహార శైలి, సభా మర్యాదలపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించ నున్నారు. మొదటి రోజు ఎమ్మెల్యేల అవగాహనా తరగతుల కార్యక్రమానికి లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా హాజరయ్యే అవకాశం ఉంది. అయితే అమరావతికి ఓం బిర్లా వస్తారా లేదా వర్చువల్‌గా పాల్గొంటారా అనే అంశంపై త్వరలో స్పష్టత వచ్చే అవకాశంఉంది. ఈ ఓరియంటేషన్ కార్యక్రమానికి భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు హాజరయ్యే అవకాశం ఉంది.



శుక్రవారం న్యూఢిల్లీలో అక్కినేని జీవితచరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించిన నప్రధాని మోడీ. చిత్రంలో నాగార్జున, అమల, లక్ష్మీప్రసాద్, నాగచైతన్య తదితరులు

## అక్కినేని జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించిన ప్రధాని మోడీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఫిబ్రవరి7:** అక్కినేని కుటుంబం ప్రధాని నరేంద్ర మోదీని కలిసింది. ఇటీవల జరిగిన 'మన్ కీ బాత్' కార్యక్రమంలో లెజెండరీ యాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు గురించి ప్రధాని మోడీ ప్రస్తావించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన కుమారుడు, టాలీవుడ్ హిరో అక్కినేని నాగార్జున ప్రధాని మోడీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అక్కినేని నాగేశ్వరరావు జీవిత చరిత్రను ప్రధాని మోడీ ఆవిష్కరించారు. ప్రధాని మోడీని కలిసిన వారిలో అక్కినేని కుటుంబ సభ్యులు అమల, నాగచైతన్య, శోభిత ధూళిపాళ, నాగసుశీల, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఉన్నారు.దివంగత అక్కినేని నాగేశ్వరరావుపై మాజీ ఎంపీ యార్లగడ్డ ప్రసాద్ రచించిన అక్కినేని కా విరాట్ వ్యక్తిత్ అనే పుస్తకాన్ని ప్రధాని మోడీ ఆవిష్క రించారు.

కాగా, ఈ భేటీకి సంబంధించిన ఫోటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

## విద్యుత్ ఉచితం

>> ఖర్చుచేయాలని భావిస్తోంది. ప్రాజెక్టు అమలు కోసం డిస్కంలు రుణాన్ని తీసుకుని అమలుచేయాలని నెల వాయిదా మొత్తాన్ని ప్రభుత్వమే ప్రతి నెల చెల్లించాలని నిర్ణయించింది. సౌర పలకలతో వచ్చే విద్యుత్ ఉచితంగా ఇవ్వడంతోపాటు లీజు రూపేణా అదనపు ఆదాయాన్ని ప్రభుత్వం సమకూర్చనుంది. ఒక్కొక్కరికి సుమారు 200 చదరపు అడుగుల స్థలం అవసరం ఉంటుందని అంచనా. లబ్ధిదారుల ఇంటి పైకప్పును వినియోగించుకున్నందుకు చదరపు అడుగుకు రూపాయి చొప్పున లీజు రూపేణా ప్రభుత్వం చెల్లిస్తుంది. ఈ ప్రకారం ఎస్సీ ఎస్టీలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌తో పాటు ప్రతి నెలా రూ.200 చొప్పున అదనపు ఆదాయం లభిస్తుంది. ఇళ్ల పైకప్పు ఇందుకు అనువుగా లేనిచోట ప్రత్యామ్నాయంగా వాటి ఏర్పాటుకు అంగీకరించేవారితో ఒప్పందం చేసుకోవాలనిప్రభుత్వం నిర్ణయించింది. అలా వీలుకానిచోట ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో అవసరం మేరకు ప్రాజెక్టు ఏర్పాటుచేసి విద్యుత్‌ను అందించాలని నిర్ణయించింది. రెండు కిలోవాట్ల ప్రాజెక్టు ద్వారా నెలకు సుమారు 240 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. లబ్దిదారుడు వినియోగించుకున్నది పోను మిగిలిన విద్యుత్ గ్రిడ్‌కు అందుతుంది. ఆ విద్యుత్‌ను డిస్కంలు వినియోగించుకోవచ్చు. ప్రతి లబ్దిదారుడు గరిష్ఠంగా 200 యూనిట్ల వరకు వినియోగించుకున్నా నెలకు 80.4 ఎంయూల విద్యుత్ డిస్కంలకు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. లబ్ధిదారులపై పైసా భారం పడకుండా చూడడంతో పాటు ప్రతి నెలా కొంత మొత్తాన్ని లీజు రూపేణా ప్రభుత్వమే చెల్లించనుంది.

## స్వర్ణాంధ్ర ప్రణాళికకు చేయూతనివ్వండి

>> ప్రత్యేకంగా ప్రజంటేషన్‌లో సీఎం చంద్రబాబు వివరించారు. గత ఐదేళ్లలో రూ.10 లక్షల కోట్ల అప్పులు తీసుకువచ్చారని, దానికి తోడు మరో రూ. లక్షన్నర కోట్లకు పైగా పెండింగ్ బిల్లులు పెట్టిపోయారని చంద్రబాబు తెలిపారు. ఈ పరిణామాల నుంచి రాష్ట్రాన్ని ఆర్థికంగా గట్టెక్కించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కూడా ప్రజంటేషన్‌లో చంద్రబాబు పేర్కొన్నారు. పోర్టులు, లాజిస్టిక్ పార్కులు, పరిశ్రమలు వచ్చేందుకు అనువైన వాతావరణాన్ని ఎలా తయారు చేస్తోంది. పోర్టు ఆధారిత అభివృద్ధికి ఉన్న మార్గాలపై కూడా వివరించి అందుకు సహకరించాలని కోరారు. డీప్ టెక్నాలజీ, గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ ఎనర్జీ, ఏఐకు సంబంధించిన విషయాలను ఎలా ఉపయోగించుకోవాలనే విషయాలపై ప్రజంటేషన్‌లో సవివరంగా సీఎం చంద్రబాబు చెప్పారు. తిరిగి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరిస్తూనే.అన్ని అంశాల్లో నీతి ఆయోగ్ కూడా తగిన సహకారం ఇవ్వాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న అవకాశాలను, అభివృద్ధి ఆకాంక్షలను ముఖ్యమంత్రి వివరించారు. ఆవిష్కరణలు సాంకేతికత అందించడం, నూతన విధానాల అమలుకు తోడ్పడటంలో నీతి ఆయోగ్ సహకారాన్ని ఈ సందర్భంగా కోరారు. ఏపీ ప్రతీ ఏటా 15 శాతం వృద్ధి రేటు సాధించి 2047 కల్లా 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను నెలకొల్పేందుకు, తద్వారా 42 వేల డాలర్ల తలసరి ఆదాయానికి అందరూ చేరుకునేలా ప్రయత్నిస్తున్నట్టు ముఖ్యమంత్రి చెప్పారు. నీతి ఆయోగ్ మద్దతు ఉంటే రాష్ట్రం మరింత ముందుకు వెళ్తుందని... వికసిత్ భారత్ 2047 సాధనలో ఏపీ మోడల్ స్టేట్‌గా ఉంటుందని ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేయగా, కేంద్రానికి - రాష్ట్రానికి ఇది అనుకూల సమయమని, అభివృద్ధికి ఎంతో ఆస్కారముందని ఇందులో నీతి ఆయోగ్ భాగస్వామ్యం కూడా కచ్చితంగా ఉంటుందని సుమన్ బేరీ అన్నారు.

**స్వర్ణాంధ్ర2047పైనే దృష్టి పెట్టాం:** ఆర్థిక వృద్ధి, నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమలు, సుస్థిరత ప్రధానాంశాలుగా స్వర్ణాంధ్ర2047పై ప్రధానంగా దృష్టిపెట్టామని ముఖ్యమంత్రి అన్నారు. మానవాభివృద్ధి ఉత్తమపాలన అంశాల్లో గ్లోబల్ లీడర్‌గా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దాలని భావిస్తున్నామని చెప్పారు. అయితే రాష్ట్రం కొన్ని సవాళ్లను ఎదుర్కొంటోందన్నారు.. అందులో ముఖ్యంగా రాష్ట్ర విభజన వల్ల రెండు రాష్ట్రాల మధ్య తలెత్తిన ఆర్థిక వివాదాలు ఇప్పటికీ పరిష్కారం కాకపోవడం, రాష్ట్ర ఆదాయానికి గ్రోత్ ఇంజిన్ వంటి హైదరాబాద్‌ను కోల్పోవడం, ఏపీ పూర్తిగా వ్యవసాయ ఆధారిత రాష్ట్రం కావడం, గత ప్రభుత్వం ఐదేళ్ల పాటు మూలధన వ్యయంపై నిర్లక్ష్యం చూపడం, మౌలికవసతులను కల్పించకపోవడం వంటివి ఉన్నాయని చెప్పారు. ఏపీ దేశంలో 3వ అతిపెద్ద తీర ప్రాంతం కలిగి ఉండటం, పోర్టులురైల్వేహైవేలతో అతిపెద్ద కనెక్టవిటీ, 3 ఇండస్ట్రియల్ కారిడార్లు, తూర్పు ఆగ్నేయాసియాకు గేట్ వే కావడం, పునరుత్పాదకత విద్యుత్, డేటా టెక్నాలజీలో పెట్టుబడులను ఆకర్షించడం ఏపీకి ప్రధాన సానుకూలాంశాలుగా తెలిపారు.

**రాష్ట్రంలో 3 గ్రోత్ హబ్‌లు ఏర్పాటు:** దేశంలోని 4 గ్రోత్ హబ్‌లో ఒకటిగా ఉన్న విశాఖపట్నం ఎకనమిక్ రీజియన్ (వీఈఆర్)తో పాటు తిరుపతి అమరావతిని రీజినల్ గ్రోత్ హబ్‌లుగా మలిచేందుకు నీతి ఆయోగ్ సహకారం అందించాలని ముఖ్యమంత్రి కోరారు. బ్లూ ఎకానమీ, గ్రీన్ హైడ్రోజన్, ఏఐ డెవలప్మెంట్... గ్రోత్ ఇంజిన్లుగా గుర్తించామని అన్నారు. డేటా సేకరణ, బెస్ట్ ప్రాక్టీసెస్, స్ట్రాటజిక్ పార్టనర్‌షిప్స్, ప్రైవేట్ పెట్టుబడులను ఆకట్టుకోవడం, ఎఫ్‌డీఐ, రిసోర్స్ మొబిలైజేషన్ తదితర విషయాల్లోనూ నీతి ఆయోగ్ కీలకపాత్ర పోషించాలనే ఆకాంక్షను ముఖ్యమంత్రి వెల్లడించారు. ఇందులో భాగంగా ప్రతి మూడు నెలకు సమీక్ష చేయాలన్నారు. ఇండస్ట్రియల్ కారిడార్లు, స్కిల్లింగ్ హబ్స్, స్మార్ట్ సిటీలు, మౌలిక వసతుల బలోపేతంలో ఏపీ ప్రభుత్వం నీతి ఆయోగ్ కలిసి పనిచేయాలని ప్రతిపాదించారు. ఏపీ తీసుకున్న కీలక కార్యక్రమాలైన నదుల అనుసంధానం, పీ4 విధానం ద్వారా పేదరిక నిర్మూలన, 2047 విజన్‌లోని పది ప్రధాన సూత్రాల అమలుకు నీతి ఆయోగ్ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. 3 సీ పోర్టులు, 3 ఎయిర్ పోర్టులు ఉన్న తిరుపతిచెన్నయ్‌నెల్లూరును ట్రై సిటీగా తీర్చిదిద్దితే ఆ ప్రాంతం అభివృద్ధిలో దూసుకు వెళ్తుందని అన్నారు.

**కారు దగ్గరకు వెళ్లి మరీ వీడ్కోలు:** హైదరాబాద్‌లో తాను అభివృద్ధి చేసిన జినోమ్ వ్యాలీలో ఇప్పుడు 700 కంపెనీలు కార్యకలాపాలు సాగిస్తున్నాయని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. ఇదే స్ఫూర్తితో అత్యుత్తమ పాలసీలను ఏపీలో అమలు చేయాలనేది తమ విధానమని ముఖ్యమంత్రి చెప్పారు. 2029 కల్లా రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న డీజిల్ బస్సుల స్థానంలో 11 వేలకు పైగా ఈవీ బస్సులను ప్రవేశ పెట్టాలని భావిస్తున్నట్టు, అలాగే రాష్ట్రంలోని అన్ని బస్ స్టేషన్లపైనా రూఫ్ టాప్ సోలార్ పవర్ యూనిట్లు ఏర్పాటుకు ఆలోచన చేస్తున్నామని చెప్పారు. సచివాలయానికి తొలిసారి వచ్చిన సుమన్ బేరీకి ఘనంగా స్వాగతం పలకడమే కాకుండా సమావేశం అనంతరం ఆయన తిరిగి వెళ్లేటప్పుడు కారు దగ్గరకు వెళ్లి మరీ ముఖ్యమంత్రి వీడ్కోలు పలికారు.

## సౌత్‌కోస్ట్ రైల్వేజోన్‌కు గ్రీన్‌సిగ్నల్

>> టెక్నాలజీ ఆధారిత పారిశ్రామిక అనుసంధానంతో కూడి శిక్షణ దేశవ్యాప్తంగా అమలు చేయాలని నిర్ణయించింది. ప్రధానమంత్రి కౌశల్ వికాస్‌యోజన 4.0కింద పిఎం నేషనల్ అప్రెంటిస్ ప్రమోషన్ స్కీమ్, జన్‌శిక్షన్ సంస్థాన్ స్కీమ్, ఈమూడు కూడా కీలకమైన అంశాలని కేబినెట్‌లో చర్చించారు. ఈ మూడు స్కీమ్‌లను ఇపుడు స్కిల్ ఇండియా పథకం కిందనే అమలుచేస్తున్నారు. ఉపాధి శిక్షణ, పట్టణ, గ్రామీణ జనాభాను కూడా పరిగణనలోనికి తీసుకుని ఈ స్కీం అమలవుతుంది. అంతేకాకుండా అణగారిన వర్గాలనుఅత్యంత సాంకేతిక విలువలున్న వృత్తి విద్యకు చేరువచేయాలని భావిస్తున్నారు. ఇప్పటివరకూ ఈ స్కిల్ డెవలప్‌మెంట్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ కింద 2.27 కోట్లమందికి తర్ఫీదునిచ్చామని కేబినెట్‌లో అధికారులు ప్రధానికి వివరించారు. అలాగే కేబినెట్‌లో జాతీయ సఫాయి కర్మచారి కమిషన్‌ను మరో మూడేళ్లపాటు పొడిగించాలని నిర్ణయించారు. మార్చి 2025నుంచి మరో మూడేళ్లపాటు ఈ కర్మచారి కమిషన్‌పనిచేస్తుంది. అంటే 31.03.2028వరకూ పనిచేస్తుంది. మూడేళ్ల పొడిగిపుంతో కమిషన్‌కు రూ.50.91 కోట్లుకేటాయింపులు కూడాచేస్తారు. పారిశుధ్య సిబ్బందికి సామాజిక ఆర్థిక సంక్షేమ అభ్యున్నతికి పాటు పడటంతోపాటు పారిశుధ్యరంగంలో కార్మికులకు ఉన్నమౌలిక వనరులపైనా కృషి చేస్తుంది.

## అమెరికాలో ప్రధాని పర్యటన

>> కుంటారు. అటునుంచి అమెరికాకు వెళ్లి ట్రంప్‌తో భేటీ అవుతారని విదేశాంగశాఖ ప్రకటించింది. ట్రంప్ బాధ్యతలు స్వీకరించిన మూడువారాలకే ఒక దేశ ప్రధానికి ఆహ్వానం రావడం అనేది అత్యంత అరుదైన అంశం అని విదేశాంగశాఖ చెపుతోంది. భారత్ అమెరికా దేశాలమధ్య కొనసాగుతున్న సంబంధాలకు ఈ ఆహ్వానం ఒక నిదర్శనమని ఆయన అన్నారు. ఇప్పటికే గతనెల 27వ తేదీ ప్రధానిమోడీ ట్రంప్‌లు తమ టెలిఫోన్ సంభాషణలో వాణిజ్యం, ఇంధన, రక్షణరంగంలో పరస్పర భాగస్వామ్యం, సహకారాన్ని పెంపొందించుకునే దిశగా మన వ్యూ హాత్మక భాగస్వామ్యం కొనసాగాలని స్పష్టం చేసారు.

### వారం - వర్జ్యం

తేది : 8-02-2025, శనివారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం,
శిశిర ఋతువు, శుక్లపక్షం,
ఏకాదశి రా.8.16
మృగశిర సా.6.06
వర్జ్యం : రా.2.25-4.00
దు.ఉ.6.46-8.20
శుభసమయం : ఉ.8.30-9.15,
సా.3.50-4.30
రాహుకాలం - ఉ.9.00-10.30

### వార్తాఫలం

**మేషం:** ఆర్థికపరిస్థితి సంతృప్తికరంగా వుంటుంది. ఆకస్మిక ప్రయాణాలు లాభిస్తాయి.

**వృషభం :**ముఖ్యమైన విషయాలు తెలుసుకుంటారు. విందు, వినోదాలలో పాల్గొంటారు.

**మిథునం:**పనులలో ఆటంకాలు ఎదురైన అధిగమిస్తారు. రుణాలు తప్పవు. వాహన యోగం.

**కర్కాటకం :** కుటుంబ సమస్యలు ఎదురైన నిదానంగా పరిష్కరించు కుంటారు. వాహన సౌఖ్యం. కాంట్రాక్టులు దక్కుతాయి.

**సింహం:**ముఖ్యమైన వ్యవహారాలు ముందుకు సాగవు. ధనవ్యయం పెరుగుతుంది. క్రయ విక్రయాలలో ప్రోత్సాహం.

**కన్య:** కొత్త వస్తువులు, గృహం, స్థలం కొనుగోలు యత్నాలు వాయిదా వేస్తారు. రుణఒత్తిడులు ఉంటాయి.

**తుల :** గృహ నిర్మాణ ఆలోచనలు నిలకడగా వుండవు. ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి.

**వృశ్చికం:** బంధువులను కలిసి కష్టసుఖాలను పంచుకొంటారు. శుభవార్తలు వింటారు. ఇంటా బయటా ప్రోత్సాహం.

**ధనుస్సు:** సంఘంలో ఆదరణ పొందుతారు. కొత్త వస్తువులు, వస్త్రాలు కొనుగోలు చేస్తారు.

**మకరం:** దూరప్రాంతాల నుండి శుభవార్తలు వింటారు. వాహనయోగం. సోదరుల నుండి సాయం పొందుతారు.

**కుంభం:** రుణాలు చేయాల్సి వస్తుంది. మిత్రుల నుండి వత్తిడులు ఎదురైతాయి. క్రయవిక్రయాలలో లాభాలు.

**మీనం:** ధనవ్యయం. పనులలో నిదానం అవసరం. చికాకులకు దూరంగా వుండండి. బంధువుల నుండి విలువైన సమాచారం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## టీమ్ స్పిరిట్‌తో పనిచేయండి

### ఫైళ్ల క్లియరెన్స్‌లో ర్యాంకులు పని మెరుగుపడేందుకే..

### పాలనలో వేగం పెంచాలి

### ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయొద్దు: సిఎం చంద్రబాబు

విజయవాడ.ఫిబ్రవరి7,ప్రభాతవార్తప్రతినిధి: అసాధారణ, వేగవంతమైన పనితీరు చూపితే తప్ప విధ్వంస రాష్ట్రంలో పునర్నిర్మాణ ఫలితాలను ప్రజలకు చూపలేమని సీఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు. టీమ్ వర్క్‌గా పని చేసినప్పుడే ఉత్తమ ఫలితాలు సాధించగలమని తాను విశ్వసిస్తానని అన్నారు. ఎప్పటికప్పుడు ప్రతి ఒక్కరు టీం స్పిరిట్‌తో పనితీరుపై సమీక్షించుకుని పనిచేయాలన్నదే తమ ఆలోచనగా పేర్కొన్నారు. అందులో భాగంగానే ఫైళ్ల క్లియరెన్స్ లో మంత్రులకు ర్యాంకులు ఇచ్చామని తెలిపారు."ఎక్స్" వేదికగా ఆయన ఈ వ్యాఖ్యలు చేసారు. దస్త్రాల పరిష్కారంలో నిన్న విడుదల చేసిన ర్యాంకులు ఎవరినీ ఎక్కువ చేయడానికి కాదు, అలాగే ఎవరినీ తక్కువ చేయడానికి కాదని సీఎం స్పష్టం చేశారు. ఎవరు ఏ స్థానంలో ఉన్నారనేది చెప్పడం ద్వారా తమతో తాము పోటీ పడటంతో పాటు, ఒకరితో ఒకరు పోటీ పడి పని చేయడానికి, పాలనలో వేగం పెంచేందుకు చేసిన ప్రయత్నమే ఇదని తెలిపారు. ఫైళ్ల క్లియరెన్స్ విషయంలో తాను కూడా తన స్థానాన్ని మరింత మెరుగుపరుచుకోవాల్సి ఉందని అన్నారు. ప్రజలు అపారమైన నమ్మకంతో 2024 ఎన్నికల్లో 93 స్ట్రైక్ రేట్‌తో చారిత్రాత్మక తీర్పును ఇచ్చి గెలిపించారని వారి ఆశల్ని, ఆకాంక్షల్ని నెరవేర్చేందుకు తొలిరోజు, తొలిగంట నుంచి ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వ పాలనలో విధ్వంసమైన వ్యవస్థలను గాడిలో పెట్టేందుకు శాయశక్తులా కష్టపడుతున్నామని సీఎం అన్నారు. ఎదురవుతున్న సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొని సుపరిపాలనతో సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని తెలిపారు. ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని స్పష్టం చేశారు. లక్ష్యాలను వేగంగా చేరుకోవాలంటే ప్రభుత్వంలో ఉన్న ప్రతి ఒక్కరూ కష్టపడాలని సీఎం సూచించారు. గ్రామ స్థాయిలో చిరు ఉద్యోగి నుంచి సీఎం వరకు అంతా కష్టపడి సమిష్టిగా పని చేస్తేనే ప్రజల సమస్యలు, కష్టాలు తీర్చి సమస్యల సుడిగుండంలో ఉన్న రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలబెట్టగలమని అన్నారు. అమరావతితో పాటు ఇతర ప్రాంతాలు దేశాల్లో కూడా గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్‌లు ఏర్పాటుకు ప్రయత్నిస్తామన్నారు. దావోస్ వెళ్లి ఎన్ని డబ్బులు ఎన్ని ఒప్పందాలు చేసుకున్నారని దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ అంశంలో మనం ప్రజలకు అన్ని వివరించాలన్నారు.2047 నాటికి 15 శాతం వృద్ధి రేటుతో 58 లక్షల తలసరి ఆదాయం నమోదు చేయించడమే తమ లక్ష్యమని ముఖ్యమంత్రి వెల్లడించారు. తమ లక్ష్యాల సాధనలో భాగస్వామి కావాలని బిల్ గేట్స్‌ను కోరానన్నారు. బిల్ మిలిందా గేట్స్ ఫౌండేషన్ ద్వారా సహకారం అందించాలని కోరి నట్లు తెలిపారు. డీప్ టెక్ , అగ్రి టెక్ లాంటి సాంకేతికతను లక్ష్యాల సాధనకు వినియో గించుకుంటామని అన్నారు. దేశంలో సంస్క రణలు వచ్చి 30 ఏళ్లు అయ్యింది కానీ ఇంకా చాలా వ్యత్యాసాలు ఉన్నాయన్నారు. అందుకే పీ4 విధానం తెచ్చామని పేర్కొన్నారు. తొలి నాళ్లలో పీసీఅంటే పోలీస్ కానిస్టేబులు అని ఎగతాళి చేశారన్నారు. ఇతర రాష్ట్రాలతో పెట్టు బడుల కోసం పోటీ పడినా, కోపరేటివ్ ఫెడరల్ స్పిరిట్‌తోనే ముందుకు వెళ్లాలని అన్నారు.

# ఎర్రచందనం ఒక అరుదైన జాతి, దాని పరిరక్షణ చాలా ముఖ్యం

## డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్



**విజయవాడ, ఫిబ్రవరి7,ప్రభాతవార్తప్రతినిధి:** ఎర్రచందనం ఒక అరుదైన జాతి, దాని పరిరక్షణ చాలా ముఖ్యమని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. ఎర్రచందనం సంరక్షణపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పవన్ కల్యాణ్ ట్వీట్ చేశారు. 195 ఎర్రచందనం దుంగలను గుర్తించి స్వాధీనం చేసుకోవడంలో ఏపీ అటవీ శాఖ, రెడ్ శాండల్స్ యాంటీ స్మగ్లింగ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు, సిబ్బంది కీలక పాత్ర పోషించారని అన్నారు. అక్రమ స్మగ్లింగ్ చేస్తున్న 8 మంది నేరస్తులను పట్టుకున్న అధికారులకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ ఆపరేషన్‌తో ఎంతో విలువైన సహజ సంపదను అధికారులు రక్షించారని చెప్పారు. అధికారుల తిరుగులేని నిబద్ధతకు ఇది నిదర్శనమని అన్నారు. ఇలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలను అరికట్టడంలో మీ అంకితభావం, వేగవంతమైన చర్యలు తీసుకున్న అధికారులను అభినందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వన్యప్రాణులు, అటవీ నేరాలను అరికట్టేందుకు చేస్తున్న అన్ని ప్రయత్నాలకు అండగా నిలుస్తోందని ప్రశంసించారు. ఈ విజయం భవిష్యత్ తరాల వారికి మన అడవులను సంరక్షించేలా చేస్తాయని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

# వాట్సప్‌లో ఇంటర్ హాల్‌టికెట్స్

**విజయవాడ ఫిబ్రవరి 07 ప్రభాతవార్త ప్రతినిధి:** ఇంటర్మీడియట్ పరీక్షల హాల్‌టికెట్లను వాట్సప్ గవర్నెన్స్ లోఅందించేందుకు ప్రభుత్వ నిర్ణయించింది. విద్యార్థులు వాట్సప్ ద్వారా శుక్రవారం నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయం కల్పించింది. ఫీజులు చెల్లించలేదని ప్రైవేటు కళాశాలల హాల్‌టికెట్లు ఆపేయడం వంటి ఘటనలు లేకుండా ఈ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే వాట్సప్ గవర్నెన్స్ ద్వారా 161 సేవలను అందిస్తున్న విషయం తెలిసిందే. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం కలిపి 10 లక్షలకు పైగా విద్యార్థులు ఉన్నారు. వాట్సప్ నంబరు 9552300009 ద్వారా వారంతా హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. త్వరలో పదో తరగతి విద్యార్థులకు సైతం ఇలాంటి అవకాశం కల్పించాలని విద్యాశాఖ భావిస్తోంది. ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షల కేంద్రాల్లో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి, వాటిని ఇంటర్మీడియట్ విద్యామండలి కార్యాలయానికి అనుసంధానం చేయనున్నారు. ఈ నెల 10 నుంచి 20 వరకు ప్రాక్టికల్ పరీక్షలు జరగనున్నాయి.

# జగన్ హయాంలో ఇసుక తవ్వకాలపై సుప్రీంకోర్టులో విచారణ

**విజయవాడ ఫిబ్రవరి 7 ప్రభాతవార్త ప్రతినిధి:** జగన్ ప్రభుత్వ హయాంలో జరిగిన ఇసుక అక్రమ తవ్వకాలపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. జస్టిస్ అభయ్ ఎస్.ఓకా, జస్టిస్ ఉజ్జల్ భూయాన్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. తాము చేస్తున్న ఇసుక అక్రమ తవ్వకాలన్నీ నిలిపివేసినట్లు జయప్రకాశ్ వెంచర్స్ తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. మరోవైపు గత విచారణ తర్వాత తీసుకున్న చర్యలను వివరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నివేదిక దాఖలు చేసింది. తదుపరి చర్యలు , తాజాగా తీసుకున్న చర్యలను వివరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నివేదిక దాఖలు చేసింది. తదుపరి చర్యలు తాజాగా తీసుకున్న నిర్ణయాలతో తుది నివేదిక దాఖలు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. కేంద్ర పర్యావరణశాఖ గమనించిన విషయాలు తీసుకున్న చర్యలతో అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశాల జారీ చేసింది. అనంతరం తదుపరి విచారణకు ఏప్రిల్ 7 కు ధర్మాసనం వాయిదా వేసింది.

# అలాంటి వ్యక్తినైతే జగన్ అక్రమాస్తుల కేసులో ఇరుక్కునేవాడిని కాదు: మాజీ ఎంపి మోపిదేవి

**విజయవాడ ఫిబ్రవరి 7 ప్రభాతవార్త ప్రతినిధి:** తాను ప్రలోభాలు, ఒత్తిళ్లకు లొంగే వ్యక్తినో, కాదో వైకాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు జగన్ అంతరాత్మకే తెలుసని మాజీ ఎంపీ మోపిదేవి వెంకటరమణ అన్నారు. మోపిదేవి ఎంపీ పదవికి రాజీనామా చేసి, ఇటీవల వైకాంగ్రెస్‌పార్టీ ను వీడారు. ఈ నేపథ్యంలో గురువారం జగన్ చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. ఒత్తిళ్లు, ప్రలోభాలకు లొంగే వ్యక్తినైతే జగన్ అక్రమాస్తుల కేసులో ఇరుక్కునేవాడిని కాదని మోపిదేవి వెంకటరమణ వ్యాఖ్యానించారు. జగన్‌ను నమ్మి మోసపోయినన్నారు. పదవులు ముఖ్య మనుకుంటే వాటిని పట్టుకుని వెలాడే వాళ్ళమన్నారు. తమకు విలువలు, విశ్వసనీయత గురించి జగన్ చెప్పడం విడ్డూరమన్నారు. ఇటీవల వైకాపాను వీడి తెదేపాలో చేరిన మరో నేత డొక్కా మాణిక్య వరప్రసాద్ జగన్ వ్యాఖ్యలపై స్పందించారు. విశ్వసనీయత, విలువల గురించిమాట్లాడే హక్కు ఆయనకు లేదన్నారు.

# విజయవాడలో కృష్ణాబోర్డు ఏర్పాటు చేయండి

## జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్‌తో కెఆర్ఎంబి సభ్యకార్యదర్శి రాయ్‌పురి చర్చలు

**విజయవాడ,ఫిబ్రవరి7,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడకు కృష్ణాబోర్డు ఏర్పాటు, కార్యకలపాల నిర్వహణకు కేఆర్ఎంబీ కార్యాలయం కోసం భవనం కేటాయించాలని ఏపీ ప్రభుత్వం డిమాండ్ చేసింది. ఈ క్రమంలో జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ తో కేఆర్ఎంబీ సభ్య కార్యదర్శి రాయ్ పురితో భేటీ అయ్యారు. కృష్ణా నదీ యాజమాన్య బోర్డుకు నిర్వహణకు ఏపీ తరపున నిధుల కేటాయింపుపై చర్చించారు. కృష్ణా బోర్డును విజయవాడ తరలించే అంశంపై కూడా ఇరువురి మధ్య చర్చ జరిగింది. విజయవాడలో కేఆర్ఎంబీ కార్యాలయం కోసం భవనం కేటాయించాలని రాయ్ పురి కోరారు. త్వరలోనే కేటాయిస్తాం: బోర్డు కార్యకలాపాలకు అనువుగా ఉండే కార్యాలయాన్ని త్వరలోనే కేటాయిస్తామని సాయిప్రసాద్ తెలిపారు. కార్యాలయానికి అవసరమైన వసతి ఏర్పాటు చేస్తామని సాయిప్రసాద్ పేర్కొన్నారు. అదే విధంగా బోర్డుకు సంబంధించిన పలు అంశాలు ఇద్దరి మధ్య చర్చకు వచ్చాయి. తెలంగాణ ప్రతిపాదించిన మూడో దశ టెలీమీటరీ వ్యవస్థ ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ అభ్యంతరం తెలిపింది. ఇప్పటికే రెండు దశల్లో టెలీమీటర్ల ఏర్పాటుకు అంగీకరించామని, నిధులు సైతం తామే భరిస్తున్నామని చెప్పారు. మూడో దశలో తెలంగాణ ప్రతిపాదించిన టెలీమీటర్లు తమ అంతర్గత అవుట్‌లెట్‌ల వద్దవి అని, ఇది ఏ మాత్రం తగదని తెలియజేశారు. కేవలం నాగార్జునసాగర్ కుడి వైపున మాత్రమే సీఆర్‌పీఎఫ్ భద్రతా ఏర్పాట్లు చేయడం సరికాదని చెప్పారు. రెండు ప్రభుత్వాలు కూడా సీఆర్‌పీఎఫ్ భద్రత అవసరం లేదని తెలియజేసినందున, భద్రతను తొలగించాలని కోరారు. అయితే తాము కేంద్ర జల్‌శక్తితో సంప్రదించిన తర్వాత మాత్రమే దీనిపై నిర్ణయం తీసుకోగలమని కేఆర్ ఎంబీ పేర్కొంటోంది. సీఆర్‌పీఎఫ్ కాకుండా సీఐఎస్ ఎఫ్ భద్రతా దళాలు ఏర్పాటు అంశం కూడా ఇరువురి మధ్య చర్చకు వచ్చింది. తాము పూర్తిస్థాయిలో చర్చించిన తరువాతే దీనిపై అధికారికంగా బోర్డుకు లేఖ రాస్తామని సాయిప్రసాద్ తెలిపారు. బోర్డులో ఆంధ్రప్రదేశ్ నుంచి డిప్యుటేషన్‌పై వెళ్లే అధికారులు 3 సంవత్సరాలు పని చేసేందుకు, అవసరమైతే మరో రెండు సంవత్సరాలు పొడిగించేలా అవకాశం ఉండాలని నిర్ణయించుకున్నారు. అదే విధంగా బోర్డుకు ఎవరిని పంపినా, వారి పదవీకాలం మరో మూడు సంవత్సరాలు కచ్చితంగా ఉండేలా చూడాలని రాయ్‌పురి తిరిగి కోరారు. ఎస్‌ఈల విషయంలో ఆ నిబంధన అనుసరించలేమని ఆంధ్రప్రదేశ్ అధికారులు చెప్పారు. కేఆర్ ఎంబీకి ఎస్‌ఈ స్థాయి అధికారిని డిప్యుటేషన్‌పై పంపేందుకు అంగీకరించారు. ఈ సమావేశంలో సాయిప్రసాద్, రాయ్ పురితో పాటు ఇంజినీర్ ఇన్ చీఫ్ ఎం.వెంకటేశ్వరరావు, రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీనివాసుడి చెంతనే దంపతులు ఆత్మహత్య

## - అనారోగ్యంకారణంతోనే బలవన్మరణం



**తిరుమల,ఫిబ్రవరి 7ప్రభాతవార్తప్రతినిధి:** అనారోగ్యంకారణంతో నాలుగేళ్ళక్రిందట స్వచ్ఛంద పదవీవిరణ చేసిన పోలీసు హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు నాయుడు(60), భార్య అరుణ(55) ఏడుకొండల వేంకటేశ్వర స్వామి చెంత ఉరిపోసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఈ సంఘటన గురువారం సాయంత్రం చోటుచేసుకోగా శుక్రవారం ఉదయం గది ఖాళీచేయాల్సి ఉండగా భక్తుల ఆచూకీ తెలియకపోవడంతో టిటిడి సిబ్బంది గదిని తెరచి చూడగా లోపలే చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని వుండటం కనుగొన్నారు. తిరుమల 2టౌన్ సిఐ రాముడు తెలిపిన వివరాలమేరకు.....తిరుపతి జిల్లాలో తిరుపతి క్రైమ్, ఈస్టు, అలిపిరి, సిఐడి,రేణిగుంట పోలీసుస్టేషన్‌లలో ఆయన కోర్టుకానిస్టేబుల్‌గా సమర్ధవంతమైన విదులు నిర్వహించాడు. నాలుగేళ్ళక్రిందట అనారోగ్యంతో ఆయన స్వచ్ఛందపదవీవిరమణ చేశారు. వీరికి కుమార్తె,కుమారుడు ఉన్నారు. అల్లుడు కూడా పోలీసుశాఖలోనే పనిచేస్తున్నాడు. పదవీవిరమణ చేసినప్పటినుండి శ్రీనివాసులునాయుడు అరుణ దంపతులు తిరుపతిలోని అబ్బన్నకాలనీలో నివాసముంటున్నారు. ఆయన భార్యతో కలసి గురువారం ఉదయం తిరుమలకు వచ్చారు. నందకం విశ్రాంతి గృహంలో గదిని తీసుకున్నారు. గురువారమే దర్శనానికి వెళ్ళి దేవదేవుడిని దర్శించుకుని తమ మొర వినిపించారు. తిరిగి గదికి చేరుకున్నారు. దర్శనానంతరం వీరు తిరుపతికి దిగాల్సి ఉన్నా తిరుమలలోనే బసచేశారు. ఇద్దరూ బలమైన కారణాలతో ఒక నిర్ణయానికి వచ్చి దంపతులు ఒకేసారి లోకం విడిచిపెట్టి వెళ్ళారు. అయితే తరచూ తిరుమలలోనే ప్రాణాలు విడవాలని నమ్మకాన్ని ఆయన పలుమార్లు తన తోటి మిత్రులతో అనేవాడని, ఇప్పుడు ఈ విషాదానికి ఒడిగట్టడంతో కుటుంబసభ్యులు, స్నేహితులు, బంధువులు కన్నీటిపర్యంతమయ్యారు. గురువారం ఉదయం స్వామివారి దర్శనం బాగా జరిగిందని, మా చావుకు ఎవరూ కారణం కాదని, మాచావుకు మేమే కారణమని ఆత్మహత్యకు ముందు చీటిరాసి పెట్టారు. తమ దహనక్రియలకు బీరువాలో ఉన్న డబ్బును వాడాలని తమ్ముడికి సూచిస్తూ చీటిలో పేర్కొనడం కొంత పథకం ప్రకారమే ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులుభావిస్తున్నారు. విషయం తెలియగానే తిరుమల 2టౌన్ సిఐ రాముడు నందకం చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టమ్ నిమిత్తం తిరుపతి రుయా మార్చురీకి తరలించారు. విశ్రాంత పోలీసుహెడ్‌కానిస్టేబుల్ దంపతులు ఒకేసారి ఈలోకాన్ని విడిచిపెట్టడం పోలీసుకుటుంబాలను కలచివేసింది. తిరుమల 2టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

# ఆర్టీజిఎస్ పనితీరు ఆదర్శవంతం

## బోత్సవానా దేశ ప్రభుత్వ సలహాదారు ఆర్బన్ బసిమా దబుత

**సచివాలయం. ఫిబ్రవరి 7. ప్రభాతవార్త.** ఆర్టీజీఎస్ పనితీరు ఆదర్శనీయమని ఆఫ్రికా దేశాల్లో ఒకటైన బోత్సవానా దేశ ప్రతినిధులు ప్రశంసించారు. బోత్సావాన దేశ ప్రభుత్వ సలహాదారు ఆర్బన్ బసిమా దబుత శుక్రవారం సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్టీజీఎస్ ముఖ్య కార్యనిర్వహణాధికారి కె.దినేష్ కుమార్ ఆయనకు స్వాగతం పలికి, ఆర్టీజీఎస్ పనితీరు గురించి వివరించారు. సీఎం చంద్రబాబు ఆలోచనల నుంచి ఆర్టీజీఎస్ వ్యవస్థ రూపుదిద్దుకుందన్నారు. ప్రభుత్వానికి, పౌరులకు మధ్య ఈ సంస్థ ఒక వారధిగా పనిచేస్తుందన్నారు. ప్రభుత్వం ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో ఆర్టీజీఎస్ సాంకేతిక సహకారాన్ని అందిస్తుందని చెప్పారు. ప్రభుత్వంలోని వివిధ శాఖల మధ్య ఉన్న డేటా అనుసంధానం చేసి ఒక డేటా లేక్ ఏర్పాటు చేసి, ప్రభుత్వ సేవలను మరింత సరళతరం చేయడంలో ఈ సంస్థ దోహదపడుతుందని వివరించారు. డీప్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, డ్రోన్స్ తదితర సాంకేతిక సదుపాయలన్నీ ఉపయోగించుకోవడానికి ప్రత్యేక హబ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఒకే చోట అన్ని సేవలు సులభంగా పొందేలా ప్రభుత్వం ప్రజలకు వాట్సాప్ గవర్నెన్స్ ను అందిస్తుందన్నారు. ఇందులో ప్రస్తుతం 161 సేవలు అందిస్తున్నామని, తదుపరి అన్ని రకాల సేవలు ఇందులోనే పౌరులు పొందేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు వివరించారు. బోత్సావాన దేశ ప్రభుత్వ సలహాదారు ఆర్బన్ బసిమా దబుతా మాట్లాడుతూ ఆర్టీజీఎస్ పనితీరు గురించి విని తాము ఈ కేంద్రిన్ని సందర్శించి స్వయంగా దీని పనితీరు తెలసుకోవాలని వచ్చామన్నారు. ఈ సంస్థ పనితీరు అద్భుతంగా,

ఆదర్శనీయంగా ఉందన్నారు. తమ దేశంలో కూడా పౌరులకు మెరుగైన సేవలందించేలా ఈ తరహా వ్యవస్థ ఏర్పాటు చేసుకునే అంశాన్ని పరిశీలిస్తున్నామన్నారు.

ఈ సమావేశంలో ఆర్టీజీఎస్ డిప్యూటీ సీఈఓ మాధురి తదితర అధికారులు పాల్గొన్నారు.

# జగన్‌కు ఓర్పు అవసరం: మాజీ ఎంపి విజయసాయిరెడ్డి హితవు

**విశాఖపట్నం, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మో హన్రెడ్డికి ఓర్పు అవసరమని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి సూచించారు. విజయ సాయిరెడ్డిని ఉద్దేశిస్తూ జగన్ మోహన్ రెడ్డి చేసిన కామెంట్స్ పై ఆయన స్పందించారు. జగన్కు ఇప్పటికే చాలా మంది శత్రువులున్నారు. రాజకీయాల్లో సహజంగా ప్రత్యర్థులుంటారు. రాజకీయాల్లో పరిస్థితులు ఎలాంటి వాళ్లనైనా ఒక్కోసారి వెనకడుగు వేసేలా చేస్తుంటాయి. తెలివిగా నడుచుకుంటేనే భవిష్యత్ వుంటుంది అని విజయ్ సాయి రెడ్డి హితో పలికారు. మొండిగా ముందుకుపోతే ఇబ్బందులు తప్పవు. ఈ విషయంలో జగన్ వైఖరి కొంత భిన్నంగా వుంటోంది అని సాయిరెడ్డి అభిప్రాయపడ్డారు. ట్విట్టర్ వేదికగా ఆయన జగన్ పై కామెంట్స్ చేశారు. ఇంకా మూడేళ్లకు పైగా రాజ్యసభ పదవీ కాలం వుండగానే, అది కూడా వైసీపీ ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న తరుణంలో విజయసాయిరెడ్డి రాజీనామా నైతికంగా జగన్కు పెద్ద దెబ్బే. అయితే పార్టీ నడిపే నాయకుడికి కాస్త ఓర్పు వుండాలి అని ఆయన చెప్పారు. జీవితంలో కూడా విలువలు, విశ్వసనీయత, క్యారెక్టర్ ఉన్న వాడిని కాబట్టే, ఎవరికి ఎలాంటి ప్రలోభాలకి లొంగలేదు. భయం అనేది నాలో ఏ అణువు అణువు లోను లేదు కాబట్టే రాజ్యసభ పదవిని, పార్టీ పదవుల్ని మరి రాజకీయాలనే వదులుకున్నానని సాయి రెడ్డి స్పష్టం చేశారు.

# జెసి కుటుంబీకులు శ్రీశైలంలో ప్రత్యేక పూజలు

## - అమ్మవారికి బంగారు తాబేలు, బంగారు పళ్లెం బహూకరణ



శ్రీశైలంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి, టిడిపి నేత జెసి పవన్‌రెడ్డి, తాడిపత్రి

**అనంతపురం, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త బ్యూరో** శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానంలో శుక్రవారం జెసి కుటుంబం ఆధ్వర్యంలో భ్రమరాంబిక అమ్మ వారికి బంగారు తాబేలు, బంగారు పళ్లెంని సమర్పించారు. ఈ సందర్భంగా జెసి కుటుంబీకులు అందరూ పాల్గొని వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపి జెసి దివాకర్‌రెడ్డి దంపతులు, మాజీ ఎమ్మెల్యే ప్రస్తుత తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి దంపతులు, టిడిపి నేత జెసి పవన్‌రెడ్డి దంపతులు, తాడిపత్రి ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి దంపతులు, ఇతర మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

# వివాహ వేడుకల్లో వైఎస్.విజయమ్మ

## - పలువురు వైఎస్సార్సీ నేతలు హాజరు



**అనంతపురం, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త బ్యూరో** శ్రీశైలం దేవస్థానం పాలకమండలి మాజీ సభ్యులు ఒంటెద్దు మధుసూధన్‌రెడ్డి, శైలశ్రీల కుమారుడు హేమంత్‌రెడ్డి, సుస్మితల వివాహం ఆదివారం కెటిఆర్ ఫంక్షన్ హాల్‌లో కన్నుల పండువగా జరిగింది. ఈ వివాహ వేడుకల్లో దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి సతీమణి వైఎస్.విజయమ్మ పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు. హిందూపురం మాజీ ఎంపి గోరంట్ల మాధవ్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మధుసూధన్‌రెడ్డి, రాష్ట్ర రజక అభివృద్ధి సంస్థ మ ఆజీ అధ్యక్షులు సుగుమంచిపల్లి రంగన్న, రాప్తాడు మార్కెట్‌యార్డు మాజీ అధ్యక్షులు గోపాల్‌రెడ్డి, వైసిపి నాయకులు పామిడి వీరాంజినేయులు, అనంత చంద్రారెడ్డి, ఒంటెద్దు శ్రీకాంత్‌రెడ్డి, ఇతర ముఖ్య ప్రసన్నాయనపల్లి మహానందిరెడ్డి, బోయ నరేంద్ర పాల్గొన్నారు.

# బిసిల పక్షపాతి చంద్రబాబు:బిసి సంఘం అధ్యక్షుడు డా.మారేష్

**విజయవాడ, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బిసిల పక్షపాతి అని నామినేటెడ్ పదవుల్లో 34శాతం రిజర్వేషన్లు కలి ్పంచడం చారిత్రాత్మక నిర్ణయని ఆంధ్రప్రదేశ్ బిసి సంఘం రాష్ట్రాధ్యక్షుడు డా మారేష్ అన్నారు. విజయవాడ లోని బిసి సంఘం రాష్ట్ర కార్యాలయంలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిసిల చిరకాల కోరిక అయిన బిసి బిల్లు పార్లమెంట్లో పెట్టి ఆమోదించే నిర్ణయాత్మక శక్తి, చొరవ కలిగిన కూటమి ప్రభుత్వంకే సాధ్యమని చంద్రబాబు నాయుడు ఆమేరకు కృషి చేయాలన్నారు.

# తిరుమల సమాచారం

## తెప్పపై వేడుకగా గోవిందరాజుని విహారం



**తిరుమల,ఫిబ్రవరి 7ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడికి అనుబంధంగా ఉన్న తిరుపతి లోని శ్రీగోవిందరాజస్వామి ఆలయం పుష్కరిణిలో శుక్రవారం సాయంత్రం స్వామిఅమ్మవార్లు పార్థసారధి స్వామి అలంకరణలో తెప్పపై విహరించారు. సాయంత్రం నిత్యకైంకర్యాలు ముగిసిన తరువాత స్వామివారి ఉత్సవమూర్తిని పార్థసారదిస్వామిఅలంకరణలోతెప్పపై వేంచేపుచేశారు. ఇక్కడ ఆలయ అర్చకులు కర్పూర హారతులిచ్చి తెప్పను కదిలించారు. భక్తుల గోవిందనామ స్మరణల మధ్య తెప్ప పుష్కరిణిలో మూడుప్రదక్షణలు తిరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఇఒ శాంతి, ఆలయ ఇన్‌స్పెక్టర్ ధనంజయ, భక్తులు,అర్చకులు పాల్గొన్నారు.

## దాతల సహకారం అవసరం ! - అన్ని ట్రస్ట్‌లు, పథకాలకు విరాళాల సేకరణకు టిటిడి కార్యాచరణ !

**ప్రభాతవార్తప్రతినిధి - తిరుమల:** ప్రపంచప్రసిద్ధిగాంచిన హిందూ ధార్మిక సంస్థ తిరుమల తిరుపతి దేవస్థానం దాతలను ప్రోత్సహించే దిశగా కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. భక్తులకు సేవలందించడమేగాక ప్రజలకు అవసరమైన వైద్యం. విద్య పరంగా మెరుగైన సేవలం దించేందుకు టిటిడి ఇప్పటికే చొరవచూపుతోంది. ఇందుకోసం తిరుమల తిరుపతి దేవస్థానం అమలుచేస్తున్న పలు రకాల ట్రస్ట్‌లు, పథకాలను దాతల విరాళాలతోనే నిర్వహిస్తున్నారు. ఎస్వీ అన్నప్రసాదం, ఎస్వీప్రాణదానం, విద్యాదానం, గోసంరక్షణట్రస్ట్, వేదపరిరక్షణట్రస్ట్, ఎస్వీసర్వ శ్రేయట్రస్ట్, బాలాజీ ఆరోగ్యవరప్రసాదిని ట్రస్ట్,కాటేజీ దాతల పథకం వంటి అనేక రకాల పథకాలు టిటిడి నిర్వహిస్తోంది. ఈ విభాగాలన్నిటికీ ఒక డిప్యూటీ ఇఒను నియమించి పర్యవేక్షిస్తోంది. వీటిల్లో ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు ఇప్పటికే దేశవిదేశాల్లోని కోటీశ్వరులైన, ధనవంతులైన భక్తులు దాతలుగా వేల కోట్లరూపాయలు విరాళాలుగా ఇచ్చారు. ప్రాణ దానం ట్రస్ట్‌కు విరాళాలు అందుతున్నాయి. ఇదివరకు టిటిడి దాతల నుంచి నగదు రూపంలో (డిడిలు, చెక్కుల రూపంలో)మాత్రమే విరాళాలు సేక రిస్తోంది. ఇలా పెద్దమొత్తంలో విరాళాలిచ్చిన దాతలకు టిటిడి పలు రకాల ప్రయోజనాలను కల్పిస్తోంది. తిరుమలకు వచ్చిన దాతలకు ఏడాదిలో వసతి, శ్రీవారి దర్శనంలో ప్రత్యేక సౌకర్యాలు కేటాయిస్తుంది. ఇప్పుడు టిటిడి అధికారులు ఎంతో ప్రతిష్టాత్మకంగా ఎస్వీ బాలాజీ ఆరోగ్యవరప్రసాదిని, ఎస్వీ సర్వశ్రేయ ట్రస్ట్‌కు కూడా విరాళాలు సేకరిస్తోంది. తిరుపతిలోని పద్మావతి మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణంలో భాగంగా అవసరమైన వైద్యపరికరాలు విరాళంగా అందించినా ఆ దాతలకు ప్రయోజనాలు అందించేలా ప్రణాళికలు గత పాలకమండలినే రూపొందించింది. వస్తు రూపంలో కూడా విరాళాలిచ్చిన దాతలకు అన్ని రకాల ప్రయోజనాలు వర్తింపజేసేలా నిర్ణయించారు. ఇప్పటికే పలురకాల ట్రస్ట్‌లు, పథకాలకు లక్షలమంది దాతలు ఉన్నారు. ఈ దాతలను మరింతగా ప్రోత్సహించి గోసంరక్షణతో బాటు ప్రాణ దానట్రస్ట్‌ను, ఆరోగ్యవరప్రసాదినిని మరింత బలోపేతం చేసి పటిష్టంగా అమలుచేయడానికి చూస్తున్నారు. దాతలు తమ విరాళాలను ఈ హుండీ ద్వారా,కియోస్క్ పరికరాలతో, ఆన్‌లైన్‌లో, తమతమ బ్యాంకు అకౌంట్ల నుంచి కూడా పంపే సౌలభ్యం తీసుకువచ్చారు.

## ఉత్తరప్రదేశ్ నైమిశారణ్యంలో వైభవంగా శ్రీనివాస కల్యాణం



**తిరుమల,ఫిబ్రవరి 7ప్రభాతవార్తప్రతినిధి:** నిత్యకల్యాణంపచ్చతోరణంగా విరాజిల్లుతున్న కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి ఆలయంలో నిర్వహించే రీతిలోనే ఉత్తరప్రదేశ్ ప్రయాగ్‌రాజ్ మహాకుంభమేళాలో నైమిశారణ్యంలో శుక్రవారం ఉదయం శ్రీనివాసల్యాణం వేడుకగా నిర్వహించారు. నైమిశారణ్యంలోని బాలాజీ ఆలయంలో తిరుమల ఆలయ ప్రధాన అర్చకుడు కృష్ణశేషాచలదీక్షితులు ఆధ్వర్యంలో అర్చకులు శ్రీదేవిభూదేవిసమేల మలయప్ప స్వామి ఉత్సవర్లను కల్యాణవేదికవద్దకు వేంచేపుచేశారు. అక్కడ ఉదయం 11గంటల నుండి 12గంటల వరకు వేదపండితులు వేదమంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, కంకణధారణ, అగ్నిప్రతిష్టాపన, యజమాని సంకల్పం, భక్త సంకల్పం, మాంగళ్యపూజ, మంగళసూత్రధారణ మొదలైన ఘట్టాలతో శాస్త్రోక్తంగా స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు. చివరగా స్వామిఅమ్మవార్లకు నక్షత్రహారతి ,మంగళహారతి సమర్పించడంతో కల్యాణం విజయవంతంగా ముగిసింది. అక్కడ తిలకించిన భక్తులు పులకించారు. ఈ కార్యక్రమంలో టిటిడి డిప్యూటీ ఇఒ శివప్రసాద్, హెచ్‌డిపిపి అదనపు కార్యదర్శి రామ్‌గోపాల్, ఎఇఒ రవి ,భక్తులు పాల్గొన్నారు.

**- గోమతినదీతీరంలో శాస్త్రోక్తంగా చక్రస్నానం:** మహాకుంభమేళ సందర్భంగా నైమిశారణ్యంలోని గోమతినదీతీరంలో శుక్రవారం వేడుకగా టిటిడి చక్రస్నానం నిర్వహించింది. ఉదయం 9గంటల నుండి 10గంటల మధ్య ఈ మహోత్సవం ఆగమోక్తంగా జరిపించారు. నదీతీరంలో చక్రత్తాళ్వారుకు పాలు,పెరుగు, నెయ్యి, తేనె, చందనంతో అర్చకులు అభిషేకం చేశారు. అభిషేక కైంకర్యాన్ని అందుకుని చక్రత్తాళ్వార్ పునీతుడయ్యారు. భక్తులు పుష్కరిణిలో పవిత్రస్నానాలాచరించారు.

## స్వామివారి ఆశీస్సులతో అంతా మంచి జరుగుతోంది

### - పుదుచ్చేరి డిప్యూటీ స్పీకర్ రాజవేలు



**తిరుమల,ఫిబ్రవరి 7ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ మంచి జరుగుతుందని పుదుచ్చేరి డిప్యూటీ స్పీకర్ పి.రాజవేలు ఆకాంక్షించారు. ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు. శుక్రవారం దయం విఐపి బ్రేక్‌లో ఆయన స్వామివారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## దేవదేవుని ఆశీస్సులతో అంతా శుభాలు జరగాలి

### - రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్



**తిరుమల,ఫిబ్రవరి 7ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగ ప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరికీ మంచి జరగాలని, అందరూ సంతోషంగా ఉండాలని రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆకాంక్షించారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని స్వామిని వేడుకున్నట్లు తెలిపారు. శుక్రవారం వేకువజామున ఆయన శ్రీవారి అభిషేకంలో పాల్గొన్నారు. ఆలయం మహద్వారం వద్ద టిటిడి ఇఒ శ్యామలరావు స్వాగతం పలికారు. అభిషేకసేవలో పాల్గొన్న విజయానంద్‌కు ఆలయ అధికారులు శ్రీవారి దర్శనం చేయించారు. టిటిడి ఇఒ శ్యామలరావు, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, డిప్యూటీ ఇఒ భాస్కర్ స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. సిఎస్ వెంట తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వేంకటేశ్వర్, సంయుక్తకలెక్టర్ శుభంబన్సల్ ఉన్నారు.

వార్త

ఒక రాజ్యంలో నివసించే ప్రజల భాషను తెలుసుకోకుండా, ప్రజాభిప్రాయం తెలుసుకోవడం సాధ్యంకాదు.

-బార్కర్

# అక్ర 'మార్కుల' ఆటకట్టించలేమా?

విద్యా సంవత్సరానికి సంబంధించి పరీక్షల తేదీలను ప్రకటించడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులలో టెన్షన్ ప్రారంభమైంది. పరీక్షా విధానంలో మార్పులు, తప్పులు లేని ప్రశ్నపత్రాలు ఇవ్వడంలో విఫలం,లీకులు సర్వసాధారణమైపోయాయి. ఈ యేడాది పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆందోళన చెందడం సహజమే. తెలుగు రాష్ట్రాల్లో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్ ముడిపడి ఉండే ప్రధానంగా పదో తరగతి, ఇంటర్మీడియేట్, కొన్నియూనివర్సిటీలు నిర్వహిస్తున్న డిగ్రీ కోర్సులు, ఇంజినీరింగ్, మెడిసిన్ లాంటి ప్రొఫెషనల్ కోర్సుల ప్రవేశఅర్హత పరీక్షలు, ఇతర కామన్ ఎంట్రన్స్ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించలేకపోతున్నారు. ఇంజినీరింగ్, మెడిసిన్‌కు సంబంధించి కీలకమైన ప్రశ్నపత్రాల్లో గత రెండు, మూడు దశాబ్దాలుగా ఒక్కసారి కూడా తప్పులు లేకుండా ఇవ్వలేకపోయారంటే అధికారగణం అసమర్థతను ఊహించుకోవచ్చు.ఈయేడాది ఎలాంటి తప్పులు లేకుండా ప్రశ్నపత్రాలు రూపొందించి వాటిని పరీక్ష నిర్వహణకు పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు పాలకులు పాత పాటే పాడుతున్నారు. గత అనుభవాల దృష్ట్యా పాలకులహామీలపై నమ్మకం కలగడంలేదు. లీకులు ఒకపక్క, మరొకపక్క తప్పులు, అధికారగణం అసమర్థతను చెప్పకనే చెబుతున్నాయి. ఈ వైఫల్యాల కారణంగా ఎంతోమంది విద్యార్థుల భవిష్యత్ అగమ్యగోచరంగా మారిపోతున్నది. ప్రస్తుతం ఉన్న పాలకుల కాలంలోనే ఈ అవకతవకలు చోటుచేసుకుంటున్నాయని, పరీక్షా నిర్వహణలో సమర్థవంతంగా వ్యవహరిస్తున్నారని చెప్పడం లేదు. ఏనాటి నుంచో ఇది కొనసాగుతున్నది. ప్రశ్నపత్రాలు లీక్ అయిన విషయం కొన్ని సందర్భాల్లో బయటపడుతుంది. ఇలా బయటపడిన సందర్భాల్లో ప్రభుత్వం విధిలేని పరిస్థితుల్లో పరీక్షలను వాయిదా వేస్తున్నది. మళ్లీ పరీక్షలు నిర్వహిస్తున్నది. ఇందుకు గత పదేళ్లలో చూసినా ఎన్నో ఉదహరించవచ్చు. రద్దు అయిన పరీక్షలకు తిరిగి హాజరు కావాల్సిన విద్యార్థుల పరిస్థితి ఒక్కసారి పాలకపెద్దలు మనసుపెట్టి ఆలోచించాలి.రాత్రింబవళ్లు కష్టపడి పరీక్షలకు తయారై రాయాల్సిన సమయానికి అది వాయిదా పడినా లేక రాసిన పరీక్షను రద్దుచేసి మళ్లీ రాయమన్నా ఆ విద్యార్థులు ఎంతటి నిరాశానిస్పృహలకు గురవుతారో పాలకులు ఆలోచించడం లేదు. ఇక ప్రశ్నపత్రాలు లీక్ అయి బయటపడకుండా ఉంటే ఈ ప్రశ్నపత్రాలు కొన్నవారు అందలమెక్కిపోతున్నారు. ప్రశ్నపత్రాల జవాబును కంఠస్థం చేసిన ప్రబుద్ధులు ఎలాంటి కష్టం లేకుండా మేధావులుగా పైకివెళ్లిపోతుంటే సంవత్సరం పొడువునా శ్రద్ధాశక్తులతో కష్టపడి చదివిన మెరికల్లాంటి విద్యార్థులు వెనుకబడిపోతున్నారు.ప్రభుత్వంపరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. ఈ పరీక్షలపై పటిష్టమైన నిఘా ఉంచాలి. అసలు అవి ఏ దశలో లీక్ అవు తున్నాయి?బాధ్యులు ఎవరు? ప్రశ్నపత్రాలుతయారు చేసేవారా?వాటిని సరిచూసి సక్రమంగా ఉన్నాయా?లేదా అని నిర్ధారించేవారా? లేక ఈ ప్రశ్నపత్రాలు రహస్యంగా తయారు చేసి రవాణా చేస్తున్నవారా? లేక పరీక్షా కేంద్రాలకు చేరిన తర్వాత అది నిర్వహిస్తున్న అధికారులా? తదితర విషయాలు క్షుణ్ణంగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది. గతంలో ఒకసారి మెడికల్ ప్రశ్నపత్రాలు రూపొందించిన ప్రొఫెసరే లీక్‌కు బాధ్యుడు కాగా మరొకసారి ఎంసెట్ ప్రశ్నపత్రాలు ముద్రించిన ప్రింటింగ్ యజమాని బాధ్యుడైనట్లు అప్పటి పోలీసుల దర్యాప్తులో వెల్లడయింది. మొత్తం ఇలాంటి కీలకమైన పరీక్షల్లో కూడా అవకతవకలు జరుగుతుండడంతో విద్యావ్యవస్థ ఎంతటి పతనావస్థకు దిగజారిపోతున్నదో స్పష్టమవుతున్నది. చదువుల తల్లి సరస్వతిదేవిని నడిబజారులో విక్రయించేఘోర స్థితి చేరడం, చదివే జీవన్మరణ సమస్యగా రాత్రింబవళ్లు కృషి చేస్తున్న విద్యార్థుల భవిష్యత్ గురించి ఆలోచిస్తే ఆవేదన కలగకతప్పదు. నిత్య అధ్యయనంతో విజ్ఞానం ఆర్జించి పరిశోధనలతో మేధాసంపత్తిని పెంచుకోవాల్సిన విద్యావిధానం డబ్బుతో కొనుక్కునే స్థాయికి దిగజారడం దురదృష్టకరం. ఇందుకు కోచింగ్ సెంటర్లను కానీ, మరి కొన్ని రెసిడెన్షియల్ కాలేజీలనుకానీ నిందించి ప్రయోజనం లేదు.విద్యను వ్యాపారవస్తువుగా మార్చి స్వేచ్ఛగా అమ్ముకునే అవకాశం ప్రభుత్వమే వారికి కల్పించినట్లు పరిస్థితులు చెబుతున్నాయి. వారిలో కూడా కొందరు ఇప్పటికీ విద్యాబోధనే పరమావధిగా భావించే వారు కూడా ఉన్నారు. కానీ తమ కళ్లముందే వెలసిన కోచింగ్ సెంటర్లు అతి స్వల్పకాలంలోనే కోట్లకు పడగెత్తడం చూసిన వారికి ఆ 'ఉన్నతి'ని తాము కూడా సాధించాలనే ఆశ పెరగడం సహజమే. ఆ ఆశే దురాశగా రూపాంతరం చెందినప్పుడు అక్రమాలకు అదుపు ఉండదు. అందుకే వారిని విమర్శించడానికి ముందు ఈ పరీక్షల నిర్వహణకు వేలాదిరూపాయల జీతభత్యాల రూపేణ ప్రజాధనం తీసుకుంటూ బాధ్యత వహిస్తున్న సంబంధిత అధికారులను నిలదీయాలి. ఆశాఖలోని కొందరు అధికారుల అవినీతితో పాటు రాజకీయజోక్యం, ఆశ్రిత పక్షపాతం వల్లనే పరీక్షల కు ఈ దుస్థితి దాపురిస్తున్నది. అంతేకాదు పరీక్షాపత్రాలు లీకైన సందర్భాల్లో కూడా బాధ్యులైన అధికారులపై పటిష్టమైన చర్యలు లేకపోవడం వల్లనే మళ్లీమళ్లీ పునరావృతం అవుతున్నాయి. అక్రమాలకు బాధ్యులైన అధికారులను తొలగించడమే కాదు, క్రిమినల్ ప్రాసిక్యూషన్ చేసివారి ఫొటోలను మీడియా ద్వారా, వాల్‌పోస్టర్ల ద్వారా ప్రజలకు తెలియపరచాలి. ప్రభుత్వం అంత కఠినంగా వ్యవహరించకపోతే డబ్బులతో పరీక్షాపత్రాలు కొనుగోలు చేయాలనే ఆశపడేవారికి, వ్యాపారం చేసేవారికి భయం ఉండదు.



జీవితంలో తృప్తి పడటం నేర్చుకున్న వ్యక్తి ఎన్నడూ విచారానికి గురికాడు. అది చేతకాని వ్యక్తి ఎప్పుడూ దుఃఖానికి గురవుతూనే ఉంటాడు.

జార్జి ఇలియట్



నీ గురించి ప్రజలు ఏమనుకోవాలని కోరుకుంటావో, అలా కావడానికి ప్రయత్నించడంలోనే జీవితానికి సార్థకత ఉంది.

విలియం జోన్స్

# విస్తరిస్తున్న అవయవాల వ్యాపారం

**అన్నింటి కంటే ముఖ్యంగా అవయవదానం గూర్చి ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది. అమెరికా, స్పెయిన్ లాంటి దేశాల్లో పదిలక్షల మందిలో మరణాంతరం నలభై మంది అవయవదానం చేస్తుంటే, యునైటెట్ కింగ్‌డమ్, ఫ్రాన్స్, స్వీడన్ తదితర దేశాలో ఇరవైఅయిదు మందివరకు ఉన్నారు. మన దేశంలో కేవలం 0.8కు మాత్రమే పరిమితమౌతున్నారు. ఇక యువకులను మోసం చేసి కిడ్నీ వ్యాపారం చేసే వారిపై చర్యలు అంతంత మాత్రంగా ఉంటున్నాయి. దర్యాప్తు విచారణలో జరుగుతున్న జాప్యం కూడా ఇందుకు ఒక కారణంగా చెప్పచ్చు. ఇప్పటికైనా ఈ విషయంలో పాలకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని అవయవమార్పిడి వైద్యం సామాన్యులకే కాదు సన్నజనానికి కూడా అందుబాట్లోకి తేవాలి.**

దామెర్ల సాయిబాబ

ఆశయం జీవితానికి విలువ నేర్పుతుంది. ఆశ ఆట పట్టిస్తుంది. అదే ఆశ మరో అడుగు ముందుకు వేసి అత్యాశగా మారి దురాశగా రూపాంతరం చెందితే సమాజంపై తీవ్ర ప్రభావం పడుతుంది. కష్టపడకుండా తెల్లవారేసరికి లక్ష్మీపుత్రులు కావాలనే దురాశతో కొందరు చేయరాని, చేయకూడని పనులు చేస్తున్నారు. ఈ డబ్బు సంపాదనలో మంచి, చెడు ఆలోచించడం లేదు. ఏమిచేసైనా డబ్బు సంపాదించాలనే ఆరాటం పెరిగిపోతున్నది. ఇది అది అని కాదు. ఎక్కడబడితే అక్కడ మంచి చెడులు గూర్చి పట్టించుకోకుండా డబ్బుసంపాదనే ధ్యేయంగా కొందరు చేయరాని, చేయకూడని పనులు చేయడానికి కూడా వెనుకాడడం లేదు. మానవ అవయవాలు, జీవితాలతో వ్యాపారం చేసే దుస్సంప్రదాయానికి తెగపడుతున్నారు. ఈ డబ్బు సంపాదన ఆరాటంలో రకరకాల మార్గాలను అనుసరిస్తున్నారు. ఏకంగా ఇన్సూరెన్స్ చేయించి ఆ తర్వాత సదరు వ్యక్తిని హత మార్చి డబ్బు కాజేసే కార్యక్రమం గూర్చి వింటుంటుంటే ఆవేదన కల్గుతుంది. మనుషుల ప్రాణాలు అత్యంత కిరాతకంగా తీసి దాన్ని డబ్బుగా మార్చుకోవడం కంటే మరొక దుర్మార్గం ఉండదేమో. ఇక మానవ అవయవాల వ్యాపారం కూడా తెలుగు రాష్ట్రాల్లోనే కాదు దేశవ్యాప్తంగా చాపకింద నీరులా విస్తరిస్తున్నది. శ్రీలంక రాజధాని కొలంబో కేంద్రంగా ఈ రాకెట్ కొనసాగుతున్న విషయం గతంలో బయటపడింది. విజయవాడ ప్రాంతంలో కూడా మరొక ముఠాను పోలీసులు పట్టుకున్నారు. తాజాగా హైదరాబాద్‌లో గత నెలలో వెలుగు చూసిన కిడ్నీల వ్యాపారంలోవిస్తుపోయే విషయాలు వెలుగు చూస్తున్నాయి. కేవలం తొమ్మిది పడకలకు అనుమతులు పొందిన ఆస్పత్రిని ఏకంగా ముప్పయి పడకలతో నిర్వహిస్తూ అందులో కిడ్నీల మార్పిడి చేసే వ్యాపారం చేస్తున్నట్లు ఒక వ్యక్తి టెలిఫోన్ ద్వారా పోలీసులకు సమాచారం అందించడంతో జరిపిన తనిఖీల్లో బయటపడింది. తమిళనాడుకు చెందిన ఇద్దరు మహిళలను హైదరాబాద్‌కు తీసుకువచ్చి గత నెల 17న వారి నుండి కిడ్నీలు తీసి కర్ణాటకకు చెందిన మరో ఇద్దరికి అమర్చినట్లు దర్యాప్తు అధికారులుగుర్తించారు. కిడ్నీ గ్రహీతల నుండి యాభైఐదు లక్షల రూపాయల మేర వసూలు చేసి కిడ్నీదాతలకు నాలుగు లక్షలు మాత్రమే ఇచ్చినట్లు అధికారుల దర్యాప్తులో బయటపడింది. ఇలా ఈ ముఠా దాదాపు తొంభైకి పైగా కిడ్నీమార్పులు చేసినట్లు చెపుతున్నారు. అనేక రాష్ట్రాల్లో ఈ కేసులు విస్తరించి ఉండడంతో స్థానిక పోలీసుల నుండి దర్యాప్తును రాష్ట్ర సిఐడికి ప్రభుత్వం అప్పగించింది. గత ఏడాదిలో మరొక కిడ్నీ మార్పిడి వెలుగుచూసిన కేసులో అంతర్జాతీయ కిడ్నీ రాకెట్ సూత్రధారి హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఆస్పత్రిలో పనిచేస్తున్న వైద్యుడుగా కేరళ పోలీసులు గుర్తించారు. కొచ్చి విమానాశ్రయంలో పట్టుబడిన నిందితుడు ఇచ్చిన వాంగ్మూలం ప్రకారం హైదరాబాద్‌కు చెందిన ముగ్గురు ముఠా ఈ కిడ్నీ వ్యాపారంలో పాలుపంచుకోగా అందులో ఒక వైద్యుడు ఉన్నట్లు దర్యాప్తులో వెలుగుచూసింది. అటు కర్ణాటక ఇటు తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని పేద యువకులను ఇరాన్‌కు తీసుకువెళ్లి అక్కడ వారి కిడ్నీలను అమ్ముతున్నారు. ముఖ్యంగా డబ్బుఅవసరం ఉన్న పేద యువకులను గుర్తించి వారికి డబ్బు ఆశచూపి, వారికి కావాల్సిన పాస్‌పోర్టు, వీసాలు దళారులే సమకూర్చి ఇరాన్‌కు తరలిస్తున్నారు. ఎవరికిడ్నీ ఏ గ్రహీతకు సరిపోతుందో మెడికల్‌గా నిర్ధారించుకొన్న తరువాత ఈ మార్పిడి కార్యక్రమం చేయిస్తున్నారు. అయితే బాధిత యువకుడు ఒకరు ఇటీవల మరణించడంతో అతని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కూపీలాగుతున్నారు. అంతకు ముందు హైదరాబాద్‌లో ఇలాంటి సంఘటనే చోటు చేసుకొన్నది.హైదరాబాద్‌కు చెందిన ఒక యువకుడు విశాఖపట్నం వెళుతున్నట్లు కుటుంబ సభ్యులకు చెప్పివెళ్లి శ్రీలంకలోని కొలంబోలో శవమై తేలాడు. కూపీలాగడంతో కిడ్నీ మార్పిడి ఆపరేషన్ విఫలమై ప్రాణాలు కోల్పోయినట్లు వెలుగుచూసింది.ఎందరో యువకులు దళారుల మాయలో పడి డబ్బుల ఆశలో ఈ వలలో చిక్కుకొంటున్నారు. ఈ అవయవాల మార్పిడి ఆపరేషన్‌కు హైదరాబాద్ కేంద్రంగా మారినట్లు పోలీసుల దర్యాప్తులో వెలుగు చూస్తున్న విషయాలు స్పష్టం చేస్తున్నాయి. మరొకపక్క కిడ్నీ వ్యాధులు ప్రబలిపోతున్నాయి. మారిన ఆహార అలవాట్లతో కిడ్నీవ్యాధి దేశవ్యాప్తంగా తెలుగురాష్ట్రాల్లో బాగా పెరిగిపోయింది. వ్యవసాయ రంగంలో పెరుగుతున్న క్రిమిసంహారక మందులు, రసాయనిక ఎరువులు,ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. దీనికితోడు వాతావరణ కాలుష్యం, జీవన విధానంలో మార్పులు కారణంగా మూత్రపిండాలు, కాలేయ వ్యాధులు విస్తరిస్తున్నాయి. దేశవ్యాప్తంగా కోటి మందికిపైగా మూత్రపిండాలకు సంబంధించిన దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలతో కొట్టుమిట్లాడుతున్నారు. దాదాపు పదిలక్షల వరకు మూత్రపిండాలు మార్పిడి చికిత్సచేయాల్సిన అవసరం ఉందంటున్నారు. అవసరం మేరకు మూత్రపిండాలు ఇచ్చే దాతలు ముందుకు రావడంలేదు. ఒక్క తెలుగు రాష్ట్రాల్లోనే దాదాపు లక్షన్నర మందికిపైగా మూత్రపిండాలు పనిచేయక డయాలిసిస్‌తో జీవనం సాగిస్తున్నారు. వీరికిమార్పిడి చికిత్స ఒక్కటేపరిష్కారం. అయితే ఇందుకు యాభైలక్షల రూపాయల వరకు వ్యయంచేయాల్సి ఉంటుంది. నిరుపేదలుఅంతటి ఖర్చును పెట్టుకునే పరిస్థితుల్లో లేరు.మరొకపక్క ప్రభుత్వం నుండి ఈవిషయంలో పెద్దగా శ్రద్ధ కన్పించడంలేదు. ప్రమాదంలో బ్రెయిన్‌డెడ్ అయి కోమాలో ఉన్న వ్యక్తుల నుంచి అవయవాలు సేకరించి 'జీవన్‌ధార్' పథకంకింద ముందుగా నమోదు చేయించు కున్న వారికి సీనియార్టీ బట్టి మార్పిడి చికిత్సచేస్తున్నారు. అయితే ఏళ్లతరబడి ఎదురు చూసి తమ టర్మ్ వచ్చేలోపలే అసువులు బాసినవారెందరో ఉన్నారు. తెలంగాణలో అవ యవ మార్పిడికి నలభైఒక్క ఆస్పత్రులకే అనుమతులున్నా యి. దాదాపు 15 వేల 7 వందల మందికి పైగా జీవన్ ధార్ ట్రస్టులో రిజిస్టర్ చేసుకొని ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నారు. ఇప్పటకీ పరిస్థితుల్లో మార్పు వచ్చినట్టు కన్పించడం లేదు. తెలంగాణలో, అటు ఆంధ్రప్ర దేశ్‌లో డయాలసిస్ చేయించుకునే ఆర్థిక స్తోమత లేక మం చానికే పరిమితమై రోజురోజుకూ కృంగి కృశించి అసువులు బాస్తున్న వేలాది కుటుంబాల వేదన వర్ణనాతీతంగా ఉంది. నరకయాతను అనుభవిస్తూ యమలోకానికి పయనం కడుతుంటే ఏమీ చేయలేని నిస్సహాయకస్థితిలో ఉన్న కుటుంబ సభ్యులు పడుతున్న వేదన వర్ణనాతీతం. తెలంగాణలో గత ప్రభుత్వం ఈ డయాలసిస్ సెంటర్లు పెంచి పేదలకు ఉచితంగా చికిత్సఅందించే ఏర్పాటుచేసింది. అవి అవసరం మేరకు కిడ్నీ బాధితులందరికీ సరిపడేస్థాయిలో, అందుబాటులో లేవనే చెప్పచ్చు. పాలకులు ఈ విషయంలో శ్రద్ధ తీసుకొని అటు కిడ్నీల వ్యాపారానికి ఫుల్‌స్టాప్ పెట్టించడ మేకాక ఇటు ప్రభు త్వపరంగా చర్యలు తీసుకొని మార్పిడి చికిత్స సామాన్యులకు అందుబాటులోకి వచ్చేలా చేయాల్సి న అవసరంఉంది. అన్నింటి కంటే ముఖ్యంగా అవయవదా నం గూర్చి ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది. అమెరికా, స్పెయిన్ లాంటి దేశాల్లో పదిలక్షల మంది లో మరణాంతరం నలభైమంది అవయవదానం చేస్తుంటే, యునైటెట్ కింగ్‌డమ్, ఫ్రాన్స్, స్వీడన్ తదితరదేశాలో ఇరవైఅయిదు మందివరకు ఉన్నారు. మన దేశంలో కేవలం 0.8కు మాత్రమే పరిమితమౌతున్నారు. ఇక యువకులను మోసంచేసి కిడ్నీ వ్యాపారం చేసే వారిపై చర్యలు అంతంత మాత్రంగా ఉంటున్నాయి. దర్యాప్తు విచారణలో జరుగుతున్న జాప్యం కూడా ఇందుకు ఒకకారణంగా చెప్పచ్చు. ఇప్పటికైనా ఈ విషయంలో పాలకులు ప్రత్యేక శ్రద్ధ తీసు కొని అవయవమార్పిడి వైద్యం సామాన్యులకే కాదు సన్నజనానికి కూడా అందుబాట్లోకి తేవాలి. •

## ఒక్క మాట

# విమాన ప్రయాణాలు ఎంత వరకు సురక్షితం!

బి.మధుసూదన్‌రెడ్డి

దక్షిణ కొరియాలో గత ఆదివారం జరిగిన ఘోర విమాన ప్రమాదంలో ఏకంగా 179మంది దుర్మరణం పాలవడం వింటేనే విమాన ప్రయాణం అంటే వణుకు పుట్టేస్తున్నది. 175 మంది ప్రయాణికులతో పాటు ఆరుగురు సిబ్బందితో కూడిన విమానం థాయిలాండ్ నుంచి సియోల్‌కు 290 కిమీ దూరంలోఉన్న ముయాన్‌కు బయలుదేరి జెజు ఎయిర్‌కు చెందిన బోయింగ్ జెట్ విమానం దిగుతుండగా కుప్పకూలిపోయి రక్షణ గోడను ఢీకొని ముక్కలైపోయి 179 మందిని పొట్టన పెట్టుకుంది. ఇద్దరు సిబ్బంది మాత్రమే గాయాలతో బయట పడ్డారు. ప్రపంచవ్యాప్తంగా 2024లో జరిగిన అత్యంత ఘోర విమాన ప్రమాదంగా దీనిని గుర్తిస్తున్నారు. అదే విధంగా ప్రపంచ క్రిస్టియన్లు బాక్సింగ్ డే వేడుకల్లో మునిగిన వేళ అజర్‌బైజాన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం 25 డిసెంబర్‌న కజకిస్థాన్‌లో కూలిపోవడంతో 38 ప్రాణాలు కోల్పోవడం, 29 మంది గాయాలతోబయటపడడం కూడా మనల్ని కలిచి వేసిన ప్రమాదంగా మన మనసుల్లో నమోదు అయింది. ఈ విమానాన్ని రష్యా మిలిటరీ కూల్చి వేసిందనే ఆరోపణ కూడా వినవలసిరావడం విచారకరం. తరుచుగా జరుగుతున్న వాణిజ్యపరమైన విమాన ప్రమాదాలు ప్రపంచ ప్రయాణికుల గుండెల్లో వణుకును పుట్టిస్తున్నాయి. ఏవియేషన్ వర్గాల అధ్యయనాల ప్రకారం 53 శాతం విమాన ప్రమాదాలు మానవ తప్పిదాలతో, 21 శాతం మెకానికల్ వైఫల్యాలతో, 11శాతం ప్రతికూల వాతావరణాల వల్ల జరుగుతున్నట్లు తేలింది. అయినప్పటికీరోడ్డు, రైలు ప్రయాణాలతో పోల్చితే విమాన ప్రమాదాలు చాలా తక్కువగా నమోదు అవుతున్నట్లు వివరిస్తున్నారు. 2018 22 మధ్య సమయంలో ప్రపంచవ్యాప్తంగా 13.7 మిలియన్ల విమానయాన ప్రయాణీకుల్లో ఒక్క ప్రయాణీకుడు మాత్రమే ప్రమాదంలో ప్రాణం కోల్పోయినట్లు గణాంకాలు తెలుపుతున్నాయి. అదే విధంగా 16 మిలియన్ల వాణిజ్య విమానాల్లో ఒక్కటి మాత్రమే ప్రమాదానికి గురి అవుతున్నట్లు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. 2024లో ప్రపంచ వ్యాప్తంగా తీవ్రమైన వాణిజ్యపరమైన విమాన ప్రమాదాలు 20 వరకు జరుగగా, అందులో 400 వరకు ప్రయాణీకులు మరణించినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. 2024లో రష్యా మిలటరీ విమాన కూల్చివేతలో 74 మంది, బ్రెజిల్ ప్రమాదంలో 62మంది, కాట్మండు ప్రమాదంలో 18మంది, రష్యా విమానప్రమాదంలో 15మంది, లుతువానియా విమాన ప్రమాదంలో నలుగురు ప్రయాణీకులు/సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. భారత్‌లో మాత్రమే ఒక్క ఏడాది 2022లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 1.69 లక్షల మంది ప్రాణాలు వదిలారు. 2023లో సగటున రోజుకు 474మంది ప్రజలు మరణిస్తున్న విషయం మరువరాదు. 2014- 23 మధ్య కేవలం భారత్‌లో జరిగిన 638 రైలుప్రమాదాల్లో 2,453 మంది మృతి చెందినట్లు తెలుస్తున్నది. విమాన ప్రయాణాల భద్రతకు విమాన పైలెట్‌సిబ్బంది, విమాన ఇంజన్ కండీషన్,సిబ్బందికి అందించే శిక్షణలాంటిఅంశాలు సంబంధాన్ని కలిగి ఉంటాయి. విమాన ప్రమాదాలకు కొంతవరకు పక్షులు ఢీకోవడం కూడా మరోకారణంగా గుర్తించబడింది. ఇప్పటికైనా విమానయానాలు పరలోక ప్రయాణాలు కాకుండా వారిని సురక్షితంగా తమ తమ గమ్యస్థానాలకు చేర్చాలని, మానవ తప్పిదాలను పూర్తిగా తప్పించాలని ఆశిద్దాం. •

# ప్రజావాక్కు



### బోసిపోతున్న ప్రభుత్వ ఖజానా

ప్రయాగరాజ్ స్టేషన్‌లో ట్రైన్ కోసం బెంచ్ మీద కూర్చుని నిరీక్షిస్తున్న పూరిశంకరాచర్య నిశ్చాలానంద స్వామి వారిని చూసి ఆయన చాలామంది రాజకీయనాయకులు, పెద్ద ప్రభుత్వ ఉద్యోగులు నేర్చుకోవలసింది ఎంతైనా ఉంది. కళ్ల బైరలు తెచ్చే ఆయన ప్రొఫైల్ చూస్తే ఆయన ఎంత సామాన్య జీవితం గడుపుతున్నారో అర్థంఅవుతోంది. ప్రజాధనాన్ని విలాసవంతమైన ప్రయాణ ఖర్చులకు,తమ తమ బంధుమిత్రుల దైవదర్శనాలకు, పనిపేరుతో విలాస ప్రయాణాలకు ఖర్చుపెట్టేవీరుఇలాంటి మహానుభావులను చూసయినా స్వయం అవలోకన చేసుకొని నడుచుకుంటే ప్రభుత్వాల ఖజానా ఎందుకు బోసి పోతుంది. ఆలోచించాలి. డిప్యూటీ సి ఎం గారు ఈ విషయములో ఒక్కరే కొరడా ఝుళిపించగల సామర్థ్యం ఉన్న వారు అనుకోవడంలో సందేహం లేదు.

-గార్లపాటి సీతారామయ్య, హైదరాబాద్

### వ్యాఖ్యల దుమారం

**బిజెపికి** చెందిన ఎమ్మెల్యే, ఎంపి మంత్రులు తరుచూ వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్నారు. తీవ్ర విమర్శలు చేస్తున్నారు. తాజాగా మోహన్‌భగవత్ వీరి పంచన చేరారు. దేశ చరిత్రను, దివంగత నాయకులను అవమానిస్తూ మాట్లాడటంఅంటే వీరికిచాలా ఇష్టంలాఉంది. ఎమ్మెల్యేలు, ఎంపిలు ప్రజల ముందు మాట్లాడే సమయంలో ఆచితూచి మాట్లాడాలి. నోటికి ఎంత వస్తే అంత మాట్లాడటం సబబు కాదు.

-మిథునం, హైదరాబాద్

### ఆంగ్ల మాధ్యమంగా విద్యాబోధన

**కర్ణాటక,** తమిళనాడు రాష్ట్రాలు ఇటీవల ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే ఆంగ్లాన్ని విద్యాబోధన మాధ్యమంగా ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. తెలుగు రాష్ట్రాలు రెండూ ప్రాథమికవిద్య నుంచే ఆంగ్ల మాధ్యమంలో బోధన ప్రవేశపెట్టేందుకు చర్యలు చేపడుతున్నాయి. అందుకు అనుగుణంగా, వచ్చే విద్యా సంవత్సరం నుండే ఆంగ్ల మాధ్యమంలో బోధన ప్రారంభించటానికి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. జపాన్,ఐర్లాండ్,పోలాండ్, ఫిన్లాండ్,దక్షిణకొరియా వంటి దేశాల్లో ప్రాథమిక విద్య మాతృభాషలోనే జరుగుతోంది. దీంతోవిద్యార్థికిబోధనఅంశం సమగ్రంగా అర్థమవుతుంది.

-సి.హెచ్. ప్రతాప్, కోటి వీధి, శ్రీకాకుళం

### సెకి ఒప్పందం రద్దు చేసుకోవాలి!

**రాష్ట్ర** ముఖ్యమంత్రి విద్యుత్ కొనుగోలు వ్యయం తగ్గాల్సిందే అంటున్నారు. మరి గత ప్రభుత్వం సెకితో చేసుకున్న సోలార్ విద్యుత్ కొనుగోలు ఒప్పందంరాష్ట్రానికి పూర్తిగా నష్టదాయకం. దానిపై తెలుగు దేశంపార్టీ న్యాయస్థానాన్ని కూడా ఆశ్రయించడం జరిగింది. ఆ తర్వాత ఒప్పందంలో అవినీతి చోటు చేసుకుందని ఆధారాలతో సహా అమెరికా న్యాయస్థానంలో కేసు కూడా నమోదు చేశారు.ఈ అవినీతిలో జగన్ లడ్డూలా దొరికాడు అనికూడా వ్యాఖ్యానించారు.ఈనేపథ్యంలో ముఖ్యమంత్రి ప్రభుత్వానికి భారమైన సెకి ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలి. లేదంటే కొనుగోలు షరతులనైనా మార్చుకోవాలి? ఈ విషయంలో ముఖ్యమంత్రి చర్యలు తీసుకోకపోతే ప్రజల్లో ప్రభుత్వం పై విశ్వాసం పోతుంది!

-గరిమెళ్ల రామకృష్ణ, ఏలూరు, ఏలూరు జిల్లా

### ఆ రోజులు మళ్లీరావు

మగ ప్రధానులు చూపలేని ధైర్యాన్ని ఇందిరాగాంధీ చూపారు. వారు చేయలేని సాహస కృత్యాలను ఆవిడ చేశారు. రాజకీయ ప్రత్యర్థుల నోటనుంచి శభాష్,వీరనారి,అపరదుర్గ అనే మాటలు వచ్చేలా పనిచేశారు. పాలన బావుంటే అప్పట్లో ఉన్న ప్రతిపక్ష నాయకులు ఇలానే ప్రశంసించేవారు. విలువలను పాటిస్తూ అధికార పార్టీ వారిని గౌరవంగా చూసేవారు. ఇప్పుడు అలాంటి ప్రతిపక్ష నాయకులు కాగడా పట్టుకుని వెతికినా కానరావటం లేదు. అధికారంలో ఉన్న వారిని చూసి అసూయపడే వారు ఎంత పనిచేస్తున్నా ప్రజలకు మంచి చేయడం కోసం చెమటోడ్చుతున్నా విమర్శించేవారు అధికారం కోసం పాకులాడే స్వార్థబుద్ధి గలవారే కనబడుతున్నారు.

-ఎం.శ్రీనివాస్, హైదరాబాద్

### అంతర్యుద్ధం

**బర్మాలో** జరుగుతున్న అంతర్యుద్ధం తారాస్థాయికి చేరిన బర్మాలో సామాన్య ప్రజలకు ప్రజాస్వామ్యం పట్ల ఉండే ఆకాంక్షను వ్యక్తీకరణ చేస్తుంది. 87 శాతం ఓట్లు గెలుచుకున్న సూకీ ని కాదని ముఖ్యమైన అధికారాలను దగ్గర పెట్టుకొని నియంతృత్వ పోకడలతో అధికారంలోకి వచ్చిన సైన్యం ను ప్రజలు ఎవగించుకుంటున్నారు. అది ప్రజాస్వామ్యం పట్ల ఆ పాలన పట్ల అక్కడి ప్రజలకు ఉన్న నమ్మకానికి నిదర్శనం. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజాపాలన జరిగితే మంచిది.

-భారత అవినాష్, జనగామ

మన వి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# గాజాపై అమెరికా అధ్యక్షుని ప్రభావం

ఎం కె కుమార్

ట్రంప్ గాజాపై అమెరికా యాజమాన్యాన్ని ప్రస్తావిస్తూ, 'మేము దానిని సొంతం చేసుకుంటాం, అభివృద్ధి చేస్తాం, వేలాది ఉద్యోగాలు కల్పిస్తాము" అంటూ గాజాను ఒక రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుగా చూపే ప్రయత్నం చేశారు. గతంలో కూడా ట్రంప్ "జస్ట్ క్లీన్ అవుట్" అంటూ పాలస్తీనా ప్రజలను జోర్డాన్, ఈజిప్టుకు బలవంతంగా తరలించాలనే సూచన చేశారు. ఇది 1948 జెనీవా కన్వెన్షన్ ప్రకారం జాతిహత్య ఉద్దేశం కింద పరిగణించబడుతుంది. అంతేకాదు, ఇజ్రాయెల్ జరుపుతున్న యుద్ధ నేరాలను విమర్శించే ఐక్యరాజ్యసమితి, మానవ హక్కుల మండలి, పాలస్తీనా ప్రజలకు సహాయపడే యుఎన్ ఏజెన్సీలకు మద్దతును కూడా ట్రంప్ ఉపసంహరించుకున్నారు. ఇజ్రాయెల్‌ను తక్షణంగా ఆపాల్సిన అవసరం ఉన్న సమయంలో, ట్రంప్ ప్రభుత్వం 2000 పౌండ్ల బాంబుల సరఫరాను కొనసాగించింది. ఇది గాజా, వెస్ట్‌బ్యాంక్, లెబనాన్, సిరియాలో ఇజ్రాయెల్ హింసను మరింత పెంచడానికి దోహదపడింది.ట్రంప్ చేసిన ప్రకటనలు గాజా ప్రజలను పూర్తిగా తరిమేయాలని ఉద్దేశించినట్లు స్పష్టంగా కనిపిస్తున్నాయి. పాలస్తీనాప్రజలు, ప్రతిఘటన వర్గాలు ట్రంప్ మాటలను ఖండించాయి. ప్రపంచ మంతా గాజాను జియోనిస్ట్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రదేశంగా చూస్తున్నది. ట్రంప్ మాత్రం దానిని మరణం, విధ్వంసంగా పేర్కొన్నారు.ట్రంప్ నిజంగా గాజాపై అమెరికా దండయాత్రకు ప్రణాళిక వేస్తున్నాడా? లేక ఇది కేవలం రాజకీయ ఆడంబరమా? కాలమే సమాధానం చెప్పాలి. ట్రంప్ తనను యుద్ధాలను ముగించే నేతగా ప్రస్తావించుకున్నాడు. ఆయన చర్యలు పూర్తిగా భిన్నంగా ఉన్నాయి. రష్యా, ఉక్రెయిన్ యుద్ధాన్ని24 గంటల్లో ముగిస్తానని చెప్పినా, అది సాధ్యపడలేదు. గాజా కాల్పుల విరమణ కూడా మిగిలిపోలేదు. ఇప్పుడు ఆయన గాజా జనాభాపై జాతి ప్రక్షాళనకు మద్దతుగా మాట్లాడటం ప్రపంచవ్యాప్తంగా తీవ్ర విమర్శలకు గురైంది. ట్రంప్ ప్రవేశపెట్టిన అబ్రహం ఒప్పందాలు ప్రణాళిక, పాలస్తీనా స్వేచ్ఛా ఉద్యమాన్ని అణిచివేయడానికి రూపొందించబడింది. ఆయన అల్లుడు జారెడ్ కుష్నర్ ముందుకు తెచ్చిన ఈ ప్రణాళికను బిడెన్‌హారిస్ ప్రభుత్వం కొనసాగిస్తోంది. దీని ద్వారాఈజిప్ట్, జోర్డాన్, మొరాకో, యుఎఇ, సూడాన్ దేశాలను ఇజ్రాయెల్‌తో ఒప్పందాలు చేసుకునేందుకు ఒత్తిడి చేశారు. ఇప్పుడు సౌదీ అరేబియా కూడా ఒప్పందంలో చేరాల్సిన పరిస్థితి వచ్చింది. ఈ ఒప్పందాల అసలు ఉద్దేశ్యం పాలస్తీనా, హిజ్బుల్లా, ఇరాక్, ఇరాన్, యెమెన్ వంటి ఖియాక్సిస్ ఆఫ్ రెసిస్టెన్స్ అనే దేశాలు, సంస్థలను అణగదొక్కడమే. అక్టోబర్ 7న గాజాలో తిరుగుబాటు, జైలు విచ్ఛిన్నం, విధ్వంసం జరిగింది. దీని తర్వాత, ఈ ఒప్పందాలను సమర్థించడం అరబ్ దేశాలకు కూడా కష్టంగా మారింది. ట్రంప్ యుద్ధాలకు వ్యతిరేకి కాదు. ఆయన చర్యలు గాజా ప్రజల పరిస్థితిని మరింత తీవ్రతరం చేస్తున్నాయి. ఇజ్రాయెల్ జియోనిస్ట్ లాబీ, వైట్‌హౌస్, అమెరికా పాలనపై ఎంత ప్రభావం కలిగిఉందో ప్రపంచం చూస్తోంది. అత్యంత ప్రజాదరణ లేని నాయకుడైన ట్రంప్, అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు (ఐసీసీ) అరెస్ట్ వారెంట్ ఉన్న నెతన్యాహును వైట్‌హౌస్‌కు ఆహ్వానించాడు. దీనివల్ల ఆయన "అమెరికా ఫస్ట్" అనే నినాదం వెనుక "ఇజ్రాయెల్ ఫస్ట్" వుంది కదా? అనే ప్రశ్న ఉత్పన్నమయింది. అమెరికా ఆధిపత్యం తగ్గి




పోతున్న ఈ పరిస్థితిలో, ట్రంప్ తన యుద్ధాలు, ఆంక్షలు, బెదిరింపులు ఇకపై పని చేయవని గ్రహించాలి. జి7దేశాలకు ప్రత్యామ్నాయంగా బ్రిక్స్ ఆవిర్భావం ప్రపంచ శక్తి సమతుల్యతను మార్చేస్తోంది.ఇజ్రాయెల్ వద్ద ఆధునిక ఆయుధాలు,బలమైన మద్దతుఉన్నప్పటికీ, గాజాలో విజయం సాధించలేకపోయింది. కాల్పుల విరమణ ఒప్పుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. హమాస్‌ను ఓడించలేకపోయింది. బందీ లను విడిపించలేకపోయింది. తన స్వంత ప్రజల దగ్గరే ఓడిపోయిన నెతన్యాహు, యుద్ధ నేరాలకు బాధ్యుడయ్యాడు. అన్ని హింసల మధ్య పాలస్తీనా ప్రజలు లొంగిపోవడానికి నిరాకరించారు. ఇజ్రాయెల్ అమెరికా యుద్ధ యంత్రాన్ని ఎదుర్కొంటూ, తమ హక్కులకోసం పోరాటం కొనసాగిస్తున్నారు. ఇజ్రాయెల్ ప్రభుత్వం గాజాలో కాల్పుల విరమణకు అంగీకరించడంపై అనేక చర్చలు జరిగాయి. దీనికి ప్రధాన కారణాలు,విస్తరించిన ఇజ్రాయెల్ సాయుధ దళారులకు విరామం అవసరం. అమెరికా కొత్త అధ్యక్షుడి ఒత్తిడి, తక్కువ హింసాత్మక విధానాలను అనుసరించాలనే వ్యూహం వుంది. ట్రంప్ నెతన్యాహును ఏ విధంగా ఒప్పించి ఉంటారనే ప్రశ్నకు ఒక అంచనా ఉంది. ఆయన అమెరికా వ్యూహాన్ని అనుసరించాలి. అదే సమయంలో యుద్ధాలను తగ్గిస్తూ ప్రపంచ ఆధిపత్యాన్ని కొనసాగించాలని సూచించి ఉండవచ్చు. నెతన్యాహు కూడా ఇది తన సైన్యానికి విశ్రాంతి కల్పించడానికి, బందీల విడుదల ద్వారా దేశీయ ఒత్తిడిని తగ్గించడానికి ఉపయోగపడుతుందని భావించవచ్చు. అంతర్జాతీయంగా ఒక సానుకూలత సృష్టించడానికి ఉపయోగపడుతుందని అంగీకరించవచ్చు. ట్రంప్ నెతన్యాహును ఏమని ఒప్పించి ఉంటారనే ప్రశ్నకు ఒక అంచనా ఇది. అమెరికా వ్యూహాన్ని మార్చే ప్రయత్నంలో భాగంగా, ప్రపంచ ఆధిపత్యాన్ని కొనసాగించేందుకు యుద్ధాన్ని పూర్తిగా నిలి పివేయకుండానే మరొక మార్గాన్ని అన్వేషించమని సూచించి ఉండవచ్చు. అమెరికా మాజీ అధ్యక్షుడు ట్రంప్ పాలస్తీనియన్లను ఈజిప్ట్, జోర్డాన్‌లో పునరావాసం కల్పించాలని ప్రతిపాదించారు. అయితే, ఈ నిర్ణయాన్ని పాలస్తీనియన్లు, ఈజిప్ట్, జోర్డాన్‌తోపాటు ఇతర అరబ్‌దేశాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ట్రంప్ గాజాలో అమెరికా ప్రత్యక్ష పాత్ర ఉండొచ్చని కూడా పేర్కొన్నారు. అయితే, ఈ తరలింపు వ్యూహం విఫలమయ్యేలా కనిపిస్తోంది. ఎందుకంటే అన్ని అరబ్ దేశాలు దీనికి వ్యతిరేకంగా ఐక్యంగా నిలిచాయి.ఇప్పుడు ప్రశ్న ఏమిటంటే, యుద్ధంకాకుండా అమెరికా, ఇజ్రాయెల్ తమ లక్ష్యాలను ఎలా సాధిస్తాయి? శాంతియుత మార్గాలు పనిచేయకపోతే, మళ్లీదాడులకు, యుద్ధానికి మారుతారా? ఈ అస్పష్టత కారణంగా గాజా ప్రజలు, శాంతిని కోరుకునే ప్రపంచం ఆందోళనతో ఎదురుచూస్తోంది. అధ్య క్షుడు ట్రంప్ యుద్ధం కాకుండా ఆధిపత్యాన్ని సాధించాలనే లక్ష్యంతో ఉన్నాడు.ఈ వ్యూహంలో ప్రధానంగా రెండు భాగాలు ఉన్నాయి.పొరుగు ప్రాంతాలను స్వాధీనం చేసుకోవడం. ఇందులో గ్రీన్‌ల్యాండ్ లేదా కెనడా వంటి ప్రాంతాలను స్వాధీనం చేసుకోవాలని టార్గెట్ ఉంది.ఇది అమెరికాకు సహజ వనరులను పెంచుతుంది. రష్యా, చైనాలపై వ్యూహాత్మక క్షేత్రం ఏర్పడటానికి దోహదపడుతుంది. వ్యూ హాత్మకలోతును పెంచడం. అమెరికా, ఆర్కిటిక్ ప్రాంతంపై నియంత్రణ పెంచుకోవడం ద్వారా మరింత ప్రభావవంతంగా మారుతుంది. అలాగే యూరోపియన్ దేశాలకు సమీపంగా కొత్త గ్రీన్‌ల్యాండ్ సరిహద్దు ఏర్పడుతుంది. ఈ వ్యూహం వాస్తవంగా యుద్ధం లేకుండా అమెరికాకు విజయాన్నిసాధించడంలో సహాయపడుతుంది. అలాగే కొన్ని విధ్వంసకర యుద్ధాలను నివారించడంలో దోహదం అవుతుందని ఊహించవచ్చు.ఈవ్యూహరచన గతంలో జరిగిందే.అమెరికా, అంతరిక్ష లేదా వైమానిక యుద్ధంవైపు అడుగులు వేయాలని సూచిస్తుంది. ట్రంప్ వంటి నాయకులు తమ అధికారాన్ని సాధించడానికి చేసే వ్యూహాలు చాలా దేశాలకు ఇబ్బందులను కలిగిస్తాయి. •

# రెడ్డిగూడెం వద్ద రోడ్డు ప్రమాదం

**- ముగ్గురు మృతి -రెండు కార్లు, నాలుగు ద్విచక్ర వాహనాలు ధ్వంసం**





**సత్తెనపల్లి, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త :** రెడ్డిగూడెం వద్ద శుక్రవారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. మాచర్ల డిపోకు చెందిన ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు అతివేగంతో రెండు కార్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. నాలుగు ద్విచక్ర వాహనాలు నుజ్జునుజ్జయ్యాయి. ఈ ప్రమాద సంఘటనలో ముగ్గురు వ్యక్తులు మృతిచెందినట్లు తెలిసింది. పిడుగురాళ్ళ వైపు ప్రయాణిస్తున్న కన్నా ఆర్మీ బృందానికి చెందిన కోటనెమలిపురి గ్రామానికి చెందిన సానికొమ్ము సుబ్బారెడ్డి, దేవిరెడ్డి శ్రీనివాసరెడ్డితో పాటు మరో వ్యక్తి మృతిచెందినట్లు సమాచారం. ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను 108 సహాయంతో ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

# మైనర్ బాలికను బెదిరించి ఫోటోలు మార్ఫింగ్ చేసిన కేసులో నిందితుని అరెస్టు

**మంగళగిరి,ఫిబ్రవరి 7,ప్రభాతవార్త :** మైనర్ బాలిక ఫోటోను మార్ఫింగ్ చేసి బెదిరింపులకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని రూరల్ పోలీసులు అరెస్టు చేశారు.ఈ సందర్భంగా శుక్రవారం



సాయంత్రం రూరల్ పోలీస్టేషన్ లో సిఐ శ్రీనివాసరావు,ఎస్సై వెంకట్ లు వివరాలను వెల్లడించారు.వారు తెలిపిన కథనం ప్రకారం మంగళగిరి మండలం ఎ ర్రబాలెం గ్రామంలోని నాగలక్ష్మీ స్కూల్లో బాలిక 8వ తరగతి చదువుతుంది.ఈ క్రమంలో వారి కుటుంబీకలు హైదరాబాద్ వెళ్తూ వారి ఇంటిముందు ఉన్న గార్బేజి చెత్త ఎత్తి వేసే నిమిత్తం వచ్చేటువంటి శానిటేషన్ వర్కర్స్‌కి చెత్త సేకరణ నిమిత్తం ఫోన్ నెంబర్ రాయడం జరిగింది.ఆ ఫోన్ నంబర్ ను గమనించిన ఎర్రబాలెం ఇండస్ట్రీయల్ ఏరియాకు చెందిన షేక్ భాషు అనే అతను ఆ నెంబర్‌కు కాల్ చేయడం ప్రారంభించాడు.తొలుత బాలిక అమ్మ తోటి ఆ తరా ్వత బాలికను బెదిరించి మాటా ్లడడం జరుగుతోంది.ఈ క్రమంలో అతను ఫోన్ చేసి తీవ్రస్థాయిలో బెదిరించడం చివరికి ఆ పాప షాప్‌కి వెళ్ళే సమయంలో వెంబడించి బెదిరించడం,అసభ్య పదజాలం ప్రయోగించి ఇబ్బందులకు గురిచేస్తున్నాడు,చివరికి ఆ బాలిక ఫోటోని తలతీసి వేరే ఫోటోకు మ్యాచ్ చేసి న్యూడ్‌గా అసభ్యకరంగా ఫోటోలను మార్ఫింగ్ చేసి బాలిక యొక్క సెల్ ఫోన్‌కి పంపి ఇవన్నీ కూడా సోషల్ మీడియాలో ఫార్వర్డ్ చేస్తానని చెప్పి బెదిరించడం చేస్తున్నాడు.ఇది తెలిసి బాలిక తండ్రికి గుండెపోటు వచ్చింది,ఆ పాప ఆత్మహత్యకు ప్రయత్నించడం జరిగింది. వీటి దృష్టా ్య దీని ్న సిరియర్ గా పరిగణించి కేసు నమోదు చేసి సంబంధిత నిందితుడిని గుర్తించి అరెస్టు చేసి న్యాయస్థానం ముందు హాజరు పరిచామని తెలిపారు.

# ఆలపాటి నామినేషన్ దాఖలు



**గుంటూరు కలెక్టరేట్,ఫిబ్రవరి 7,ప్రభాతవార్త :** కృష్ణా-గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఎన్నికకు తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ శుక్రవారం నామినేషన్‌ను జిల్లా కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్.నాగలక్ష్మీ కి అందజేశారు.

# సైకాలజీలో ముగిసిన జాతీయ సదస్సు

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,ఫిబ్రవరి 7,ప్రభాతవార్త :** ఏఎన్‌యులోని సైకాలజీ విభాగంలో రెండు రోజులుగా జరుగుతున్న



మేనేజింగ్ స్ట్రెస్ ఎన్ హన్సింగ్ సైకలాజికల్ క్యాపిటల్ అనే అంశంపై యూజిసి జాతీయ సదస్సు శుక్రవారంతో ముగిసింది.ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న విభాగాధిపతి ఆచార్య జి.చెన్నారెడ్డి మాట్లాడుతూ విద్యార్థి సాయి నుంచి పనిభారం,ఒత్తిడి వంటి విషయాలపై దృష్టి సారించినట్లయితే జీవితంలో ఎటువంటి రుగ్మతలు లేకుండా చూసుకోవచ్చన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ నుంచి పాల్గొన్న ఆచార్య బి.పద్మజ మాటా ్లడుతూ మహిళలు,ఉద్యోగులు,విద్యార్థులు సైకలాజికల్ క్యాపిటల్‌ను ఏవిధంగా పెంపొందించుకోవాలో వివరించారు.ఉస్మానియ యూనివర్సిటీ సైకాలజీ విభాగాధిపతి డాక్టర్ పి.స్వాతి మాట్లాడుతూ విద్యార్థుల్లో సైకలాజికల్ క్యాపిటల ్ ప్రాముఖ్యతను వివరించారు.యోగివేమన యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ కె.లలిత ఒత్తిడి,వ్యాకులత,డిప్రెషన్ వంటివి తగ్గించడంలో కమ్యూనిటీ ప్రాధాన్యతను వివరించారు.రాధిక మాట్లాడుతూ యోగా విధానం ద్వారా వ్యాకులతను అధిగమించే అంశాలను విపులీకరించారు.అనంతరం సదస్సు డైరెక్టర్ ఆచార్య టిడి విమల,ఆచార్యచెన్నారెడ్డిలు పరిశోధన పత్రాలు సమర్పించిన వారికి సర్టిఫికేట్లు అందజేశారు. కార్యక్రమంలో విభాగం అధ్యాపకులు ఎస్.అనుపమ,కృష్ణమోహన్,ప్రమీలారాణి తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటి చెత్త సేకరణ నూరు శాతం జరగాలి : కమిషనరు

**గుంటూరు, కార్పోరేషన్ ఫిబ్రవరి 7 ప్రభాతవార్త :** నగరంలో ఇంటింటి చెత్త సేకరణ నూరు శాతం జరగాలని, మధ్యాహ్నం సమయంలో గ్యాంగ్ వర్క్‌లు తప్పనిసరిగా చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం కమిషనర్ నల్లచెరువు, సంపత్‌నగర్, ఇజ్రాయిల్‌పేట తదితర ప్రాంతాల్లో అభివృద్ధి, పారిశుధ్య పనులను తనిఖీ చేసి తీసుకోవాల్సిన చర్యలపై ఇంజనీరింగ్, ప్రజారోగ్య అధికారులకు తగు




ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మైక్రో పాయింట్స్ మేరకు వార్డు సచివాలయ పరిధిలో ప్రతి ఇంటి నుండి చెత్త సేకరణ జరగాల్సిందేనని స్పష్టం చేశారు. కార్మికులు ఉదయం మస్టర్ అనంతరం మెయిన్ రోడ్లు స్వీపింగ్ చేసి, ఇంటింటి చెత్త సేకరణ చేయాలన్నారు. మధ్యాహ్న సమయంలో డివిజన్ పరిధిలో సమస్యాత్మక ప్రాంతాలను, డ్రైన్లను గ్యాంగ్ వర్క్ ద్వారా శుభ్రం చేయించాలని ఆదేశించారు. నూతన డ్రైన్ నిర్మాణ పనులు జరిగే సమయంలో లెవల్స్ పక్కాగా పాటించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అలాగే అభివృద్ధి పనులు జరిగే సమయంలో వర్క్ ఇన్స్పెక్టర్లు, ఎమినిటి కార్యదర్శులు అక్కడే ఉండి పర్యవేక్షణ చేయాలని, పనులు పూర్తైన వెంటనే బిల్లుల చెల్లింపుకు ప్రాసెస్ చేయాలని ఆదేశించారు. పర్యటనలో డిఈఈ మధుసూదన్, ఆర్ఓ సాదిక్‌బాష, ఏఈలు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

# బైబిలు మిషను వ్యాప్తిలో ప్రమీలమ్మకృషి విలువైనది

**-మాజీ కేంద్ర సహాయమంత్రి జెడి శీలం**

**పెదకాకాని, ఫిబ్రవరి7,ప్రభాతవార్త:** దేశ,విదేశాలలో బైబిలు మిషను వ్యాప్తికి,ప్రజలందరికి దేవుని సువార్తను చేరువ చేయడంలో డా.జె.ప్రమీలా సెల్వరాజ్ అమ్మ కృషి విలువైనదని మాజీకేంద్ర సహాయ మంత్రిజె.డి .శీలం అన్నారు.ప్రమీలమ్మ ఎప్పటికి మనకు



తోడుగానే ఉంటారన్నారు.ఆమెకు కలిగిన ప్రార్ధన శక్తి ఇతరుల పట్ల కనపరిచే ప్రేమ,దయ వంటి లక్షణాలను వారసత్వంగా స్వీకరించాలని సూచించారు.ఆమె స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. డా.జె.ప్రమీలా సెల్వరాజ్ అమ్మ మోకాళ్ళ ప్రార్థన అనుభవంతో ఎంతో మందికి ఆశీర్వాదాలు అందించే ఆత్మీయ తల్లిగా ఎదిగారని అచార్య నాగార్జున యూనివర్సిటి విశ్రాంతి ఏ.ఎస్.డి. ఆచార్య ఎన్.శామ్యూల్ అన్నారు.జెర్రిపోతుల రాజారావు కుటుంబం అప్పట్లోనే సంపన్న కుటుంబంగా ఉండేదన్నారు.ప్రమీలమ్మకు సమీప బంధువుయం.జె.మాణిక్యరావు ద్వారా యూనివర్సిటులు కళాశాలలో పనిచేసే అద్యాపకులకు సివిల్ సర్వెంట్స్‌కు సమాంతరంగా వేతనాలు అమలులో కీలక నిర్ణయం జరిగిందన్నారు. సమాజానికి మేలు చేసే కుటుంబాలనుండి ప్రమీలమ్మ రావడం సంతోషదాయకమన్నారు.మానవసేవతో పాటు దేవుని సేవలో పరిపూరణమైన ,నిస్వార్థపూరి లమైన సేవను కొనసాగించిన డా.ప్రమీలమ్మ జీవితం విశిష్టమైనదని రాష్ట్ర సమాచార హక్కుచట్టం కమీషనర్ శామ్యూల్ జోనాతన్ అన్నారు.కుల మత వర్గప్రాంత బేధాభిప్రాయం లేకుండా అందరిని ఆమె ప్రేమించేవారన్నారు. అన్ని మతాల వారికి తల్లిగా స్థానం సంపాదించారన్నారు.పరలోకములో దేవుని సేవచేస్తూ ఉన్నారనే నిరీక్షణ ప్రతి ఒక్కరికి ఉండాలని తెలిపారు.

# అమరావతి వార్త



# అర్ధరాత్రి ఆపడం న్యాయమా?


## రాత్రి సమయంలో ఉద్యోగాలు చేస్తున్న వారికి తప్పని ఇబ్బందులు

## పోలీసు వాహనం కనబడితే చాలు వణుకుతున్న వైనం

అమరావతి క్రైమ్ ప్రభాతవార్త : గుంటూరు జిల్లా రాజధాని ప్రాంతంగా మారిన తర్వాత పెరిగిన పారిశ్రామికరణ, కాల్ సెంటర్స్, ఐటీ రంగా అభివృద్ధి లో ఉద్యోగుల సమయపాలనలో కూడా చాలా మార్పులు వచ్చాయి. ముఖ్యంగా ఐటి , మాల్స్ ఇతర రంగాల్లో పనిచేసే వారికి అర్ధరాత్రి పూట ఇళ్లకు వెళ్లడం ఆఫీస్ కి రావటం సర్వసాధారణంగా మారింది . అయితే ఇదే విషయమై వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు . రాత్రివేళ ఇంటికి వెళ్లేందుకు లేదా ఆఫీసుకు రావడానికి జంటగా వస్తున్న వారికి పోలీసులు రూపంలో ఇబ్బంది తలెత్తుతున్నట్లు తెలుస్తోంది. వివరాల్లోకెళ్తే ప్రతి పోలీస్ స్టేషన్లో రాత్రిపూట గస్తీ తిరిగేందుకు మూడు నుంచి నాలుగు టీంలు ఏర్పాటు చేస్తారు . వీరు ద్విచక్ర వాహనాలపై తమ స్టేషన్ పరిధిలో ని ప్రాంతాల్లో రాత్రి వేళ గస్తీ నిర్వహిస్తూ దొంగతనాలు జరగకుండా చూడటం , ఎక్కడైనా అల్లరి జరిగేలా కనిపిస్తే పోలీస్ స్టేషన్ అప్రమత్తం చేయడం విధుల్లో భాగం .అయితే ఇదే సమయంలో వీరు బైకులు, కార్లలో వెళ్తున్న వ్యక్తులను ఆపి ప్రశ్నించడం కాకుండా వారిని డబ్బులు డిమాండ్ చేస్తూ ఇవ్వకపోతే వారి ఇళ్లల్లో చెప్తామని బెదిరిస్తూ వసూళ్లకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. గుంటూరు చుట్టుపక్కల ప్రాంతాల్లో ఇటీవల కాలంలో పలు ఐటి కంపెనీలు, స్టాల్స్ ,కాల్ సెంటర్లు ఏర్పాటు అయిన విషయం తెలిసిందే .వీటిలో వందలాదిమంది సిబ్బంది పనిచేస్తున్నారు. ముఖ్యంగా ఈ







సిబ్బందిలో ఎక్కువగా మహిళలే ఉండటం గమనార్హం .అయితే వీరు విధుల సమయానుసారం అర్ధరాత్రి డ్యూటీ ముగించుకుని రావడం లేదా డ్యూటీలకు వెళ్ళటం సాధారణంగా జరుగుతుంది. ఈ క్రమంలో వారిని ఇంటి వరకు దింపేందుకు కానీ లేదా ఆఫీస్ కి వెళ్లేందుకు గాని వేరే వారి వాహనాలను ఆశ్రయించటం కలిసి వెళ్ళటం సాధారణంగా మారింది. ఈ క్రమంలో వారు బండ్లపై వెళుతుండగా గస్తీ పోలీసులు వారిని ఆపి ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు తెలుస్తోంది . తాము ఐటీ సిబ్బంది అని, కాల్ సెంటర్ లో పనిచేస్తున్నాను అని చెప్పిన పట్టించుకోకుండా ఎంతో కొంత వసూలు చేసినందుకు పట్టుబడుతున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ ఎవరైనా గట్టిగా ప్రశ్నిస్తే మీ ఇళ్లల్లో వారికి ఫోన్ చేస్తాం.. స్టేషన్కు పిలుస్తాం అంటూ బెదిరిస్తుండడంతో భయపడి వారు అడిగినంత సమర్పించుకొని బతుకు జీవుడా అని అక్కడి నుంచి బయట పడుతున్నట్లు సమాచారం . అంతే కాకుండా చుట్టుపక్కల పల్లె గ్రామాల నుంచి కూరగాయలు , పాలు తదితరాలను తరలించే వాహనాలను సైతం గస్తీ టీములు నిలువరిస్తూ డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. కాగా నిబంధనల ప్రకారం ఎస్సై అధికారి లేకుండా ఏ పోలీస్ టీం ఎవరిని ఆపేందుకు అధికారం లేదని అలా చేస్తే అది నిబంధనలకు విరుద్ధమని రాజ్యాంగ విశ్లేషకులు చెబుతున్నారు ఈ నేపథ్యంలో పోలీసులు రాత్రివేళ తిరిగే అందరి అనుమానిస్తూ వారిని ఇబ్బందులు గురి చేయడం భావ్యం కాదని పలువురు కోరుతున్నారు సూచిస్తున్నారు. ఇటీవల ఇలాగే ఒక జంటను ఆపి 40 వేల రూపాయలు డిమాండ్ చేసిన కానిస్టేబుల్ పై ఫిర్యాదు అందిన క్రమంలో సదరు కానిస్టేబుల్ పై ఎస్పీ కఠిన చర్యలు తీసుకుని విఆర్ కు పంపించినట్లు సమాచారం .

**గుంటూరు ఎస్పీ సతీష్ కుమార్‌ను వివరణ కోరగా :** రాత్రిపూట తిరిగే ఉద్యోగుల సంఖ్య గుంటూరు నగరంలో పెరిగిన మాట వాస్తవమేనని అన్నారు .అయితే నిబంధనలకు విరుద్ధంగా సిబ్బంది ఎవరైనా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే రాత్రివేళ తప్పనిసరి పరిస్థితుల్లో బయట తిరిగే మహిళలు పురుషులు కూడా తమ వద్ద తగిన గుర్తింపు కార్డులు కలిగి ఉండాలని, అప్పుడే వారి ఎటువంటి ఇబ్బందులు తలెత్తవని తెలిపారు. పోలీసు వ్యవస్థ నగరంలో నేరాలను నియంత్రించేందుకు కఠినంగా వ్యవహరిస్తోందని ఆ సమయంలో కొంత మంది సామాన్యులు కూడా ఇబ్బందికి గురి అయ్యే అవకాశం ఉందని ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని కోరారు.

# మహనీయులు రమబాయి అంబేడ్కర్

**ఆచార్య నాగార్జున విశ్వవిదా ్యలయం,ఫిబ్రవరి 7,ప్రభాతవార్త :** భారత రత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ సతీమణి రమాబాయి అంబేడ్కర్ మహనీయులుగా నిలుస్తారని ఏఎన్‌యు ఉద్యోగులు పేర్కొన్నారు.రమాబాయి అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం విశ్వవిద్యాలయంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ అంబేడ్కర్ వంటి మహనీయులు సతీమణిగా ఆయన అడుగుజాడల్లో నడిచి ఆయన ఎదుగుదలకు ప్రోత్సాహం అందించిన రమాభాయి అభినందనీయురాలిగా అభివర్ణించారు.అంబేడ్కర్ చేస్తున్న ప్రతి పనిలో ఆమె వెన్నంటి ఉండి ఆయనకు ఏ విషయంలోనూ ఇబ ్బందులు కలగకుండా కుటుంబాన్ని నడిపారని గుర్తు చేశారు. అలాంటి మహోన్నత మూర్తిని కీర్తించడం మనందరి భాద్యతగా పేర్కొన్నారు.ఈ సందర్భంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కంకణాల సుబ్బారావు,వికాస అధ్యక్ష,కార్యదర్శులు ఎన్‌ప్రసాద్, జె.శ్రీనివాసరావు,సభ్యులు శశిధర్,పి.నాగరాజు,డాక్టర్ కె.మధుబాబు,సిహెచ్ ఆనంద్,బిసి సంఘం నాయకులు కోటి యాదవ్,తలకాయల రవి,శ్రీను నాయక్,నాగరాజు, శ్రీనివాసరావు,సతీష్,రామకృష్ణ,తదితరులు పాల్గొన్నారు.

# పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి : కమిషనరు

**గుంటూరు, కార్పోరేషన్ ఫిబ్రవరి 7 ప్రభాతవార్త :** నగరపాలక సంస్థ పరిధిలో అభివృద్ధి పనులకు టెండర్ ద్వారా వర్క్ ఆర్డర్ పొందిన కాంట్రాక్టర్లు నిర్దేశిత గడువు మేరకు పనులను పూర్తి చేయాలని, గడువు ప్రకారం చేయని పనులను రద్దు చేస్తామని కమిషనర్ పులి శ్రీనివాసులు కాంట్రాక్టర్లకు స్పష్టం చేశారు. శుక్రవారం కాంట్రాక్టర్లు, ఇంజనీరింగ్ అధికారులతో నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలపై జిఎంసి కౌన్సిల్ సమావేశ మందిరంలో సంయుక్త సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కాంట్రాక్టర్ల వారీగా టెండర్ పొందిన పనులు, పెండింగ్ పనుల వివరాలను కాంట్రాక్టర్లను, అధికారులను అడిగి తెలుసుకొని మాట్లాడుతూ నగరాభివృద్ధికి కాంట్రాక్టర్లు సకాలంలో చేపట్టే పనులే కీలకమన్నారు. పనుల్లో జాప్యం జరిగితే ప్రజలకు అసౌకర్యంతో పాటు అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. కనుక టెండర్ ద్వారా వర్క్ ఆర్డర్ పొందిన ప్రతి కాంట్రాక్టర్ తప్పనిసరిగా నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలన్నారు. పనులు పూర్తైన సీనియారిటీ మేరకు బిల్లుల చెల్లింపు చేస్తామని, ప్రతి నెల చెల్లించిన బిల్లుల వివరాలను అందిస్తామన్నారు. సమావేశంలో ఎస్.ఈ. నాగమల్లేశ్వరరావు, ఈఈలు సుందర్‌రామిరెడ్డి, కోటేశ్వరరావు, డిఈఈలు, ఏఈలు, కాట్రాక్టర్, అసోసియేషన్ అధ్యక్షులు కొండా రమేష్, కుంచాల శివనాగేశ్వరరావు, జైరాంరెడ్డి, వెంకట్రావు, విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.



# పుష్పాలంకరణతో దర్శనమిచ్చిన శ్రీవేణుగోపాలస్వామి



**జగ్గయ్యపేట, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త :** జగ్గయ్యపేట పట్టణంలోని శ్రీవేణుగోపాల కృష్ణ స్వామి వారికి రోహిణి నక్షత్రం పురస్కరించుకుని శుక్రవారం ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, అలంకరణలను శోభాయమానంగా నిర్వహిం చారు. పాలాభిషేకానంతరం పుష్పార్చనచేసి పలు రకాల పుష్పాలతో దివ్యంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని సేవించారు.

# కోటప్పకొండ తిరునాళ్ళ ఏర్పాట్లను పరిశీలించిన పల్నాడు జిల్లా కలెక్టరు,ఎస్పీ

**నరసరావుపేట, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త :** కోటప్పకొండ తిరునాళ్ళకు జరుగుతున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎస్పీ కె.శ్రీనివాసరావులు శుక్రవారం పరిశీలించారు. మహాశివరాత్రి పర్వదినానికి సంబంధించి ప్రసాదం కౌంటర్ల సంఖ్యను మరింత పెంచాలని ఆలయ అధికారులకు ఆదేశాలిచ్చారు. దైవ దర్శనం పూర్తి చేసుకున్న భక్తులకు ప్రసాదాలు అందుబాటులో ఉంచాలన్నారు. ఎన్నికల నియమావళికి లోబడి తిరునాళ్ళలో అధికారులు ఏర్పాట్లు చేయాలన్నారు. స్వామివారి సేవలకు సంబంధించిన విషయాలను ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలిగినా తక్షణం స్పందించేందుకు కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయాలన్నారు. కొండపై, పరిసర ప్రాంతాల్లో నెట్‌వర్క్ సేవలను అందుబాటులో ఉండేలా బిఎస్ఎన్ఎల్ అధికారులు తీసుకోవాలన్నారు. ఘాట్‌రోడ్డు, మెట్ల మార్గంలో కోతుల బెడదను అరికట్టాలన్నారు. హైటెన్షన్ తీగల వద్ద ప్రభలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని, తిరునాళ్ళ రోజున నిరంతర విద్యుత్ సరఫరాకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.అరుణ్‌బాబు తెలియజేశారు. ఎస్పీ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ ట్రాఫిక్‌కు ఎటువంటి ఇబ్బంది లేకుండా అవసరమైన చర్యలను తీసుకుంటామన్నారు. గత ఏడాది తిరునాళ్ళ సమయంలో ట్రాఫిక్ ఇబ్బందులు ఎక్కడా వచ్చాయో గుర్తించి పరిష్కారాన్ని చూపుతామన్నారు. కొండపై ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అవసరమైన భద్రతా చర్యలను చేపడతామన్నారు. ప్రతి ప్రభ వద్ద బందోబస్తు ఉంటుందని ఎస్పీ కె.శ్రీనివాసరావు తెలియజేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్‌గనోరే, అదనపు ఎస్పీ సత్తిరాజు, డిఎస్పీ నాగేశ్వరరావు, సి.ఐ.లు శరత్‌బాబు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.




# ఆపరేషన్ అరణ్యపై పవన్ కళ్యాణ్ ప్రశంసలు

**-ఎర్రచందనం సంరక్షణపై డిప్యూటీ సీఎం కీలక నిర్ణయాలు**

గుంటూరు క్రైమ్,ఫిబ్రవరి 7,ప్రభాతవార్త : ఎర్రచందనం స్మగర్ల భరతం పట్టిన ఆపరేషన్ అరణ్య విజయవంతం పట్ల అటవీశాఖ పనితీరును ఏపి డిప్యూటీ సీఎం కొణిదెల పవన్‌కళ్యాణ్ మెచ్చు కున్నారు. ఎర్రచందనం ఒక అరుదైన జాతి,దాని పరిరక్షణ చాలా ముఖ్య మని ఆయన తెలిపారు. ఎర్రచందనం సంరక్షణపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు.ఈ మేరకు సామాజిక మాద్యమం ఎక్స్ లో పవన్‌కళ్యాణ్ శుక్రవారం ట్విట్ చేశారు.195ఎర్ర చందనం దుంగలను గుర్తించి స్వాధీనం చేసుకోవడంలో ఏపి అటవీ శాఖ,రెడ్ శాండల్స్ యాంటీ స్మగ్లింగ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు, సిబ్బంది కీలకపాత్ర పోషించారన్నారు.అక్రమ స్మగ్లింగ్ చేస్తున్న 8మంది నేరస్తులను పట్టుకున్న అధికారులకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ ఆపరేషన్ అరణ్యతో ఎంతో విలువైన సహజ సంపదను అధికారులు రక్షించారని చెప్పారు.అధికారుల తిరుగులేని నిబద్ధతకు ఇది నిదర్శనమన్నారు. ఇలాంటి చట్టవ్యతిరేక కార్యకలా పాలను అరికట్టడంలో మీ అంకిత భావం,వేగవంతమైన చర్యలు తీసుకున్న అధికారులను ఆయన అభినందిం చారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని ఆం ధ్రప్రదేశ్ ప్రభుత్వం వన్యప్రాణులు,అటవీ నేరాలను అరికట్టేందుకు చేస్తున్న అన్ని ప్రయత్నాలకు అండగా నిలుస్తుందని ప్రశంసించారు.ఈ విజయం భవిష్యత్ తరాల వారికి మన అడవులను సంరక్షించేలా చేస్తాయని పవన్‌కళ్యాణ్ పేర్కొన్నారు.



# మునిసిపల్ సిబ్బంది పై ఆగ్రహం వ్యక్తం చేసిన విజయవాడ కమిషనరు ధ్యానచంద్ర



**విజయవాడ కార్పొరేషన్,ఫిబ్రవరి 7,ప్రభాతవార్త :** 23వ డివిజన్ ఎన్టీఆర్ కాంప్లెక్స్ వద్ద గల యూరినల్స్‌ను గతంలో తీసివేసి ఆ స్థానే మరుగుదొడ్లను నిర్మించమన్న తన ఆదేశాలను ఇప్పటి వరకు పాటించనందుకు మున్సిపల్ సిబ ్బందిపై కమీషనర్ ధ్యానచంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం నగర పర్యటనలో భాగంగా ఆయన సర్కిల్-2 పరిధి లోని గోపాల్ రెడ్డి రోడ్,సర్కిల్-1 పరిధి లోని కెనాల్ రోడ్డు,సర్కిల్-3 పరిధి లోని ఎపిఎస్ఆర్ఎంసి స్కూల్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వినాయకుని గుడి,కెనాల్ రోడ్డు,హోల్డింగ్ ఏరియా ప్రాంతం అంతా పర్యటించి పరిశీలించారు. దసరా ఉత్సవాలు,భవాని విరమణలకు వచ్చే భక్తులకు శాశ్వతమైన మరుగుదొడ్లను హోల్డింగ్ ఏరియాలో నిర్మించాలని అందుకనుగుణంగా ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. నగరంలో ఉన్న బ్రిడ్జిలు అన్నింటికి కంచెలు ఏర్పాటు చేయడమే కాక వాటికి పెయింటింగ్ వేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. కృష్ణా,గుంటూరు గ్యాడ్యుయేట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తు.చ.తప్పకుండా పాటించాలని,రాజకీయ నాయకుల బ్యానర్లు ఫ్లెక్సీలు, తదితర ప్రచారాలను ఎక్కడున్నా సరే తీసేయాలని అధికారులను ఆదేశించారు. సర్కిల్-3 పరిధి లోని ఏపీఎస్ఆర్ఎంసి స్కూల్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. వాడుక నీటి సరఫరా, మరుగుదొడ్లలో మరమ్మతులు చూసి, ప్రతి రోజు నోడల్ ఆఫీసర్లు ఖచ్చితంగా పర్యవేక్షించాలని ఎటువంటి మరమ్మతులు కూడ ఏ అన్నా క్యాంటీన్‌లో ఉండరాదని హెచ్చరించారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీనాథ్‌రెడ్డి,చీఫ్ సిటీ ప్లానర్ జివిజిఎస్‌వి ప్రసాద్,ఇంఛార్జి మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు,సూపరింటెండింగ్ ఇంజనీర్లు పి.సత్యన్నారాయణ,పి.సత్యకుమారి,డిప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్,ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరెడ్డి, సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

# మౌలిక వసతుల కల్పనే ప్రధాన ఏజెండా

**-ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య**


నందిగామ ఫిబ్రవరి 07 ప్రభాతవార్త: నందిగామ మున్సిపాలిటీ అన్ని విధాన అభివృద్ధి పరచడమే ప్రధాన ఏజెండా అని నందిగామ శాసనసభ్యురాలు ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య తెలియజేశారు. నందిగామ మున్సిపల్ చైర్ పర్సన్ గా మండవ కృష్ణకుమారి శుక్రవారం పదవి బాధ్యత చేపట్టడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నందిగామ అభివృద్ధికి ప్రణాళికలను రూపొందించి ప్రణాళికల ద్వారా నందిగామ మున్సిపాలిటీ అభివృద్ధి కి కృషి చేస్తామన్నారు. నందిగామ పురపాకల ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా వారికి కావాల్సిన ప్రధానమైనవి సదుపాయాలైన రోడ్లు, లైట్లు త్రాగునీరు సదుపాయాలకు ఎటువంటి లోటులేకుండా అన్ని విధాల అభివృద్ధిపరిచేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఎమ్మెల్యే తెలియజేశారు. అంతేగాక ఈ మున్సిపాలిటీ నందు వాట్సాప్ గవర్నరీ కూడా తీసుకువచ్చి మున్సిపాలిటీ కమిషనర్ అండ్ స్టాఫ్ అందరం కలిసి అభివృద్ధికి ప్రణాళికల రూపొందించి వాటి ద్వారా అభివృద్ధి పరిచేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని అన్నారు. నూతనంగా



ఎన్నికైన మండవ కృష్ణకుమారి మాట్లాడుతూ మున్సిపాలిటీకమిషనర్ సిబ్బంది అందరి సమన్వయంతో నందిగామఅభివృద్ధి పరిచేందుకు అన్ని విధాల కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు. నూతనంగా ఎన్నికై చైర్ పర్సన్‌గా పదవి బాధ్యతలు చేపట్టిన మండవ కృష్ణకుమారి పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కమిషనర్ ఈవి రమణబాబు కౌన్సిలర్లు మండవ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# జగ్గయ్యపేటలో తెలంగాణా మద్యం పట్టివేత

**జగ్గయ్యపేట, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త :** తెలంగాణా నుండి అక్రమంగా మద్యం తీసుకువచ్చి జగ్గయ్యపేటలో అమ్మకాలు చేసేందుకు ప్రయత్నిస్తున్న ఇరువురు నిందితులను శుక్రవారం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అరెస్ట్‌చేసి వారి నుండి 59 మద్యం సీసాలను స్వాధీన పర్చుకున్నారు. ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ వై శ్రీనివాసచౌదరి ఆదేశాలతో ఇన్స్పెక్టర్ కెవి సుధాకర్ ఆధ్వర్యంలో జగ్గయ్యపేట ఎక్సైజ్ సిబ్బంది ఎస్ఐ ఎం రామశేషయ్య, బి సుబ్బారావు, హెచ్‌సి సిబ్బంది ఈదాడుల్లో పాల్గొన్నారు. నిందితులు మీసాల శ్రీను నుండి 44 సీసాలు, షేక్ జానీ నుండి 15 సీసాలు స్వాధీనపర్చుకున్నట్లు అధికారులు తెలిపారు.



# జగన్ మరలా ముఖ్యమంత్రి కావడం కలే

## -మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి

**చిలకలూరిపేట,ఫిబ్రవరి7,ప్రభాతవార్త:** ఉమ్మడి కృష్ణ, గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆలపాటి ఎంపికను రాష్ట్రమంతా ఆమోదించిందని మాజీమంత్రి ప్రత్తిపాటి అన్నారు. శుక్రవారం ఆలపాటి నామినేషన్ కార్యక్రమంలో ప్రత్తిపాటి పాల్గొన్నారు. అనంతరం అక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జగన్ మరలా ముఖ్యమంత్రి కావటం కల్ల అని అన్నారు. 151నుంచి 11కు ఎందుకు చేరేదో ఆలోచించకుండా, జగన్ వాస్తవాలు విస్మరించి మతిభ్రమించి మాట్లాడుతున్నారని ప్రత్తిపాటి అన్నారు. ప్రతిపక్ష హోదాకూడా ఇవ్వకుండా ఎందుకు అవమానించారో జగన్‌రెడ్డి ఆలోచించాలన్నారు. తన ఐదేళ్ల పాలనపై ఒక్కసారి ఆత్మపరిశీలన చేసుకోవాలని, ప్రజలు, కార్యకర్తలు, నాయకులు తనను, తన పార్టీని ఎందుకు తిర్కరించారో ఆలోచించుకోవాలని ప్రత్తిపాటి హితవు పలికారు. ఆలపాటి రాజేంద్రప్రసాద్ యువజనవిభాగం నాయకుడిగా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి ప్రజాభిమానంతో మంత్రిగా ఎదిగారన్నారు. పార్టీ కోసం అహర్నిశలు కష్టపడిన వ్యక్తి ఆలపాటిఅని, ఆయన గెలుపు నల్లేరుపై నడకేనని ప్రత్తిపాటి తెలిపారు. ఆలపాటి భారీ మెజారిటీతో గెలవాలన్నదే తమ ఆకాంక్ష అని 90శాతం పైగా ఓట్లు ఆయనకు పోలయ్యేలా చూడటమే తన లక్ష్యమని ప్రత్తిపాటి స్పష్టం చేశారు.



# సాతులూరు వద్ద ట్యాంకర్ లారీ ఢీకొని గేదెల కాపరి బి వరలక్ష్మి దుర్మరణం

**నాదెండ్ల,ఫిబ్రవరి7,ప్రభాతవార్త:** మండలంలోని సాతులూరు గ్రామం వద్ద రాష్ట్ర రహదారిపై శుక్రవారం వేగంగా వస్తున్న ట్యాంకర్ లారీ ముందు వెళుతున్న తన గేదెను, లేగదూడను తప్పించబోయి ఆ లారీ ఢీ కొట్టడంతో గేదెను తోలుతున్న సాతులూరు గ్రామానికి చెందిన బి వరలక్ష్మి(59), లేగదూడ లారీ టైర్ల క్రిందపడి ఛిద్రమైపోయారు. గేదె వెనుక కాళ్లు ఇరిగిపోయాయి. నాదెండ్ల పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# ఏపి స్టేట్ సాఫ్ట్ టెన్నిస్ ఛాంపియిన్ షిప్ పోటీల్లో జిల్లా నుంచి జయరామ్ ఎంపిక

**గుంటూరు స్పోర్ట్స్,ఫిబ్రవరి 7,ప్రభాతవార్త :** శ్రీపాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్ క్రీడాకారుడు పి.జయరామ్ కరూ ్నల్లో ఈనెల 9వ తేది జరిగే ఏపి స్టేట్ సాఫ్ ్ట టెన్నిస్ ఛాంపియిన్ షిప్ పోటీల్లో గుంటూరు జిల్లా జట్టునుండి ప్రాతినిధ్యం వహిస్తున్నారు.జయరామ్ ప్రతిరోజు ఎన్ ్టఆర్ సే ్టడియంలో శిక్షణ పొందుతూ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం విశేషం.రాష్ట్రస్థాయి సాఫ్ట్ టెన్నిస్ పోటీల్లో పాల్గొంటున్నందుకు గాను శ్రీపాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్ కార్యదర్శి పాటిబండ్ల విష్ణువర్ధన్,స్కూల్ ప్రిన్సిపాల్,డైరెక్టర్,ఎన్టీఆర్ స్టేడియం సభ్యులు,మున్సిపల్ అధికారులు అభినందించారు.

# 9న అవగాహనలో క్యాన్సర్ వ్యాధిపై సమగ్ర అవగాహన

**గుంటూరు కల్చరల్,ఫిబ్రవరి 7,ప్రభాతవార్త :** అవగాహన సంస ్థ ఆధ్వర్యంలో క్రమం తప్పకుండా గత 15సంవత్సరాలుగా ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న ఆరోగ ్యసభలో ్ల భాగంగా ఈ వారం క్యాన ్సర్ వ్యాధి కారణాలు చికిత్స అన్న అంశంపై సభ ఏర్పాటు చేయబడింది.ఫిబ్రవరి 9వ తేది ఆదివారం ఉదయం 11గంటలను సంస్థ కార్యాలయంలో నిర్వహించే ఆరోగ్యసభకు ప్రముఖ క్యాన్సర్ వ్యాధినిపుణులు డాక్టర్ డి.ఎస్.రాజానాయుడు పాల్గొంటారన్నారని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి తెలిపారు.ఆసక్తి గలవారందరూ ఈ సభకు హాజరు కావాలని అవగాహన సంస్థ విజ్ఞప్తి చేస్తుంది.

# సేంద్రీయ వ్యవసాయం పై రైతులకు అవగాహన

**మంగళగిరి,ఫిబ్రవరి 7,ప్రభాతవార్త:** ప్రకృతిలో లభించే జీవ ఎరువులు,సే ంద్రియ పద్ధతుల ద్వారా వ్యవసాయం చేయడం వలన ఖర్చులు తగ్గటంతోపాటు నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులను దిగుబడి చేసుకోవడంతో మార్కెట్లో మంచి గిట్టుబాటు ధర లభిస్తుందని కెవికె వ్యవసాయ కళాశాల డైరెక్టర్ డాక్టర్ రత్నప్రసాద్ రైతులకు సూచించారు. కెఎల్ యూనివర్సిటీ అగ్రికల్చర్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్ ,వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం మంగళగిరి మండలంలోని నూతక్కి గ్రామంలో రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సేంద్రియ వ్యవసాయం ఎలా చేయాలి అనే అంశంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. రసాయనిక ఎరువులు,పురుగు మందులు,కృత్రిమ రసాయ నాల వలన పంట ఉత్పత్తుల నాణ్యత దెబ్బతిం టుందని తద్వారా ధర కూడా గణనీయంగా తగ్గుతుందని,అధిక దిగుబడి,తెగుళ్ళ నిరోధకత విత్తనాలు,జీపీఎస్,డ్రోన్స్,సెన్సార్ల సహాయంతో గ్రీన్,పాలీహౌస్,స్ప్రింకర్ల ద్వారా ఆధునిక వ్యవసాయ పద్ధతులను వినియోగించడం వలన డబ్బు,సమయం ఆదా అవుతుందని ఏఐ అండ్ డిఎస్ విభాగాధిపతి డాక్టర్ బి.తిరుపతిరెడ్డి అవగాహన కల్పించారు.ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ వి.జోసిలిన్,డాక్టర్ నమీర్,డాక్టర్ కిరణ్,కోఆర్డినేటర్ పి.సురేష్,వాలంటీర్లను యూని వర్సిటీ ఇన్‌ఛార్జ్ వైస్ ఛాన్సలర్ డాక్టర్ కె.రామకృష్ణారావు,ప్రొ వైస్ ఛాన్సలర్ ఏ.వి.ఎస్ ప్రసాద్,డాక్టర్ ఎస్.వెంకట్రామ్,డీన్లు డాక్టర్ కె.ఆర్.ఎస్ ప్రసాద్,డాక్టర్ హబీబుల్లా ఖాన్,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీకాంత్‌రెడ్డి అభినందించారు.



# ట్రేడ్ లైసెన్సులు రెన్యువల్ పేరిట మోసగాళ్ల బరితెగింపుపై పోలీసులకు ఫిర్యాదు

## - మునిసిపల్ కమిషనరు పి శ్రీహరిబాబు


**చిలకలూరిపేట, ఫిబ్రవరి7, ప్రభాతవార్త:** పట్టణంలో పలుచోట్ల మోసగాళ్లు బరితెగిస్తున్నా రని నేరుగా మున్సిపల్ కమీషనర్ అంటూనే వ్యాపార, వాణిజ్య వర్గాలవారికి ఫోన్లు చేసి డబ్బులు వసూలు చేయడం నేరాలక్కు బరితెగింపు పరాకాష్టకు చేరుకుంది. పట్టణానికి చెందిన కొంతమంది వ్యాపారస్తులకు ఒక వ్యక్తి తాను మున్సిపల్ కమీషనర్ అని, ట్రేడ్ లైసెన్సులు రెన్యువల్ చేసుకోవాలని లేనిపక్షంలో దుకాణాలు సీజ్ చేస్తామని చెప్పడంతో వ్యాపార వర్గాల వారు హడలిపోతున్నారు. కొంతమంది గత్యంతరం లేక అతను సూచించిన నెంబర్‌కు ఫోన్‌పే ద్వారా నగదు చెల్లించారు. ఈ విషయం మున్సిపల్ కమీషనర్ పి శ్రీహరిబాబు దృష్టికి రావడంతో ఆయన సీరియస్ అయ్యారు. వెంటనే ఆదే విషయంపై పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ వ్యాపారులకు ట్రేడ్ లైసెన్స్ చెల్లించాలని మస్తాన్ సెల్ నెంబర్ 630080 5117తో వచ్చే ఫోన్‌కాల్స్ ను నమ్మవద్దని సూచించారు. ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ ఆన్‌లైన్‌ద్వారా చెల్లించవచ్చునని అన్నారు. ఎవరైనా బెదిరింపులకు పాల్పడితే వారు కూడా పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.



# వైభవంగా సెయింట్ జోసెఫ్స్ పాఠశాల వజ్రోత్సవ వేడుకలు

## - వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు జూలకంటి, యరపతినేని

రెంటచింతల, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త: స్థానిక సెయింట్ జోసెఫ్స్ ఉన్నత పాఠశాలలో అయిదు దశాబ్దాల విద్యా సంవత్సరాల్లో పదో తరగతి చదివిన విద్యార్థులు పాఠశాల వజ్రోత్సవ వేడుకలను గురువులతో కలిసి వైభవంగా నిర్వహించారు. 75 వసంతాల వెనుక దాగిన ఆత్మీయత ఆహ్వానించడంతో ప్రాంగణంలో స్నేహ పరిమళాల సుగంధం వెదజల్లింది. పాఠశాలలో చదువుకున్న వాళ్లు ఎన్నో సంవత్సరాల క్రితమే విడిపోయారు. ఎవరు ఎక్కడ ఉన్నారో? ఏం చేస్తున్నారో తెలియని పరిస్థితి. కొందరు ఉద్యోగస్తులయితే, మరికొందరు వ్యాపారస్తులుగా, మరికొందరు వివిధ రంగాల్లో స్థిరపడి పనులు చేస్తూ అలసి జీవిత చరమాంకంలో విశ్రాంతి తీసకుంటున్నారు అలాంటి వారందరి ఫోన్లు సేకరించి, అందరినీ ఒకేచోట చేర్చే బాధ్యతను కొదరు పూర్వ విద్యార్థులు భుజస్కంధాలపై వేసుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఏళ్ల తర్వాత నాటి స్నేహితులను కలుసుకోవడంతో వారి ఆనందాలకు అవధులు లేవు. ఒకరినొకరు కలుసుకుని ఆప్యాయంగా పలకరించుకున్నారు. పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. దివంగతులైన ఉపాధ్యాయులను తలచుకుని ఆత్మీశాంతికి నివాళులర్పించారు. ఆనాటి గురువులతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. గురువులను సన్మానించి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, పూర్వవిద్యార్థి, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావులు మాట్లాడుతూ పల్నాట క్రమశిక్షణకు మారుపేరుగా సెయింట్ జోసెఫ్స్ పాఠశాల పేరుగాంచింద ్న్నారు. ప్రతి పనికి, కార్యక్రమానికి లక్ష్యాలు, ఆశయాలు ఉన్నట్లే ఇలాంటి కార్యక్ర మాలను సమయస్ఫూర్తిగా నిర్వహిస్తే ఎన్నో ప్రయోజనాలు ఉంటాయన్నారు. కొన్ని రంగాల్లో ఎదిగినవారు, ప్రజాప్రతినిధులు, నిపుణులు, విద్యావేత్తలు ముఖ్యఅతిథులుగా సమ్మేళనానికి వచ్చిన వారిరి ప్రసంగాలు విద్యార్థులకు దిక్సూచిగా ఉంటాయన్నారు. ముఖ్యంగా సమ్మేళనాలు పూర్వవిద్యార్థులు, పూర్వఉపాధ్యాయుల మధ్య సత్సంబంధాలను బలోపేతం చేయడమేకాక రాబోయే తరాలకు ఆదర్శంగా ఉంటుందనడంలో సందేహం లేదన్నారు. ముఖ్యఅతిథులకు, పూర్వ విద్యార్థులకు స్కూల్ కరస్పాండెంట్ పీటర్ పాపయ్య స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జబర్దస్త్ టీమ్‌తో ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శన ఆహుతులను అలరించింది.





# పేద విద్యార్థినికి జనసేన పార్టీ చేయూత

**నరసరావుపేట, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త :** పేద విద్యార్థినికి జనసేన పార్టీ అండగా నిలిచింది. మండలంలోని జొన్నలగడ్డ గ్రామంలో బప్పల్లపూడి హేమలత చదువులో ముందంజలో ఉంటుంది. విద్యార్థినికి తల్లిదండ్రులు లేకపోవడంతో చదువు కొనసాగించలేని పరిస్థితి ఏర్పడింది. సమాచారం తెలుసుకున్న జనసేన పార్టీ మండల అధ్యక్షులు కృష్ణంశెట్టి గోవిందరావు విద్యార్థినికి హేమలతకు ఆర్థిక సహాయం చేశారు. పేద విద్యార్థిని భవిష్యత్తులో ఉన్నత చదువులు అభ్యసించాలని ఆకాంక్షించారు. ఏరియా హాస్పటల్ అభివృద్ధి కమిటీ మెంబర్ మిరియాల వెంకటసుబ్బమ్మ, పార్టీ జిల్లా కార్యదర్శి అద్దేపల్లి ఆనంద్, గుప్తా శ్రీకాంత్, కిషోర్, రేణుక, శ్రావణి, నిర్మలా, మాధవి తదితరులు పాల్గొన్నారు.



# సందడి సందడిగా విజ్ఞానోత్సవ్

**పొన్నూరు, ఫిబ్రవరి 7,ప్రభాతవార్త:** ఒకటి కాదు....రెండు కాదు...ఏకంగా 80 ఈవెంట్లు. కనుచూపు మేర ఎటువైపు చూసినా విద్యార్థులు క్రీడా సంబరాల్లో మునిగిపోయారు. వాలీబాల్, బాస్కెట్‌బాల్, కబడ్డీ, టేబుల్ టెన్నిస్, చెస్, అథ్లెటిక్స్, త్రోబాల్, ఫుట్‌బాల్, హాకీ, తైక్వాండో, ఖోఖో, ట్రాక్ అండ్ ఫీల్డ్ అవెంట్స్, యోగాసన....ఇలా ఒకటేమిటి అనేక విభాగాల్లో విద్యార్థులు అద్భుత ప్రదర్శనలతో ఉర్రూతలూగించారు. ఒకరితో ఒకరు నువ్వా నేనా అన్నట్లు పోటీపడి విజయాలు సాధిస్తున్నారు. చేబ్రోలు మండలం, వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో జరుగుతున్న జాతీస్థాయి విజ్ఞాన్ మహోత్సవ్ పోటీలు విద్యార్థులను ఆసాంతం అబ్బురపరిచింది. దేశానికి అమూల్యమైన సంపద యువతేనని, దేశ భవిష్యత్‌ను మార్చగలిగే శక్తి యువతకే ఉందని విజ్ఞాన్స్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌రల్, కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్ అన్నారు. ఆటల్లో విద్యారు ్థలు ఉత్సాహంగా పాల్గొనడం వలల జిజ్ఞాస, సమర్ధ సమయ పాలన, బుద్ధి స్థిరత్వం, వేగంగా సంగ్రహించుకోగలడం....ఇలా ఎన్నో అంశాలు అభివృద్ధి చెందుతారన్నారు. క్రీడలు శారీరక ఉల్లాసానికే కాకుండా మానసిక ఉల్లాసానికి కూడా దోహదపడతాయన్నారు. శారీరక, మానసిక దృఢత్వంతో పాటు స్నేహ సంబంధాలు మెరుగుకు క్రీడలు దోహదం చేస్తాయన్నారు. చదువుతోపాటు క్రీడలు, సృజనాత్మకత అంశాలపై ప్రావీణ్యం సాధించనప్పుడే సంపూర్ణ విద్యార్థులు అవుతారన్నారు.

**పోటా పోటీగా క్రీడలు:** జాతీయస్థాయి విజ్ఞాన్ మహోత్సవ్‌లో భాగంగా నిర్వహిస్తున్న పోటీల్లో విద్యార్థులు నువ్వా నేనా అన్నట్లు పోటీపడుతున్నారు. అథ్లెటిక్స్‌లో భాగంగా 100మీటర్లు, 200మీటర్లు, 400మీటర్లు, 800మీటర్లు పరుగు పందేలను నిర్వహించారు. వీటితోపాటు వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో, పుట్‌బాల్, టేబుల్ టెన్నిస్, చెస్ పోటీలను నిర్వహించారు. విజ్ఞాన్ మహోత్సవ్‌లో భాగంగా నిర్వహిస్తున్న పోటీలన్నీ కూడా సెమీ ఫైనల్స్‌కు చేరుకున్నాయి.

**నేడు సందడి చేయనున్న క్రీడా, సినీ తారలు:** విజ్ఞాన్స్ మహోత్సవ్‌లో భాగంగా శనివారం జరిగే ముగింపు కార్యక్రమానికి ఇండియన్ ఫిల్మ్ డైరెక్టర్, స్క్రీన్ రైటర్ కె.ఎస్ రవీంద్ర(బాబి), 2024పారాలింపిక్స్ బ్రాంజ్ మెడలిస్ట్, ఇండియన్ పారా పిస్టల్ షూటర్, అర్జున అవార్డీ రుబినా ఫ్రాన్సిస్ విచ్చేస్తున్నట్లు వైస్ చాన్స్‌లర్ తెలిపారు.

**ఆకట్టుకున్న ప్రదర్శనలు:** తరగతి గదుల్లో పుస్తకాలతో కుస్తీ పడుతున్న విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగిన కళలు, సృజనాత్మక నైపుణ్యాలకు పదును పెడుతూ మూడు రోజుల పాటు జరగనున్న పోటీల్లో రెండో రోజు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థులు సోలో సాంగ్ ్స, లఘు నాటికలు, రెట్రో డాన్స్ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. కళాకారులు పలు నృత్య రూపకాలకు అనుగుణంగా నర్తించి మంత్రముగ్ధుల్ని చేశారు. ముఖ్యంగా జానపద, శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఓలలాడించాయి. వీటితోపాటు మ్యూజిక్, లిటెరరీ, స్పాట్‌లైట్, డాన్స్ డ్రమాటిక్స్ అండ్ ఫిల్మ్ మేకింగ్, ఫ్యాషన్, ఫైన్ ఆర్ట్స్, కల్చరల్స్ థియేటర్ ఆర్ట్స్ పోటీల్లో విద్యార్థులు సత్తాచాటారు. జాతీయస్థాయి విజ్ఞాన్ మహోత్సవహలో భాగంగా ఏర్పాటు చేసిన స్టాళ్ళు విద్యార్థులను ఆకర్షించాయి. కార్యక్రమంలో విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి, వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు పాల్గొన్నారు.





# జెడ్పీ పాఠశాలను మోడల్ పాఠశాలగా తీర్చిదిద్దేందుకు కృషి

**యడ్లపాడు, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త :** మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మోడల్ హబ్బుగా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నామని, ఇదేవిధంగా మండలంలోని మిగిలిన పాఠశాలలు రూపొందించేలా తమ వంతు సహకారం అందిస్తామని, ఇందులో భాగంగానే ఐటిసి మరియు అసిస్ట్ సంయుక్తంగా గ్రామాల్లో ప్రజల భాగస్వామ్యంతో కార్యక్రమాలను చేపడుతున్నామని అసిస్ట్ డైరెక్టర్ జాస్తి రంగారావు తెలిపారు. శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో అయన పాల్గొని ప్రసంగించారు. పాఠశాలల్లో నూరు శాతం స్వచ్ఛత సాధనే లక్ష్యంగా స్వచ్ఛంద సంస్థలు పనిచేస్తున్నాయన్నారు. భవిష్యత్తులో నిర్వహించే కార్యక్రమాలను చర్చించారు. వ్యక్తిగత పరిశుభ్రతపై శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ ఒన్ నాగరత్నం, హెచ్‌ఎమ్ కె వెంకట రామిరెడ్డి, అసిస్ట్ సంస్థ డిప్యూటి డైరెక్టర్ పావులూరి రవిబాబు, కో-అర్డినేటర్ డేవిడ్ వెంకయ్య, కార్యకర్తలు, అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



# మిరప సాగుపై సమగ్ర సస్యరక్షణ పై రైతులకు అవగాహన సదస్సు

**యడ్లపాడు, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త :** మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామంలో శుక్రవారం నరసరావుపేట డిఎటిటిసి సెంటర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ ఎమ్ నగేష్ మిరప సాగుపై సమగ్ర సస్యరక్షణ పై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో మిరప పంటను ఆశించే చీడపీడలు రసంపీల్చు పురుగు, నల్లి, నల్లతామర, తెల్లదోమ మరియు తెగుళ్ల గురించి పూర్తి అవగాహన కలుగ జేసారు. వాటి నివారణ కొరకు చేపట్టవల్సిన పద్ధతులు జీవన ఎరువుల గురించి, ఐపిఎమ్, పంట మార్పిడి గురించి తెలిపారు. ఉద్యాన శాఖలో అమలు అవుతున్న పథకాలు, రాయితీ వివరాల గురించి వివరించారు. రైతు ఉత్పత్తి దారుల సంఘం గురించి వాటి ప్రాధాన్యత, ఉద్యాన శాఖ అధికారి వి విషాల్ తెలిపారు. కార్యక్రమంలో స్థానిక అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయి : ఎస్సై

**యడ్లపాడు, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త :** గ్రామీణ ప్రాంతాలలో నిర్వహించే క్రీడలు ముఖ్యంగా మానసిక, శారీరక ఉల్లాసానికి దోహదపడతాయని, నిత్యం వివిధ రంగాలలో విధులు నిర్వహించే వారికి కొంత వరకు ఇవి ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని, నేడు పారిశ్రామిక రంగంలో ప్రతి ఒక్కరూ క్రీడా కార్యక్రమాలను ఏర్పాటుచేస్తే కార్మికులలో కూడా వారి సామర్ధ్య పెంపొందుతుందని, దీనికి తోడు ప్రతి కార్మికుడు చెడు అలవాట్లుకు దూరంగా ఉండి శాంతి భద్రతలకు విఘాతం కలుగ కుండా వారి కటుంబాలు రోడ్డున పడకుండా జాగ్రత్తలు వహించాలని ఎస్సై వంకాయలపాటి బాలకృష్ణ పేర్కొన్నారు. మండల పరిధిలోని అనంతలక్ష్మీ నూలు మిల్లులో శుక్రవారం ప్రారంభమైన అంతర్గత క్రీడా పోటీల ప్రారంభ సమావేశంలో అయన ముఖ్య అతిదిగా విచ్చేసి క్రీడలను ప్రారంభించి అనంతరం జరిగిన సమావేశంలో ప్రసంగించారు. మిల్లు ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ సామినేని ఫణికుమార్ స్వాగతోపన్యాసం చేస్తూ మిల్లులో క్రీడా స్ఫూర్తి మరియు సహృధ్భావ వాతారణం పెంపొందించే ప్రణాళికలలో భాగముగా ప్రతి సంవత్సరం క్రీడా పోటీలు నిర్వహించుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ బోలినేని ప్రసాద్, మేనేజర్ వెంకటేశ్వర్లు, కార్మికులు పాల్గొన్నారు.



# పేకాట స్థావరంపై దాడి

**యడ్లపాడు, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త :** మండల పరిధిలోని కారుచోల గ్రామంలో పేకాట అడుతున్న ముందస్తు సమాచారంతో దాడులు నిర్వహించటం జరిగిందని, ఇందులో భాగంగా సంఘటన సమయంలో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి 12వేల ఒక్కవంద రూపాయలు స్వాధీనపర్చుకోవటం జరిగిందని ఎస్సై వి భాలకృష్ణ తెలిపారు. ఈ దాడులలో రూరల్ సిఐ బి సుబ్బనాయుడు పాల్గొని నిర్వాహకులను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా అయన వివరిస్తూ ఎక్కడైనా ఇటువంటి అసంఘటిత కార్యక్రమాలకు పాల్పడినట్లు తెలిస్తే వెంటనే స్థానికులు పోలీసు వారికి సమాచారం అందజేయాలని, వారి పేర్లు గోప్యంగా ఉంచబడతాయని, ఇటువంటి కార ్యక్రమాలలో పాల్గొని కుటుంబాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. దాడులలో స్ధానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేసే ప్రాంతాలు

**చిలకలూరిపేట,ఫిబ్రవరి7,ప్రభాతవార్త:** సబ్‌స్టేషన్, లైన్ల మరమ్మత్తుల కారణంగా రెండవ శనివారం నియోజకవర్గ పరిధిలోని చిలకలూరిపేట రూరల్ మండలం, యడ్లపాడు మండలంలోని అన్ని గ్రామాలకు గృహ, వాణిజ్య, పరిశ్రమలకు, వ్యవసాయమునకు ఉదయం 9గంటలనుండి మద్యాహ్నం 2 గంటలవరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని విద్యుత్ శాఖ డిఈఈ ఆర్ అశోక్‌కుమార్ శుక్రవారం తెలిపారు. అదేవిధంగా పట్టణ పరిధిలోని గాంధీపేట, సుబ్బయ్యతోట, ఆర్టీసి కాలనీ, ఎన్‌ఆర్‌టి సెంటర నుంచి రిజిస్ట్రార్ ఆఫీస్ కార్యాలయం వరకు, పెదనందిపాడు రోడ్డు, దాసరికాలనీ, చీరాలరోడ్, గవర్నమెంట్ హస్పటల్ రోడ్, మున్సిపల్ ఆఫీసు ప్రాంతం, టౌన్2 పరిధిలోని పోలీరెడ్డిపాలెం, బ్యాంక్ కాలనీ, నరసరావుపేట రోడ్డు, మదర్‌థెరిస్సా కాలనీ, జిడ్డుపాలెం ప్రాంతాలకు కూడా ఉదయం 9గంటలనుండి మద్యాహ్నం 2 గంటలవరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని డిఈఈ ఆర్ అశోక్‌కుమార్ తెలిపారు. కావున వినియోగదారుల సహకరించవలసినదిగా ఆయన కోరారు.

# మున్సిపల్ చైర్మన్ షేక్ రఫానిని పరామర్శించిన జాష్టి కృష్ణహరీష్, డిఈ రహీం

**చిలకలూరిపేటటౌన్,ఫిబ్రవరి7, ప్రభాతవార్త :** ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకొని తన నివాసంలో విశ్రాంతి తీసు కుంటున్న మున్సిపల్ చైర్మన్ షేక్ రఫానిని ప్రముఖ స్వచ్ఛంద సేవాసంస్థ అసిస్ట్ అసోసియేట్ డైరక్టర జాష్టి కృష్ణ హరీష్, మున్సిపల్ డిఈ షేక్ అబ్దుల్ రహీం, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు గట్టినేని సాయిలు శుక్రవారం కలసి పరామర్శిం చారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.



# ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం

## -తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్

**పొన్నూరు, ఫిబ్రవరి 7,ప్రభాతవార్త:** ఈ నెల 27వ తేదీన జరిగే కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం శాసనమండలి సభ్యుడి ఎన్నికకు సర్వం సిద్ధం చేసినట్లు తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ తెలిపారు. పొన్నూరు మండల, పట్టణ పరిధిలో మొత్తం ఐదు పోలింగ్ స్టేషన్లు ఉన్నట్లు చెప్పారు. అన్ని పోలింగ్ స్టేషన్‌లు నిడుబ్రోలు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఓటు హక్కును వినియోగించుకోవచ్చన్నారు. పొన్నూరు అర్బన్ పరిధిలో 261వ పోలింగ్ స్టేషన్‌లో పురుషులు-612మంది కాగా స్త్రీలు-407మంది ఉన్నట్లు చెప్పారు. 462లో 1నుంచి600ల వరకు ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. 262-ఎ స్టేషన్‌లో-601నుంచి1146వరకు ఉన్నట్లు చెప్పారు. మొత్తం పురుషులు-1279, స్త్రీలు-886 వెరశి-2165ఓటర్లు ఉన్నట్లు చెప్పారు. పొన్నూరు రూరల్ పరిధిలో 263లో- పురుషులు-594 కాగా స్త్రీలు-313మంది, ఒకరు ఇతరులున్నట్లు తెలిపారు. 264పోలింగ్ స్టేషన్లలో పురుషులు-300కాగా స్త్రీలు 210మంది వెరశి-1410మంది ఉన్నట్లు చెప్పారు. పొన్నూరురూరల్, అర్బన్ మొత్తం కలుపుకొని 3,583మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఓటర్లు పోలింగ్ సిబ్బందికి, ఎన్నికల అధికారులకు సహకరించి ప్రశాంతమైన వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని తహశీల్దార్ కోరారు.



# శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

**వినుకొండ,ఫిబ్రవరి7,ప్రభాతవార్త:** మాఘమాసం పురస్కరించుకొని స్థానిక శ్రీనివాస్‌నగర్ నందు గల శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, సామూహిక వత్రాలు శుక్రవారం నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు భాగవతుల రవికుమార్, నాయకులు గజవల్లి నాగపవన్‌కుమార్, రెడ్డి బంగారయ్య, కోటేశ్వరరావు, అర్చకులు శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# గుండె ఆపరేషన్‌కు రోటరీక్లబ్ ఆర్థిక సాయం

**వినుకొండ,ఫిబ్రవరి7,ప్రభాతవార్త:** గుండె సంబంధిత అనారోగ్య సమస్యతో బాధపడుతున్న ఐనకోల ఇజ్రాయలు మేరీ దంపతులకు రోటరీ క్లబ్ ఆఫ్ వినుకొండ వారు రూ. 20వేలు ఆర్ ్ధిక సాయం ఆపరేషన్ నిమిత్తం శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్‌రెడ్డి, సెక్రటరీ ఏరువా వెంకటనారాయణ, కోశాధికారి షేక్ మస్తాన్‌వలి, మాజీ అధ్యక్షులు చిరుమామిళ్ళ కోటేశ్వరరావు, ఎన్.వి రామన్, బత్తుల శ్రీనివాసరావు, ఆలా శ్రీనివాసరావు, సాధినేని శ్రీనివాసరావు, బి. వెంకటేశ ్వర్‌రెడ్డి, ముప్పాళ్ళ రమేష్, రాజారెడ్డి, పొత్తూరి నవీన్, దావులూరి శ్రీనివాసరావు, తిరుపతిరాయుడు తదితరులు పాల్గొని ఆర్థిక సాయం అందజేశారు.



# తహశీల్దార్‌ను సన్మానించిన ఎమ్మార్పీయస్

**అమరావతి, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త :** మండల తహశీల్దార్ మీసాల డానియేల్‌ను అమరావతి మండల ఎమ్మార్పీయస్ నేతలు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. దుశ్శాలువాతో ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీ యస్ అమరావతి మండల అధ్యక్షుడు వెంకటస్వామి మాట్లాడుతూ ఎస్సీ కులగణనలో మార్పు చేర్పులకు మరొక అవకాశం ఇవ్వాలని తహశీల్దార్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎస్ జిల్లా కార్యదర్శి జానబాబు పాల్గొన్నారు.



# మత్స్యకారుల జీవితాల్లో ప్రభుత్వం వెలుగులు నింపుతుంది

**బెల్లంకొండ, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త :** మత్స్యకారుల జీవితాల్లో ప్రభుత్వం వెలుగులు నింపుతుందని జిల్లా మత్స్యశాఖ అధికారి ఎస్.సంజీవరావు అన్నారు. పది లక్షల చేప పిల్లలను మత్స్యశాఖ, వ్యవసాయశాఖ అధికారులు నదిలో శుక్రవారం విడుదల చేశారు. బోదానం రేవులో మత్స్యకారుల జీవనోపాధి మెరుగుపరిచే విధంగా ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా ఈ కార్యక్రమం జరిగిందని వారు తెలియజేశారు. జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశాల మేరకు సీడ్ కమిటీ, స్టాకింగ్ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కృష్ణయ్య, పర్యవేక్షకులు భాగ్యలత, ఎంపిడిఓ వై.హనిమిరెడ్డి, మత్స్య సహాయకులు వై.పావని, ఎన్.రమేష్, లైసెన్స్ హోల్డర్ ఏలూరి బ్రహ్మయ్య పాల్గొన్నారు.



# హెల్మెట్ లేకుంటే ప్రవేశం లేదు : ఎస్ఐ షఫీ

**విజయపురిసౌత్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:** ద్విచక్రవాహదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, లేకపోతే ప్రవేశం లేదని విజయపురిసౌత్ ఎస్సై షేక్ మహమ్మద్ షఫీ అన్నారు. స్థానిక అంతర్రాష్ట్ర తనిఖీ కేంద్రం వద్ద నో హెల్మెట్ - నో ఎంట్రీ కార్యక్రమాన్ని చేపట్టారు. హెల్మెట్ లేకుండా నడుపుతున్న ద్విచక్రవాహ దారులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలన్నారు. హెల్మెట్ ధరించి గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుకోవాలన్నారు. కుటుంబాన్ని గుర్తు పెట్టుకుని వాహనాలు భద్రంగా నడపాలన్నారు. హెల్మెట్ ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.



# కోటప్పకొండ జాతర ఏర్పాట్లలో నిర్లక్ష్యం వీడాలి

## -మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి

నరసరావుపేట, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త : కోటప్పకొండ జాతర ఏర్పాట్లలో అధికారులు, అధికారపార్టీ నాయకులు నిర్లక్ష్యం వీడాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలోని సమ్మక్క సారక్క జాతర తర్వాత రెండవ అతి పెద్ద తిరునాళ్ళ కోటప్పకొండ జాతర అన్నారు. తిరునాళ్ళకు 15 రోజులు కూడా



సమయం లేదన్నారు. 20 లక్షల మంది భక్తులు తిరునాళ్ళకు హాజరౌతారన్నారు. ఇటువంటి ప్రతిష్ఠాత్మకమైన జాతర ఏర్పాట్లను సక్రమంగా చేయడం లేదన్నారు. చిత్తశుద్ధి లోపం కనిపిస్తుందన్నారు. కోటప్పకొండకు వెళ్ళే రోడ్లు, లింక్ రోడ్డు పనులు ఎక్కడా ప్రారంభించలేదన్నారు. అవిశాయపాలెం, గురవాయపాలెం రోడ్డుకు రూ.4 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసినా టెండర్లు పిలవలేదని, జీవో రాలేదన్నారు. అయితే ఈ లోపే టెండర్ లేకుండానే రోడ్డును అధికారపార్టీ నాయకులు తవ్వడం జరిగిందన్నారు. దీనిపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలన్నారు. తవ్విన రోడ్డును తిరునాళ్ళకు ఉపయోగపడేలా చేయాల్సిన బాధ్యత ఎమ్మెల్యే అరవింద్‌బాబుపై ఉందన్నారు. గురవాయపాలెం కాలువకట్ట రోడ్డు పూర్తిగా పాడైపోయిందన్నారు. రహదారుల్లో గోతులు ఉంటే ప్రభలకు పడిపోయే ప్రమాదం ఉందన్నారు. మట్టి తవ్వకాలు అక్రమంగా చేస్తూ అధికారపార్టీ టిప్పర్‌కు రూ.1800లు చొప్పున అక్రమంగా వసూలు చేస్తున్నారని ఆరోపించారు. చెరువుల్లో త్రాగునీటిని నింపలేదన్నారు. తాత్కాలిక మరుగుదొడ్లు నిర్మించలేదన్నారు. విఐపి బస్సుల ఏర్పాటుతో ఏ మాత్రం క్లారిటీ లేదన్నారు. జెయింట్‌వీల్స్ వంటి వాటిని ఏర్పాటు చేసుకునేందుకు అధికారపార్టీ నాయకులకు కప్పంకట్టాలని హుకుం జారీ చేశారని మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ధ్వజమెత్తారు.

# విధినిర్వహణలో అలసత్వం వహిస్తే ఉపేక్షించేదిలేదు

## -బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్‌డూడి

**బాపట్ల,ఫిబ్రవరి07,ప్రభాతవార్త:** విధినిర్వహణలో అలసత్వం వహిస్తే ఉపేక్షించబోమని జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఐపీఎస్ పోలీస్ అధికారులను హెచ్చరించారు. స్థానిక పోలీస్ ప్రధాన కార్యాలయంలోని సమావేశ హాలులో శుక్రవారం జిల్లా ఎస్పీ తుషార్‌డూడి డిపిఓ లో విధులు నిర్వహించే పోలీస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ క్రింది స్థాయి సిబ్బంది పనితీరు మరింత



మెరుగుపడే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. నూతన సాంకేతిక విధానాన్ని అందిపుచ్చుకుంటూ గస్తీ విధులు మరింత పటిష్టం చెయ్యవలసిన అవసరం ఉందన్నారు. కేసులలో దర్యాప్తు వేగవంతంగా నిర్వహించే విధంగా చర్యలు తీసు కోవాలన్నారు. దర్యాప్తు అధికారి పోక్సో, మహిళ సంబం ధిత కేసులలో 60 రోజుల్లోపు దర్యాప్తు పూర్తిచేసి సంబంధిత కోర్టులలో అభియోగ పత్రం దాఖలు చేయాలన్నారు. కేసులు యొక్క పురోగతికి సంబంధించిన సమాచారం ఎప్పటి కప్పుడు సి.సి.టి.ఎన్.ఎస్ లో అప్లోడ్ చెయ్యాలన్నారు. కేసుల దర్యాప్తులో ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వారిని ఉపేక్షించేది లేదన్నారు. గతంలో గంజాయి సంబంధిత కేసులలో పట్టుబడిన వారిపై నిఘా ఉంచాలన్నారు. వారిని ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలన్నారు. పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని వారి వినతులకు సంబంధించిన దస్త్రాలు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పూర్తి చెయ్యాలని డిపిఓ అధికారులను ఆదేశించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది పై ఉండే మైనర్ పిఆర్‌లు, ఓఈలు సకాలంలో విచారణ జరిపి నివేదిక ఇవ్వాలన్నారు. పోలీస్, డిపిఓ అధికారులు సిబ్బంది నిబద్ధతతో విధులు నిర్వహించాలన్నారు. ఎవరైనా విధినిర్వహణలో అలసత్వంగా వ్యవహరిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్, ఏ.ఓ శ్రీనివాసరావు, ఏ.ఆర్ డిఎస్పీ విజయసారథి, డిసిఆర్బీ ఇన్స్పెక్టర్ బాల మురళీకృష్ణ, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ లు నారాయణ, విక్టర్, స్పందన సెల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, సైబర్ సెల్ ఇన్స్పెక్టర్ జయకుమార్, ఆర్.ఐ లు మోలుద్దీన్, శ్రీకాంత్, ఏ సెక్షన్ సూపరింటెండెంట్ కరీముల్లా కాలేషా వలి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు మెచ్చుకునేలా నాణ్యతతో రోడ్లు నిర్మించాలి : ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**నాదెండ్ల,ఫిబ్రవరి7,ప్రభాతవార్త:** ప్రజలు మెచ్చుకునేలా, చేసిన అభివృద్ధి గురించి పదికాలాలు చెప్పుకునేలా, ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి మంచిపేరు వచ్చేలా రోడ్ల నిర్మాణం జరగాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి అభిప్రాయపడ్డారు. శుక్రవారం ఆయన చిలకలూరిపేట-నరసరావుపేట ప్రధాన రహదారినుంచి మైనంపాడు గ్రామానికి వేస్తున్న మెటల్ రోడ్డు పనులను పరిశీలించారు. పనులకు సంబందించి కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. రోడ్డు నిర్మిణానికి రూ 60లక్షలు మంజూరు అయ్యా యని, పనులలో



ఎక్కడా నాణ్యత లోపించకూడదని, పనులులో వేగం పెంచి త్వరగా పూర్తిచేయాలని అన్నారు. నిర్ణీత వ్యవధిలోనే పనులు పూర్తిచేస్తానని సంబందింత కాంట్రాక్టర్ ప్రత్తిపాటికి వివరించారు. అనంతరం నరసరావుపేట ప్రధాన రహదారినుంచి గురుకుల పాఠశాల వరకు రూ40లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సిపిరోడ్, డ్రైనేజి నిర్మాణ పనులను కూడా ప్రత్తిపాటి పరిశీలించారు. ప్రత్తిపాటితోపాటు నియోజకవర్గ జనసేనపార్టీ ఇన్‌చార్జి తోట రాజారమేష్, నాదెండ్ల మండల టిడిపి అధ్యక్షుడు బండారుపల్లి సత్యనారాయణ, టిడిపి నాయకులు వజ్జా సింగయ్య, రామాంజనేయులు, ఇర్లపాడు గ్రామ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవవాలి

**రెంటచింతల, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:** విద్యార్థి దశ నుంచే చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని మండల లీగల్ సర్వీస్ కమిటీ ప్యానల్ న్యాయవాదులు సూచించారు. శుక్రవారం రెంటచింతలలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో మండల న్యాయ సేవాధికార సంస్థ (గురజాల) ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. సదస్సులో పాల్గొన్న సీనియర్ సివిల్ జడ్జి వై.శ్రీ నివాసరావు, జూనియర్ సవిల్ జడ్జి పరిమి అలేఖ్య మాట్లాడుతూ రాజ్యాంగంలోని హక్కులను, న్యాయ వ్యవస్థలోని చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి



ఉండాలన్నారు. ముఖ్యంగా విద్యార్థినులు చదువుతోపాటు ఫోక్సో, నిర్భయ చట్టాలపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని, ఇందుకు రెండు సంవత్సరాల జైలుశిక్షతోపాటు జరిమానా విధించడం జరుగుతుందన్నారు. బాలికలపై వేధింపులకు పాల్పడితే ఫోక్సో చట్టం ప్రకారం శిక్ష తప్పదన్నారు. ప్రతిఒక్కరూ క్రమశిక్షణతో చదివి ఉన్నతస్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వారు హాస్టల్‌లోని వసతి గతులు, మరుగుదొడ్లు, వంటగది పరిశీలించి, బాలికలకు నాణ్యమైన భోజనం అందించాలని నిర్వాహకులకు ఆదేశించారు. కార్యక్రమంలో న్యాయవాదులు శశికళ, జానీబాష, సురేష్, ప్రభుదాసు, ఎస్‌డబ్ల్యూఓ సుజాతకుమారి, బాలికల హాస్టల్ వార్డెన్ జె.అరుణ, ప్రభుత్వ బాలుర హాస్టల్ వార్డెన్ షేక్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

# పేరలి సర్పంచ్‌గా మల్లెల వెంకటేశ్వర్లు

**కర్లపాలెం,,ఫిబ్రవరి07,ప్రభాతవార్త:** కోర్టు ఉత్తర్వులతో పేరలి సర్పంచిగా మల్లెల వెంకటేశ్వర్లు కోర్టు ఉత్తర్వులతో సర్పంచ్ పదవిని కోల్పోయి మాజీ అయ్యిన మల్లెల వెంకటేశ్వర్లు శుక్రవారం హైకోర్టు ఉత్తర్వులతో కర్లపాలెం పేరలి గ్రామ సర్పంచ్ గా ప్రమాణ స్వీకారం చేశారు, గత నెల నాలుగో తేదీన ఓటర్ లిస్టులో ప్రభుత్వ గుర్తింపు కార్డులలో మల్లెల వెంకటేశ్వర్లు పేరు వేరువేరుగా ఉన్నాయని ఆయన మీద పోటీ చేసి ఓడిపోయిన వీరయ్య గతంలో కోర్టును ఆశ్రయించటంజరిగింది. దీనిని పరిశీలించిన కోర్టు మల్లెల వెంకటేశ్వర్లు ఎన్నిక చెల్లదని వీరయ్యను సర్పంచ్ గా ప్రకటించాలని జిల్లా కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. నాలుగో తేదీన పేరలి గ్రామ సర్పంచిగా గొర్రె ముచ్చు వీరయ్య ప్రమాణ స్వీకారం చేశారు.ఈ ఉత్తర్వులపై బాపట్ల వైసిపి సమన్వయకర్త మాజీ డిప్యూటీ స్పీకర్ కోణా



రఘుపతి మల్లెల వెంకటేశ్వర్లు తో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయించారు, తన పేర్లు వ్యత్యాసం ఉంటే అధికారులు నామినేషన్ ఎలా స్వీకరించారని అప్పుడే తిరస్కరించాల్సిందని తనకు జరిగిన అన్యాయాన్ని కోర్టు పరిశీలించి క్రింది కోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై స్టే విధించాలని హైకోర్టును మల్లెల వెంకటేశ్వర్లు అభ్యర్థించారు, ఆయన అభ్యర్థులను పరిశీలించిన హైకోర్టు జనవరి 10వ తేదీన మల్లెల వెంకటేశ్వర్లు గ్రామ సర్పంచిగా కొనసాగించాలని క్రింది కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను పై స్టే విధించింది, దీంతో ఆ ఉత్తర్వులు జిల్లా అధికారులకు చేరి అవి తిరిగి కర్లపాలెం మండలానికి చేరేసరికి దాదాపుగా నెల అయింది అనంతరం శుక్రవారం పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు మల్లెల వెంకటేశ్వర్లు తో గ్రామ సర్పంచ్ గా ప్రమాణ స్వీకారం చేయించారు ఈ సందర్భంగా మల్లెల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తన పదవి కోసం కోర్టులో పోరాడిన వైసీపీ సమన్వయకర్త కోన రఘుపతి కి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు.

# చిలకలూరిపేట ఛాంబర ఆఫ్ కామర్స్‌కు నూతన కార్యవర్గం ఎన్నిక

**చిలకలూరిపేటరూరల్,ఫిబ్రవరి7,ప్రభాతవార్త:** చిలకలూరిపేట ఛాంబర్ ఆఫ్ కామర్స్‌కు శుక్రవారం పట్టణంలోని వాసవీ జ్ఞానమందిరంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షులుగా కొత్తమాసు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా ఆరెకట్ల



కోటేశ్వరరావు, కోశాధికారిగా కొప్పురాపూరి రాధాకృష్ణ, అదనపు ప్రధాన కార్యదర్శిగా కొంజేటి వెంకటరత్నంను ఎన్నుకున్నారు. మిగితా కార్యవర్గాన్ని కూడా ఏర్పాటు చేసి త్వరలో ప్రమాణస్వీకార కార్యక్రమం నిర్వహిస్తామని ఛాంబర్ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు వెల్లంపల్లి రవిశంకర్, గుర్రం సాంబశివరావు, చేవూరి కృష్ణమూర్తి, కనమర్లపూడి రమేష్,కొత్త కోటేశ్వరరావు, తవ్వా నాగమల్లేశ్వరారవు, యం గోపాల్, పట్టణానికి చెందిన పలు వ్యాపార సంస్దల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న చిన్నారుల కూచిపూడి నృత్యం

**నరసరావుపేట, ఫిబ్రవరి7 ప్రభాతవార్త :** పట్టణంలోని కూచిపూడి నాట్యనిలయం విద్యార్థులు అద్భుతమైన ప్రదర్శన చేశారు. శ్రీశైలం దేవస్థానం ఆహ్వానం మేరకు కళావేదిక నందు కూచిపూడి నృత్య ప్రదర్శన చేశారు. శిక్షకురాలు ఓంకారేశ్వరి, దేవస్థాన ప్రజా సంబంధాల అధికారి శివారెడ్డి చిన్నారులను అభినందించారు. చక్కని నృత్యం చేసిన చిన్నారులు



ఎంతో ప్రతిభ చూపారన్నారు. సాంప్రదాయ కూచిపూడి నృత్యం నేర్చుకోవడం వలన పిల్లల్లో మంచి క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, మానసిక ఒత్తిడిని దూరం చేసుకునే శక్తి వస్తుందన్నారు. వేదాంతం రాదేష్‌శ్యామ్ వద్ద కూచిపూడి నృత్యం అభ్యసించి గత 20 సంవత్సరాలుగా శిక్షణ ఇస్తున్నట్లు ఓంకారేశ్వరి తెలియజేశారు.

# అధికారుల నిర్లక్ష్యంతోనే రోడ్డు ప్రమాదం

**నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త :** అధికారుల నిర్లక్ష్యంతోనే రోడ్డు ప్రమాదం జరిగిందని ప్రజా సంఘాల నాయకులు ఆరోపించారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను నాయకులు పరామర్శించారు. గోదా జాన్‌పాల్ మాట్లాడుతూ కనపర్తి బావి వద్ద మిరపకాయలు కోసేందుకు వెళ్తున్న 18 మంది పేద కూలీల ఆటోను లారీ ఢీకొని పలువురు గాయపడటంతో పాటు



ఒకరు చనిపోయారని తెలిపారు. ఉపాధిహామీ పథకం నీరుగారిపోవడం వలన పేదలకు ప్రమాదకరమైన వాహనాలలో ప్రయాణించి కూలీ పనులకు వెళ్ళే పరిస్థితి నెలకొందన్నారు. అధికారులు నిర్లక్ష్యం వీడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జాన్‌పాల్‌తో పాటు జయరావు, ప్రకాష్ తదితరులు ఉన్నారు.

# దేచవరంలో రీ పోస్టుమార్టం

**నకరికల్లు, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త :** మండలంలోని దేచవరం గ్రామంలో శుక్రవారం 2024 జనవరి 1న కనుమూసిన పెద్దిరెడ్డి కోటిరెడ్డి మృతదేహానికి రెవిన్యూ, పోలీస్ అధికారులు రీపోస్ట్‌మార్టం నిర్వహించారు. మృతుని మనుమరాలు జనపాల శైలజా జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావుకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రీపోస్ట్‌మార్టం నిర్వహిస్తున్నట్లు ఎస్.ఐ. సురేష్



తెలిపారు. తమ తాతయ్యను ఆస్థి కోసం బంధువులే హత్య చేశారని తన ఫిర్యాదులో శైలజా తెలిపారు. ఆరుబయట నిద్రిస్తున్న కోటిరెడ్డిని హత్య చేశారని శైలజా తన ఫిర్యాదులో ఆరోపించారు. పోస్ట్‌మార్టం రిపోర్ట్ ద్వారా వాస్తవాలు బయటకు వస్తాయనే నమ్మకాన్ని ఫిర్యాదు చేసిన శైలజా వ్యక్తం చేశారు.

# మీ మనసు చెప్పింది వినండి

## -హీరో, డైరెక్టర్, విశ్వక్ సేన్

**పొన్నూరు, ఫిబ్రవరి 7,ప్రభాతవార్త:** విద్యార్థులందరూ మీ మనసు చెప్పింది మాత్రమే వినండని హీరో, డైరెక్టర్, స్క్రీన్ రైటర్ విశ్వక్ సేన్ అన్నారు చేబ్రోలు మండలం, వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో జరుగుతున్న జాతీయస్థాయి విజ్ఞాన్స్ మహోత్సవ్-2కె25లో భాగంగా రెండో రోజు లైలా సినిఆ యూనిట్ సందడి చేసింది. సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా హీరో విశ్వక్ సేన్ విజ్ఞాన్స్



మహోత్సవ్‌కు విచ్చేసి స్టెప్పులతో అలరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సినిమా హీరో విశ్వక్ సేన్ మాట్లాడుతూ ఈ నెల 14న సినిమా ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుందన్నారు. విద్యార్థులందరూ లైలా సినిమాను ఆదరించి అఖండ విజయాన్ని అందించాలని కోరారు. ఈ చిత్రాన్ని అర్చన సమర్పణలో షైన్ స్క్రీన్స్ ఎంటర్‌టైన్‌మెంట్‌లో సాహు గారపాటి నిర్మించారని తెలిపారు. ఈ చిత్రాన్ని కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కించామన్నారు. ఈ సినిమాలో యాక్షన్ ఎపిసోడ్స్, ఎమోషన్స్, డ్రామా ప్రేక్షకులందరికీ నచ్చుతాయన్నారు. ఈ సినిమా తన మనసుకు బాగా దగ్గరైన సినిమా అని తెలిపారు. ఈ సినిమాలో తన పాత్ర ఇప్పటి వరకు చేసిన పాత్రల కంటే వైవిధ్యభరితమైందన్నారు. మొట్టమొదటి సారిగా లైలా అనే అమ్మాయి పాత్రధారణలో నటించానని పేర్కొన్నారు. ఈ సినిమాకి రామ్ నారాయణ్ దర్శకత్వం వహించగా, మ్యూజిక్ డైరెక్టర్గఆ లియోన్ జేమ్స్, సినిమాటోగ్రఫీ రిచర్డ్ ప్రసాద్, ఎడిటర్‌గా సాగర్, రైటర్‌గా వాసుదేవమూర్తి పనిచేశారన్నారు. అనంతరం లైలా సినిమా యూనిట్ విద్యార్థులతో సెల్ఫీలు దిగారు.

# జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యం

### తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు

**పెదకాకాని,ఫిబ్రవరి7,ప్రభాతవార్త:** తెలుగు జర్నలిస్టుల సంక్షేమమే ప్రధాన లక్ష్యంఅని తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘంవ్యవస్థాపకులు,రాష్ట్ర అధ్యక్షులు మేడవరపు రంగనాయకులు అన్నారు.తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం తృతీయవార్షికోత్సవ సందర్భంగా విజయవాడలో రాష్ట్రస్థాయి సర్వసభ్య సమావేశం ఘనంగా జరిగింది.ఈసమావేశానికి రాష్ట్రనలుమూలల నుంచి జర్నలిస్టులుతరలి వచ్చారు.ఈసందర్భంగా నూతన రాష్ట్రకార్యవర్గం ప్రమాణ స్వీకారం చేశారు.ఈసభకు సీతారామరాజు సభాధ్యక్షత వహించారు.ఈకార్యక్రమాన్ని ఉద్దేశించి మేడవరపు రంగనాయకులు మాట్లాడుతూ ఐక్యత,సంక్షేమం,భరోసా నినాదాలతో ఏర్పాటైన తెలుగుజర్నలిస్టుల సంక్షేమ సంఘం జర్నలిస్టుల సంక్షేమానికి అభివృద్ధికోసం,కృషి చేస్తుందన్నారు.ఉత్తమ జర్నలిస్టులను గుర్తించి వారిని గౌరవించి అభినందించడంబాధ్యతగా పేర్కొన్నారు.త్వరలోనే ఉత్తమ తెలుగు జర్నలిస్టులకు ఉగాది పురస్కారాలు కార్యక్రమం నిర్వహించబోతున్నట్లు తెలిపారు.ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ మిడియా అకాడమీపూర్వపుకార్యదర్శి తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు మామిడిపల్లి బాలగంగాధర్ తిలక్ రాష్ట్రకమిటీని ప్రకటించి వారిచే ప్రమాణస్వీకారం చేయించారు.రాష్ట్ర అధ్యక్షులుగా మేడవరపు రంగనాయకులు,రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా బోడపాటి సుబ్బారావు,కోశాధికారిగా చెపుల శ్రీనివాసరావు,ఉపాధ్యక్షులుగా కోయారామారావు,వంగపాటి శివ,ఎం.విజయభాస్కర్,నాగశెట్టి సీతారామరాజు,జాయింట్ సెక్రటరీగాబి.శీనునాయిక్,వర్కింగ్ ప్రెసిడెంట్ గా గోగులమూడి విజయకుమార్, గౌరవ సలహదారులుగా రాజుపాలెం కోటేశ్వరరావు,న్యాయసలమదారులుగా అదుపుశ్రీమాన్,ప్రసన్న కుమార్,శ్రీనివాసులుగా ప్రమాణంశ్రీకారం చేశారు.ఈసందర్భంగా నూతన రాష్ట్రకమిటికి బాలగంగాధర్ తిలక్ శుభాకాంక్షలు తెలియజేశారు. తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించి జర్నలిస్టులకుమంచి చేయాలని అభిలషించారు.

# ఇసుక రీచ్‌లను పరిశీలించిన మైనింగ్ అధికారులు

**కొల్లిపర,పిబ్రవరి 7 ప్రభాతవార్త:** మండలంలో ప్రభుత్వం అనుమతులు ఇచ్చిన ఇసుక రీచ్‌లు గడువు ముగియటంతో గురువారం సాయంత్రం 6 గంటలకు మూతపడ్డాయి.దీంతో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశాల మేరకు మున్నంగి ,పిడపర్తిపాలెం,బొమ్మువానిపాలెం ఇసుకరీచ్‌లలో డంపింగ్ చేసిన ఇసుక నిల్వలను మైనింగ్ సర్వేయర్లు నిమ్మబాయ్,టెక్నికల్ అసిస్టెంట్ కావ్య,జానియర్ అసిస్టెంటు సల్మాన్,మండల సర్వేయర్ శ్రీనివాసరావు,విలేజ్ సర్వేయర్లు వెహవాన్ సాయి, శ్రీనివాన రావు, విఆర్ ఓలు రామారావు పరిశీలించారు.తహశీల్దార్ సిద్ధార్ధ ఆదేశాల మేరకు డంపింగ్ చేసిన నిల్వలను



సంభందిత విఆర్‌ఓలకు అప్పగించినట్లు మైనింగ్ అధికారులు తెలియజేసారు.

# నేటి నుండి శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి వార్షిక బ్రహోత్సవాలు

**తెనాలి, ఫిబ్రవరి 7 (ప్రభాతవార్త) :** దక్షిణా పథంలో నాలుగు ధ్వజస్తంబాలతో ప్రాధాన్యతను సంతరించుకున్న శ్రీ సువర్చల సమేత శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి వారి వార్షిక బ్రహోత్సవాలు వైఖానస ఆగమ రీతిలో విశేషంగా నిర్వహించనున్నారు. 8వ తేది నుండి 14వ తేది వరకు నిర్వహించే వార్షిక బ్రహోత్సవాలలో శనివారం శ్రీ స్వామి వారిని పెండ్లి కుమారునిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో అవుతు శ్రీనివాసరెడ్డి మీడియాకు తెలిపారు. 9వ తేదిన ఉదయం 9గంటలకు శ్రీ సీతారాముల కళ్యాణం, రాత్రి 7గంటలకు తిరుచ్చి వాహన సేవ, పదవ తేది ఉదయం 9గంటలకు శ్రీ సూర్యప్రభ వాహన సేవ,



రాత్రి 7గంటలకు శ్రీ చంద్రప్రభ వాహన సేవ, 11వ తేది మంగళవారం ఉదయం 9గంటలకు శ్రీమైనాక వాహన సేవ, సాయంత్రం 6గంటలకు గజవాహన సేవ, రాత్రి 8గంటలకు శ్రీ సువర్చల హనుమత్ కళ్యాణం, 12వ తేది బుధవారం ఉదయం 6గంటలకు శ్రీ ఉష్ట్ర వాహన సేవ, అనంతరం మధ్యాహ్నం మూడు గంటల నుంచి శ్రీవారి రథోత్సవం, 13వ తేది గురువారం ఉదయం 9గంటలకు శ్రీచక్ర స్నానము, పూర్ణాహుతి సాయంత్రం 6గంటలకు ధ్వజ ఆరోహణ ద్వాదశ ప్రదక్షిణలు, 14వ తేది శుక్రవారం పుష్ప ఉత్సవం కార్యక్రమాలతో స్వామివారి వార్షిక బ్రహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆలయ వంశపారంపర్య అర్చకులు ఆర్.శ్రీనివాసమూర్తి, వ్యవస్థాపక కుటుంబ సభ్యులు ఎస్బి శివ, ఆర్.వి .కిరణ్‌కుమార్, సురేష్, మూర్తి, వెంకటేశ్వరరావు, శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి సంకర్తీన బృందం సభ్యుల పర్యవేక్షణలో కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

**నకరికల్లు, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త :** మండలంలో శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ అనుముల మస్తాన్ (50) ఉదయం రవి మెడికల్ స్టోర్ వద్ద నిలిచి ఉన్నారు. ఈ సమయంలో పాత కంప్యూటర్ల లోడుతో తిరుపతి నుండి హైదరాబాద్ వెళ్తున్న లారీ ఆగివున్న ట్రాక్టర్‌ను ఢీ కొంది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌పై ఉన్న మస్తాన్ అక్కడికక్కడే మృతిచెందారు. అదే విధంగా లోడు ఓనర్ ఎం.మల్లిక్ కుడి కుడి కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. మస్తాన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. నకరికల్లు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# చీటింగ్ కేసులో హోల్‌సేల్ మెడికల్ వ్యాపారి రాంబాబు లొంగుబాటు

**నరసరావుపేట క్రైం, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త :** చీటింగ్ కేసులో హోల్‌సేల్ మెడికల్ వ్యాపారి రాంబాబు శుక్రవారం కోర్టులో లొంగిపోయారు. సుమారు రూ.కోటి 91 లక్షల మేరకు చీటింగ్ చేసినట్లు నమోదైన కేసులో చందోలు వెంకట నరసింహారావు అలియాస్ రాంబాబు స్థానిక మొదటి అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి కోర్టులో స్వచ్ఛందంగా లొంగిపోయారు. పాతూరుకు చెందిన సాంబశివశాస్త్రీ అర్చకత్వం చేసుకొని జీవనం సాగిస్తున్నారు. ఆయనకు పరిచయమైన రాంబాబు మెడికల్ వ్యాపారం నిర్వహిస్తున్నానని, వాటా కలవాలని రూ.41 లక్షలను 2021 జనవరి 18న తీసుకున్నారు. మేనేజింగ్ పార్టనర్‌గా డీడ్ రాశారు. అయితే తనకు తెలియకుండా బ్యాంక్ రుణం తీసుకొని తన ఇంటిపై రూ.కోటిన్నర రుణం పొందారన్నారు. అయితే తనను పార్టనర్‌గా తొలగించినట్లు తర్వాత తెలిసిందన్నారు. తనచేత పెట్టుబడి పెట్టింటి, ఇంటిని తాకట్టుపెట్టి రూ.కోటి 91 లక్షలు రాంబాబు మోసం చేశాడని రెండవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో గత ఏడాది జూలై 10న ఫిర్యాదు చేశారు. ఈ కేసులో రాంబాబు లొంగిపోగా న్యాయాధికారి ఆర్.ఆశీర్వాదంపాల్ నిందితునికి రిమాండ్ విధించారు.

# విధులను అంకిత భావంతో నిర్వహించిన వ్యక్తి హనుమంతులక్ష్మణరావు

**బాపట్ల,ఫిబ్రవరి07,ప్రభాతవార్త:** విదులను అంకిత బావంతో నిర్వహించి పలువురి మన్నలను పొందిన వ్యక్తి హనుమంతులక్ష్మణరావు అని బాపట్ల జిల్లా రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం సభ్యులు కొనియాడారు. బాపట్లలో ఘనంగా పెన్షనర్స్ డేకార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా జ్యుడీషియల్ డిపార్ట్మెంట్ రిటైర్డ్ ఉద్యోగి హనుమంతు లక్ష్మణరావు దంపతులను బాపట్ల జిల్లా రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.బాపట్ల జిల్లా రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం సభ్యులు మాట్లాడుతూ దశాబ్దాల కాలం పాటు పీఎస్ గా విశిష్టమైన సేవలందించి పదవీ విరమణ పొందిన జ్యుడీషియల్ డిపార్ట్మెంట్ ఉద్యోగి హనుమంతు లక్ష్మణరావు అని కొనియాడారు.హనుమంతు



లక్ష్మణరావు విధి నిర్వహణలో భాగంగా శాఖపరంగా ఏ బాధ్యత అప్పగించిన సమర్థవంతంగా పనిచేసే అధికారిగా మంచి పేరు పొందారని పలువురు వక్తలు కొనియాడారు..సన్మాన గ్రహిత మాట్లాడుతూ సన్మానం పొందినందుకు ఆనందంగా ఉందని ఈ సందర్భంగా బాపట్ల జిల్లా రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్ల సంఘానికి సన్మాన గ్రహీత హనుమంతు లక్ష్మణరావు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం సభ్యులు ,తదితరులు పాల్గొన్నారు.

# తెదేపా కార్యకర్త మాలె చిన్నా భౌతికకాయానికి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**నాదెండ్ల,ఫిబ్రవరి7,ప్రభాతవార్త:** మండలంలోని మైనంపాడు గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త మాలె చిన్నా శుక్రవారం మరణించారు. విషయం తెలుసుకున్న మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు మైనంపాడు గ్రామానికి వెళ్లి చిన్నా భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. ప్రత్తిపాటితోపాటు జనసేన నియోజకవర్గ కన్వీనర్ తోట రాజారమేష్,టిడిపి నాయకుడు షేక్ కరిముల్లా, బండారుపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు



# ఆలపాటి నామినేషన్‌కు భారీగా తరలి వెళ్ళిన కొల్లిపర తెదేపా నాయకులు

**కొల్లిపర,పిబ్రవరి 7 ప్రభాతవార్త:** గుంటూరు,కృష్ణాజిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ శుక్రవారం ఉదయం 11 గంటలకు గుంటూరు కలెక్టరేట్ కార్యాలయంలో నామినేషన్ వేయటంతో కొల్లిపర మండలం నుండి టీడీపీ నాయకులు అధిక సంఖ్యలో తరలి వెళ్ళారు.ఈ సందర్భంగా దుగ్గిరాల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వంగా సాంబిరెడ్డి మాట్లాడుతూ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.కార్యక్రమంలో టీడీడీ మండల అద్యక్షుడు భీమవరపు చిన కోటిరెడ్డి,టీడీపీ జిల్లా కార్యదర్శి కంచర్ల అమృతరాజు,నాయకులు గుదిబండి గోవర్ధనరెడ్డి,ఆరిమండ రాధాకృష్ణారెడ్డి,ఆరిమండ శివనాగమల్లీశ్వరరెడ్డి,చాగంటి నారాయణరెడ్డి, ఆరిమండ వెంకటరెడ్డి,షేక్ రఫీ,వల్లభాపురపు బసవయ్య,విస్సారపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



# సత్తెనపల్లి, రాజుపాలెం పట్టభద్రులతో ఎమ్మెల్యే కన్నా సమావేశం

**సత్తెనపల్లి, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త :** పట్టణంలోని రఘురాంనగర్‌లో గల తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో శుక్రవారం కృష్ణా - గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి సత్తెనపల్లి, రాజుపాలెం మండల పట్టభద్రులతో ఆత్మీయ సమావేశాన్ని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ శుక్రవారం నిర్వహించారు. నియోజకవర్గ పరిశీలకులు, వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్, జయప్రకాష్‌నారాయణ, మన్నెం శివ నాగమల్లేశ్వరరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనీసం రోజుకు 30-40 మంది ఓటర్లను కలిసి సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. అత్యధిక ఓట్ల మెజార్టీని తీసుకురావాలన్నారు.



విద్యావంతులకు గత ప్రభుత్వం ఉద్యోగాలు లేకుండా చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఎనిమిది నెలల్లోనే అభివృద్ధి దిశగా అడుగులు వేస్తుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాలలో ఉన్న పట్టణ, మండల నాయకులు పాల్గొన్నారు.

## వ్యవసాయ అనుబంధ రంగాల వ్యాపారులు ఎడ్ల పరిరక్షణకు ముందుకు రావాలి : ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**నాదెండ్ల,ఫిబ్రవరి7,ప్రభాతవార్త:** మన సంస్కృతిలో బాగమైన ఎడ్లపందేల నిర్వహణపై గతంలో కొందరు స్వార్ధంతో కోర్టులో ఫిటీషన్లు వేసారని మాజీమంత్రి, శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. తాను వ్యవసాయశాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి కోర్టు పరిధిలోని అడ్డంకులను తొలగించి రాష్ట్ర వ్యాప్తంగా ఎడ్లపందేలు జరిగేలా చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. గురువారం రాత్రి మండలంలోని నాదెండ్ల వద్ద జరుగుతున్న ఒంగోలు జాతి ఎడ్ల జాతీయస్థాయి బండలాగుడు పోటీల ముగింపు శిబిరంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు.అంతరించిపోతున్న ఒంగోలు గిత్తలను కాపాడే బాధ్యత తీసుకున్న రైతులు,ఎడ్ల యజమానులను మనస్ఫూర్తిగా అభినందించాల్సిందేనని ప్రత్తిపాటి తెలిపారు. ఆర్ధికంగా స్థిరపడిన రైతులతోపాటు, వ్యవసాయ అనుబంధ పరిశ్రమల వ్యాపారవేత్తలు కూడా ఎడ్లపెంపకంపై దృష్టి సారించి, మన రాష్ట్రానికే గర్వకారణమైన ఒంగోలు జాతిని పరిరక్షించాలని ప్రత్తిపాటి పిలుపునిచ్చారు. ఎడ్లపందేలు చూడటం వలన రైతులకు లభించే ఆనందరం వెలకట్టలేనిదని అన్నారు. కూటమి ప్రభుత్వంలో చంద్రబాబు నాయకత్వంలో ఇటువంటి పోటీలను మరింతగా ప్రోత్సహిస్తామని ప్రత్తిపాటి స్పష్టం చేశారు. ఈ పందేలను ఎంతో ఘనంగా నిర్వహించిన నందికుంట ఆలయకమిటి సభ్యులను ప్రత్తిపాటి అభినందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నెల్లూరి సదాశివరావు, జవ్వాజి మదన్‌మోహన్, అడుసుమల్లి మోహనరావు, కోటేశ్వరరావు, కమిటి సభ్యులు పాల్గొన్నా

## ఆలపాటి నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న మాచర్ల ఎమ్మెల్యే

మాచర్ల, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త: కృష్ణా, గుంటూరు జిల్లాల శాసనమండలి అభ్యర్థిగా మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ శుక్రవారం గుంటూరు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు. నామినేషన్ కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే జూలకంటి మాట్లాడుతూ క్రమశిక్షణ, నిబద్ధత కలిగిన వ్యక్తి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అని అన్నారు. అధినేత ఆదేశాల మేరకు తన శాసనసభ స్థానాన్ని త్యాగం చేసి నేడు ఉమ్మడి కృష్ణా, గఉంటూరు జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి కూటమి అభ్యర్థిగా నామినేషన్ వేశారన్నారు. ఆలపాటికి మాచర్ల నియోజక వర్గం నుంచి అత్యధిక మెజార్టీ అందించడంలో తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల కూటమి ఎంపీలు, ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. నామినేషన్ అనంతరం రాజేంద్రప్రసాద్‌కు అభినందనలు తెలిపారు.

## సబ్ డివిజన్ పరిధిలో పట్టభద్రులైన ఓటర్ల సంఖ్య 45,707 : సబ్ కలెక్టరు సంజనాసింహ

**తెనాలి, ఫిబ్రవరి 7 (ప్రభాతవార్త) :** కృష్ణ, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమెమల్సీ పదవీకాలం మార్చి 29తో గడువు ముగుస్తున్నందున ఫిబ్రవరి 3న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అయ్యిందని, మార్చి 8వ తేదితో ఎన్నికల ప్రక్రియ అధికారికంగా ముగుస్తుందని సబ్ కలెక్టర్ సంజనాసింహ పేర్కొన్నారు. శుక్రవారం తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సబ్ కలెక్టర్ సంజనాసింహ కృష్ణ, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నియమ నిబంధనలను క్షుణ్ణంగా వివరించారు. ఈనెల 10వ తేదితో నామినేషన్ దాఖలు ప్రక్రియ ముగుస్తుందని, ఈనెల 27వ తేదిన పోలింగ్ ప్రక్రియ ఉదయం 8గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు కొనసాగు



తుందని తెలిపారు. తెనాలి సబ్ డివిజన్లో 45,707పట్టభద్రులైన ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. వీరిలో తెనాలి నియోజకవర్గంలో 23,273మంది ఓటర్లు ఉన్నారని వివరించారు. పోలింగ్ కేంద్రాల వివరాలను వెల్లడిస్తూ తెనాలి రూరల్, అర్బన్, కొల్లిపర మండలంతో కలుపుకొని 27 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు తెలిపారు. తెనాలి సబ్ డివిజన్లో 24 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, ఓటర్ల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని మరో ఎనిమిది పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, ఓటర్ల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని మరో ఎనిమిది పోలింగ్ కేంద్రాలు అవసరాన్ని ఎన్నికల కమీషన్‌కు తెలియజేసినట్లు తెలిపారు. అనుమతులు లభించిన తరువాత మొత్తం 59 పోలింగ్ కేంద్రాలు ఉంటాయన్నారు. 27న పోలింగ్, మార్చి 3న కౌంటింగ్ ప్రక్రియ ఉంటాయన్నారు. మార్చి 8వ తేదిలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ పూర్తమవుతుందన్నారు. ఉభయ, కృష్ణ, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశాల మేరకు ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు వీలుగా పటిష్టమైన ఏర్పాట్లు చేయనున్నట్లు సబ్ కలెక్టర్ సంజనా సింహ తెలిపారు.

## వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా సమ్మర్ యాక్షన్ ప్లాన్‌ని సిద్ధం చేయాలి : కమిషనరు

**గుంటూరు, కార్పోరేషన్ ఫిబ్రవరి 7 ప్రభాతవార్త :** నగరపాలక సంస్థ పరిధిలో వార్డు సచివాలయాల వారీగా రానున్న వేసవిలో త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా సమ్మర్ యాక్షన్ ప్లాన్ ని సోమవారానికి సిద్ధం చేయాలని ఏఈల వారీగా సమగ్ర నివేదిక అందించాలని, నివేదిక మేరకు క్షేత్రస్థాయి పరిశీలన చేసి, నగరంలో వేసవిలో త్రాగునీటి ఎద్దడి లేకుండా సమగ్ర యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలన్నారు. డిఈఈల వారీగా ఏఈలు, ఎమినిటి



నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సమ్మర్ యాక్షన్ ప్లాన్‌పై ఇంజనీరింగ్ అధికారులతో కమిషనర్ చాంబర్‌లో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వార్డు సచివాలయాల వారీగా నివాసాలు, కమర్షియల్ సంస్థలు, బావులు, బోర్లు, ప్రస్తుతం ఇస్తున్న సరఫరా, వేసవిని దృష్టిలో పెట్టుకొని ఇవ్వాల్సిన సరఫరా వంటి వివరాలతో సోమవారం నాటికి ఆర్యదర్శులతో ప్రత్యేకంగా సమావేశాలు ఏర్పాటు చేసుకొని, వాస్తవ అవసరాలకు తగిన విధంగా అంచనాలు సిద్ధం చేయాలని కమిషనర్ శ్రీనివాసులు ఆదేశించారు. సమావేశంలో ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, ఈఈలు సుందర్‌రామిరెడ్డి, కోటేశ్వరరావు, డిఈఈలు నాగభూషణం, కళ్యాణరావు, మధుసూదన్, రమేష్‌బాబు, సతీష్ కుమార్, శ్రీనివాస్, ఇంజనీరింగ్ సెక్షన్ సూపరింటెండెంట్ రాజశేఖర్, ఏఈలు పాల్గొన్నారు.

## దినసరి ఉద్యోగుల సంక్షేమానికి కృషి


**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,ఫిబ్రవరి 7,ప్రభాతవార్త :** వర్సిటీలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల సంక్షేమానికి వికాస కార్యవర్గం కృషిచేస్తుందని అధ్యక్ష,కార్యదర్శులు ఎన్.ప్రసాద్, జె.శ్రీనివాసరావులు పేర్కొన్నారు.వర్సిటీలో శుక్రవారం దినసరి వేతన ఉద్యోగుల సర్వసభ్య సమావేశం జరిగింది.ఈ సమావేశంలో అసోసియేషన్ నాయకులు,ఉద్యోగులు వారికి సంబంధించిన భవిష్యత్తు కార్యచరణపై చర్చించుకొని కొన్ని నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వికాస అధ్యక్ష,కార్యదర్శులు మాట్లాడుతూ ఉద్యోగులకు కావలసిన సదుపాయాలను సమకూర్చేందుకు తమ వంతు



సహాయం చేస్తామన్నారు.కార్యక్రమానికి దినసరి వేతన ఉద్యోగ సంఘం అధ్యక్షుడు ఎంవిఎస్ ప్రభాకర్,కార్యదర్శి నీలకంఠేశ్వరరావు,ఉపాధ్యక్షుడు బి.రత్తయ్య,శాంతిశ్రీ,రమేష్, రామకృష్ణ, వెంకటకృష్ణ,రాజ్‌కుమార్,నరేష్,శ్రీనివాసరావు,నిజాముద్దీన్,ఢిల్లీశ్వరరావు,సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర భంగా అసోసియేషన్ ఉదో ్యగిగా ఉండి జాతీయ,అంతర్జాతీయ ఫోటోగ్రాఫర్‌గా అవార్డులు అందుకున్న జి.సునీల్ కుమార్‌ను సన్మానించారు.

## దేవాలయ నిర్మాణానికి రూ.1లక్ష విరాళం

**తిరువూరు, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త :** తిరువూరు జగన్నాదపురం కాలనీలో ఎంతో ప్రతిష్టాత్మకంగా శరవేగంగా ముస్తాబవుతున్న ఆంజనేయస్వామి దేవాలయ నిర్మాణానికి ప్రముఖ వ్యాపారవేత్త బత్తుల ఆంజనేయులు రూ.1లక్ష విరాళం దేవాలయ ట్రస్ట్ సభ్యులు కొల్లిపర సుబ్బారావు, ఇన్‌చార్జ్ నర్సింగ్ లక్ష్మణలకు అందచేశారు.



## ఫ్రైడే డ్రైడేతో ప్రజలకు అవగాహన

**విజయవాడ కార్పొరేషన్,ఫిబ్రవరి 7,ప్రభాతవార్త:** ఇళ్ళల్లో ఉన్న నీటి నిల్వలను శుభ్రం చేస్తూ ప్రతి ఫ్రైడే డ్రై డేగా నిర్వహించాలని, వారికి అవగాహన కల్పిస్తూ దోమలు పెరగకుండా యాంటీ లార్వా ఆపరేషన్లను శుక్రవారం మున్సిపల్ కమీషనర్ ఆదేశాల మేరకు నిర్వహించారు. దోమల వల్ల కలిగే వ్యాధుల నుండి నివారణ కోసం ఫ్రైడే డ్రైడే నిర్వహణలో ప్రజలకు అవగాహన కల్పించాలని మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం పాయకాపురం,రాజీవ్‌నగర్ ప్రాంతాల్లో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజలు దోమల బారిన పడకుండా ఉండేందుకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబూ శ్రీనివాస్,ఏఎన్ఎంలు,ఆశ వర్కర్స్,మలేరియా వర్కర్లు పాల్గొన్నారు.




## ఎమ్మెల్సీ నామినేషన్‌కు హాజరైన ఎమ్మెల్యే కన్నా

**సత్తెనపల్లి, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త :** ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ నామినేషన్ కార్యక్రమానికి శుక్రవారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ హాజరయ్యారు. గుంటూరులో జరిగిన నామినేషన్ కార్యక్రమంలో పాల్గొని రాజేంద్రప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ హయాంలో జరుగుతున్న అభివృద్ధి ఎమ్మెల్సీగా రాజేంద్రప్రసాద్‌ను గెలిపిస్తుందన్నారు. పట్టభద్రులు ఆయనను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పట్టభద్రులు తప్పనిసరిగా అభివృద్ధికి ఓటు వేయాలన్నారు. కూటమి నాయకులు ఆయన విజయానికి కృషి చేయాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు.

## హిందూ ఫార్మసీలో ఘనంగా ఫ్రెషర్స్‌డే వేడుకలు

**గుంటూరు విద్య,ఫిబ్రవరి 7,ప్రభాతవార్త :** స్థానిక అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాల్లో శుక్రవారం డి.ఫార్మసీ,డి.ఫార్మసీ,ఫార్మా డి. కోర్సు లోమొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు ఫ్రెషర్స్ డే వేడుకల ఘనంగా జరిపారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం తెలియజేశారు.ఈ సందర్భంగా



కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు,కార్యదర్శి డాక్టర్ ఎస్.మధుసూదననావు విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం మాట్లాడుతూ తమ కళాశాల్లో చేరిన విద్యార్థులకు,తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలియజేశారు.కార్యక్రమంలో డాక్టర్ వి.వాసు నాయక్,డాక్టర్ పి.జవహర్ బాబు,సిహెచ్ ప్రసాదరావు తదితర అధ్యాపకులు,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## డ్రైవర్లందరూ కంటి పరీక్షలు చేయించుకోవాలి : ఎంవీఐ శేషిరెడ్డి



**మాచర్ల, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:** మాచర్ల పరిధిలోని డ్రైవర్లందరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని ఎంవీఐ శేషిరెడ్డి శుక్రవారం అన్నారు. పట్టణంలోని కేసీపీ వీఎల్ దత్తు ఆడిటోరియంలో అన్ని ప్రైవేటు పాఠశాలల బస్సు డ్రైవర్లు, ఆటో డ్రైవర్లు, లారీ డ్రైవర్లకు అవగాహన సదస్సు, కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు మోటారు వాహన ఇన్‌స్పెక్టర్ శేషిరెడ్డి తెలిపారు. మాచర్ల ఆర్టీవో ఆధ్వర్యంలో ఫిబ్రవరి 11వ తేదీన ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి డ్రైవర్లందరూ హాజరుకావాలని ఆయన సూచించారు.

## సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలు ప్రభుత్వం నిర్వహించాలి

### -బంజారాల రాష్ట్ర కార్యదర్శి బీమానాయక్

**మాచర్ల, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:** బంజారాల ఆరాధ్యదైవం సద్గురు సేవాలాల్ మహరాజ్ 286వ జయంతి వేడుకలు ప్రభుత్వం నిర్వహించాలని బంజారాల రాష్ట్ర కార్యదర్శి రమావత్ బీమానాయక్ అన్నారు. ఫిబ్రవరి 15న జయంతి సందర్భంగా ప్రభుత్వం సెలవు ప్రకటించాలని కోరారు. ఈ సందర్భంగా బీమానాయక్ మాట్లాడుతూ మాచర్ల నియోకవర్గంలో బంజారాల భవనానికి స్థలం కేటాయించాలని అన్నారు.



ఈ కార్యక్రమంలో ఏపీ యూత్ ప్రెసిడెంట్ జె.రాంబాబునాయక్, రాజకుమార్ నాయక్, మంత్రునాయక్, అంజునాయక్, వెంకటేశ్వర్లు నాయక్, శ్రీనునాయక్, గుండ్ల నాయక్ తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వపాలనలో జవాబుదారీతనం పారదర్శకతలకు ఆర్‌టిఐ ఎంతో దోహదకారి

**ఎ కొండూరు, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త :** ప్రభుత్వ పాలనలో పారదర్శకత అధికారుల్లో జవాబుదారీతనం కోసం ఆర్‌టిఐ ఎంతో దోహదపడుతుందని ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం ఎ కొండూరు మండల అగ్రికల్చర్ ఆఫీసర్ ఎస్‌కె టిప్పుసుల్తాన్ తెలిపారు. మండల



కేంద్రమైన ఎ కొండూరులో సమాచార హక్కుచట్టంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అంతర్జాతీయ న్యాయ సూత్రాలు అవగాహన సమాచర హక్కును విలువైన పౌరహక్కుగా గుర్తించిన నేపద్యంలో సమాచార హక్కు చట్టాన్ని 2025 మే నెల 11న లోకసభలో ఆమోదించారని ఆయన తెలిపారు ఈ చట్టంలో పేర్కొన్న సమాచారం ప్రకారం ప్రతి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రత్యేకంగా ఒక పౌర సమాచార అధికారి ఈ చట్టంలో పేర్కొన్న సమాచారం ప్రకారం ప్రతి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రత్యేకంగా ఒకపౌర సమాచార అధికారి ఈ చట్టంలో పేర్కొన్న విదులను నిర్వహిస్తూ ఉంటారని ఈ చట్టం ప్రకారం రికార్డులు దస్తావేజులు మెయోలు ఈమెయిల్ అభిప్రాయాలు సలహాలు పత్రికా ప్రకటనలు సర్కులర్లు ఉత్తర్వులు రిజిష్టర్లు కాంట్రాక్ట్‌లు నివేదిక నమూనాలు క్రోడీకరించబడిన సమాచార గ్రంధ సమాచార అధికారి 8లో ఇచ్చిన నిబంధనలకు లోబడి 5వేలు అర్జీదారులకు అందించాలని 30 రోజు లోపు అందించాలని తెలిపారు. అధికారులు సకాలంలో సమాచారం ఇవ్వకుంటే అప్పిలేట్ అధికారులకు దరఖాస్తు చేసుకోవలని కోరారు. సత్యం స్వేచ్ఛ నీతికోసం ప్రజా శ్రేయస్సు కోసం సంక్షేమ అభివృద్ధి ఫలాల కోసం ఈ చట్టం ఉపయోగపడుతుందని ఏవో సుల్తాన్ ఆర్ఎస్‌కె సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

## వీరులపాడు మండల పంచాయతీ కార్యదర్శుల సంఘ అధ్యక్షునిగా రామారావు

**వీరులపాడు ఫిబ్రవరి 07 ప్రభాతవార్త :** వీర్లపాడు మండల పంచాయతీ కార్యదర్శుల సంఘ ఎన్నికలను శుక్రవారం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శుల సంఘ అధ్యక్షులుగా ఐ వి రామారావు ఏకగ్రీవం అనుకున్నట్టు పంచాయతీ కార్యదర్శులు మీడియా తెలియజేశారు. ఈ ఎన్నికల కార్యక్రమం భాగంగా జుజ్జూరు గ్రామంలో స్వర్గీయజల్లి ఏసోబు కమ్యూనిటీ మీటింగ్ హాల్లో మండల విస్తరణ అధికారి సీతారామరాజు అధ్యక్షతన సంఘ ఎన్నికలు నిర్వహించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శ ఏకగ్రీవంగా ఎన్నికైన అధ్యక్ష కార్యదర్శులకు పంచాయతీ కార్యదర్శులు శుభాకాంక్షలు తెలియజేయడం జరిగినది. నూతనంగా ఎన్నికైన కార్యదర్శులు ఎదుర్కొన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. వీరులపాడు మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షులుగా ఐవి రామారావు, ప్రధాన కార్యదర్శిగా వై సునీల్ కుమార్ ఉపాధ్యక్షులు టి సాంబశివరావు, కోశాధికార్శి బి అజయ్ కుమార్ జాయింట్ సెక్రెటరీ టి వీరభద్రరావు ప్రచార కార్యదర్శి ఆర్ రాజశేఖర్ కార్యవర్గ సభ్యులుగా మౌనిక, రాణి తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు పాలనపరంగా పలు సమస్యలపై చర్చించి కార్యదర్శులు ఎదుర్కొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి ఏకంగా తీర్మానం చేశారు. నూతన కార్యవర్గం ఏర్పాటుకు పలు పంచాయతీ కార్యదర్శులు మండల ప్రజా పరిషత్ ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

## కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆలపాటి నామినేషన్ దాఖలు


**వినుకొండ,ఫిబ్రవరి7,ప్రభాతవార్త:** కృష్ణ-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థిగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ గుంటూరు కలెక్టరేట్ నందు శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. కార్యక్రమంలో ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు, వినుకొండ మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, కూటమి నాయకులు, జిల్లా నాయకులు, కార్యకర్తలు వేలాదిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీ.వీ మాట్లాడుతూ రాష్ట్రంలో ఐదేళ్ళు వైకాపా అరాచక పాలన చేసి ఆర్థిక సంక్షోభంలోకి నెట్టిందన్నారు. యువతకు ఉపాధి, ఉదో ్యగాలు కల్పించడంలో పూర్తిగా విఫలం చెందిందని విమర్శించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం యువతకు పెద్ద ఎత్తున ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఎంతో కృషి చేస్తుందని కూటమి అభ్యర్థి ఆలపాటిని గెలిపించాలని పిలుపునిచ్చారు.

## ఎమ్మెల్సీ నామినేషన్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

**నరసరావుపేట, ఫిబ్రవరి7 ప్రభాతవార్త :** కృష్ణా - గుంటూరు జిల్లా కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపు తధ్యమని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అన్నారు. శుక్రవారం ఎమ్మెల్సీ అభ్యర్థి రాజేంద్రప్రసాద్ నామినేషన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ కూటమి పార్టీల మద్దతుతో ఎమ్మెల్సీగా రాజేంద్రప్రసాద్ విజయం సునాయాసంగా జరుగుతుందన్నారు. సిఎం నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం అద్భుతంగా ముందుకు సాగుతుందన్నారు. గత ప్రభుత్వం విద్యా వ్యవస్థను పట్టించుకోలేదన్నారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు, పేదలకు విద్యను అందించేందుకు మంత్రి నారా లోకేష్ చేస్తున్న కృషిని గుర్తు చేశారు. డిఎస్సీ ద్వారా ఉద్యోగాలను అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పట్టభద్రులు అందరూ తమ ఓటును రాజేంద్రప్రసాద్‌కు వేయడం ద్వారా విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు కోరారు.

## ముచ్చింతాల సర్పంచ్ జిక్కులూరి రాంబాబును జనసేన పార్టీలో చేరిక

**జగ్గయ్యపేట, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త :** జగ్గయ్యపేట నియోజకవర్గం పెనుగంచిప్రోలు మండలం ముచ్చింతాల గ్రామ సర్పంచ్ జిక్కులూరి రాంబాబు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని వీడి జనసేన పార్టీలో చేరారు. ఎన్‌టిఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను రాంబాబును



శుక్రవారం పార్టీ కండువాతో స్వాగతించారు. జనసేన పార్టీ గ్రామస్థాయిలో మరింత బలపడుతోందని ఈసందర్భంగా ఉదయభాను అన్నారు. కాగా కార్యక్రమంలో జనసేన నేతలు నూకవరపు శ్రీనివాసరావు, వడ్డీకాసులు, కోసూరి ప్రహ్లాద్, అన్నెపాక నరసింహారావు, బొల్లా హనుమంతరావు, న్యాయవాది సామినేని రాము తదితరులు పాల్గొన్నారు.

## ఆకస్మిక తనిఖీలు విధి నిర్వహణలో భాగమే

### -అడిషనల్ ఎస్పీ రమణమూర్తి

**తెనాలి, ఫిబ్రవరి 7 (ప్రభాతవార్త) :** సంఘ విద్రోహ కార్యకలాపాలకు పాల్పడే వారికి ఆశ్రయ మిచ్చినా, రౌడీయిజానికి కాపు కాసినా గంజాయి వంటి మాదక ద్రవ్యాల విక్రయాలకు సహకరించినా జిల్లా పోలింగ్ యంత్రాగం అనుమానిత ప్రాంతాలను అన్ని వైపులా దిగ్బంధం చేసి ప్రతి



ఇంటినీ ప్రతి కదలికను పరిశీలించడం పోలీస్‌శాఖ విధి నిర్వహణలో ఓ భాగమని జిల్లా అడిషనల్ ఎస్పీ రమణమూర్తి పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ సూచనల మేరకు శుక్రవారం తెల్లవారు ఝూము నుండి పోలీస్ బలగాలు సుల్తానాబాద్, వడ్డెర కాలనీ పరిసర ప్రాంతాలను జల్లెడ పట్టాయి. జిల్లా అడిషనల్ ఎస్పీ రమణమూర్తి, డిఎస్పీ బి.జనార్ధనరావు ఆధ్వర్యంలో 150మంది పోలీసు బలగాలతో మూడు గంటలకు పైగా ప్రతి ఇంటినీ చెక్ చేశారు. తెల్ల వారక ముందే ఆయా నివాసాల్లో నివశించే వారిని, నిద్రలేపి మరీ విచారించారు. ఇంటి యమాని ఎవరు, ఇంటిలో నివశించే వారి, వివరాలు ఆధార్ కార్డు, వివరాల ప్రకారమే కుటుంబ సభ్యులు ఉన్నారు, అదనంగా మరెవరైనా ఉన్నారా, ఉంటే ఎందుకు అక్కడ ఉన్నారు అనే వివరాలతో ఆ ప్రాంతాన్ని జల్లెడ పట్టారు. ఉన్న పళంగా తమ ప్రాంతంలోని నివాసాల వారిని పోలీసులు వారిదైన పద్ధతిలో ప్రశ్నించే తీరుపై ఆ ప్రాంత వాసులు అవాక్కయ్యే పరిస్థితి చోటు చేసుకుంది. మొత్తం 340గృహాలను పోలీసు బలగాలు కార్డెన్‌సెర్చ్ నిర్వహించి వివరాలు సేకరించారు. అనంతరం త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అడిషనల్ ఎస్పీ రమణమూర్తి వివరాలు వెల్లడించారు. 56ద్విచక్ర వాహనాలకు, సరైన పత్రాలు అందుబాటులో లేవన్నారు. మూడు ఆటోలను పరిశీలించగా, ఆ వాహనాలకు ఉండవలసిన పత్రాలు సక్రమంగా లేవని గుర్తించినట్లు తెలిపారు. ఆ ప్రాంతంలోని ఆరుగురు రౌడీషీటర్లను అనుమానిత వ్యక్తులను విచారణ చేసినట్లు తెలిపారు. ఆ కాలనీలో ఎవరు నివశిస్తున్నారు, కొత్త వారికి అనుమానాస్పద వ్యక్తులకు ఆశ్రయం కల్పిస్తున్నారా అనే కోణంలో ఆ ప్రాంతాన్ని దిగ్బంధం చేసి విచారణ చేయడం జరిగిందని తెలిపారు.ఈ సమావేశంలో డిఎస్పీ బి.జనార్ధనరావు, సిఐ రమేష్‌బాబు, వన్‌టౌన్ సిఐ మల్లిఖార్జునరావు, టూటౌన్ సిఐ రాములు నాయక్, ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

## ఏప్రిల్ వరకు సాగునీరు అందించాలి : పిడిఎఫ్ కన్వీనర్ దర్శి శేషారావు

**పెదకూరపాడు, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త :** నాగార్జునసాగర్ ఆయకట్టు పరిధిలోని అమరావతి మేజర్‌కు ఏప్రిల్ వరకు సాగునీరు ఇవ్వాలని పెదకూరపాడు అభివృద్ధి వేదిక కన్వీనర్ దర్శి శేషారావు కోరారు. శుక్రవారం పెదకూరపాడు తహశీల్దార్ ధనలక్ష్మికి వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ మేజర్, మైనర్ కాలువల కింద మిరప, పొగాకు, మొక్కజొన్న, జొన్న,



ఇతర పంటలు సాగు చేయటం జరిగిందన్నారు. ఆ పంటలకు నీరు నిరంతరంగా ఇవ్వాలన్నారు. లేనిచో పంటలు దెబ్బతినే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం కాలువలకు నాచు తొలగించి నీరు అందిస్తున్నందుకు శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్‌కు, మండల అధ్యక్షులు అత్తిమళ్ళ రమేష్, డిసి ఛైర్మన్ వి.అప్పారావుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం.మస్తాన్‌రావు, బి.రవికిరణ్, ఎం.నరసింహారావు, వై.నరేంద్ర, వి.శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

**అమరావతి, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త :** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం 33కె.వి.లైన్ చెట్లు తొలగించడం జరుగుతుందని విద్యుత్‌శాఖ ఏఈఈ పి.రవికిరణ్ శుక్రవారం తెలియజేశారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు మండలంలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందన్నారు. కావున వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

## ఫిబ్రవరి 8,9 తేదీలలో ఫిరోజి రుషేంద్రుల బ్రహ్మోత్సవాలు

**సత్తెనపల్లి, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త :** ఫిబ్రవరి 8,9 తేదీలలో ఫిరోజి రుషేంద్రుల 136వ బ్రహ్మోత్సవాలు జరుగుతున్నట్లు భక్తులు శుక్రవారం తెలియజేశారు. ఫిరోజి మందిరంలో పూజలు, భజనలు, సత్సంగాలలో పాల్గొంటూ తీర్థ ప్రసాదాలు స్వీకరించాల న్నారు. 1829లో సత్తెనపల్లి గ్రామం నందు వారు జన్మించారని,



1889లో బ్రహ్మైక్యం పొందారన్నారు. వేదాంతవేత్తగా ఫిరోజి రుషేంద్రుల వారు నిలిచారన్నారు. ఛత్రపతి శివాజీ వంశానికి చెందిన వారి పితామహుడు పాపాజీగా తెలిపారు. గుంటూరు కాలేషా దర్గా మస్తాన్‌కు సమకాలికులు అని తెలియజేశారు. భక్తులకు, పేదజనులకు ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. కోటప్పకొండ తిరునాళ్ళ తర్వాత బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతాయని వారసులు భానుప్రసాద్, సురేష్, మధుసూదనరావు, కొటారి కుమారి, కాలే నర్సుబాయి తెలియజేశారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల నుంచి ఎందుకు తప్పుకున్నారు

### -ఏపీ ఫైబర్ నెట్ కార్పొరేషన్ ఛైర్మన్ జీవీ రెడ్డి

**మాచర్ల, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:** రాష్ట్రంలో జరగబోయే శాసనమండలి ఎన్నికల బరి నుంచి వైకాపా ఎందుకు తప్పుకుందో సమాధానం చెప్పాలని ఏపీ ఫైబర్ నెట్ కార్పొరేషన్ ఛైర్మన్ జీవీ రెడ్డి అన్నారు. శుక్రవారం మాచర్ల పట్టణంలోని నెహ్రూనగర్ తెదేపా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ఫలితాల అనంతరం వైకాపా ఈవీఎంలపై ఆరోపణలు చేసిందన్నారు. ఇప్పుడు జరగబోయే శాసనమండలి ఎన్నికలు బ్యాలెట్ పేపర్లో జరుగుతాయన్నారు. వైకాపా ఆరోపణలు



నిరూపించుకునేందుకు ఇది చక్కటి అవకాశమన్నారు. గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో ఉండి మెజార్టీ సాధించుకోవచ్చు కదా అని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని జగన్ ఆర్థికంగా పాతాళానికి తొక్కారన్నారు. రాష్ట్రంలో ప్రాంతాల వారీగా రెచ్చగొట్టేందుకు జగన్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తెదేపా తొమ్మిది నెలల కాలంలో అనేక సంక్షేమ పథకాలు చేపట్టి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తుందన్నారు. కూటమి నేతల మధ్య విభేదాలు సృష్టించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, వాటిని తిప్పికొట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పంగులూరి అంజయ్య, జూలకంటి అక్కిరెడ్డి, ఎనుముల కేశవరెడ్డి, నర్రా గురవారెడ్డి, కజ్జం సైదయ్య, కూనిశెట్టి వెంకటేశ్వర్లు, కంభంపాటి అనిల్, బూసా రామాంజనేయులు, పులి హరి, మున్నా రాంబాబు యాదవ్, వేణు, బండారు కృష్ణవేణి, కొమెర శివ, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇళ్ల కొలతలు వేయనున్న సచివాలయ సిబ్బంది

**మాచర్ల, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:** మాచర్ల పురపాలక సంఘ పరిధిలో ఇంటి పన్నుల వెరిఫికేషన్ కార్యక్రమాన్ని సచివాలయ ఉద్యోగులు శుక్రవారం చేపట్టారు. పురపాలక సంఘ అధికారులు ఇచ్చిన జాబితా ప్రకారం ఆయా నివాసాల వద్దకు వెళ్లి కొలతలు



తీసుకోనున్నారు. నివాసాల కొలతలకు సంబంధించి నివేదికలను పురపాలక సంఘ కార్యాలయానికి అందించనున్నారు. ఈ సర్వేలో వార్డు అడ్మిన్ సెక్రటరీ, సిబ్బంది పాల్గొన్నారు.

8-2Pg5.qxd:8-2Pg5.qxd 01/01/01 7:18 AM Page 1



# కేజ్రీవాల్ ఆరోపణలపై విచారణకు ఎల్జీ ఆదేశం

### ఆప్ అధినేత ఆరోపణలను ఖండించిన బిజెపి




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7:** అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి తమ అభ్యర్థులను కోట్లుఖర్చుపెట్టికొనుగోలు చేసేందుకు కుట్రలు చేసిందని మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ చేసిన ఆరోపణలపై ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ విచారణకు అనుమతించారు. ఓట్లలెక్కింపు ఈనెల 8వ తేదీ జరుగుతున్నందున ఇప్పటి నుంచే అభ్యర్థులను కొనుగోలు చేసేందుకు బిజెపి సిద్ధం అవుతోందని కేజ్రీవాల్ ఆరోపించారు. అయితే ఈ వ్యాఖ్యలు బిజెపి ప్రతిష్టకు భంగం కలిగిస్తున్నాయని, ఎన్నికల ఫలితాలను సైతం దిగజార్చేవిధంగా కేజ్రీవాల్ వ్యాఖ్యలు చేస్తున్నారని బిజెపి ఆరోపించింది. ఇదిలా ఉంటే లెఫ్టినెంట్‌గవర్నర్ వికె సక్సేనా ఈ ఆరోపణలపై వాస్తవాలు వెలికితీయాంటూ విచారణకు ఆదేశించారు. ఢిల్లీ ఎసిబి అధికారులు కేజ్రీవాల్‌ను ప్రశ్నించేందుకు ఆయన ఉంటున్న సివిల్‌లైన్స్ నివాసానికి వెళ్లారు. అయితే ముందు లాంఛనంగా కేసు నమోదు చేయాలని ఎసిబి భావిస్తోంది. ఎసిబి చర్యలు తీసుకోవాల్సింది పోయి ఎందుకు డ్రామాలు చేస్తోందని ఆప్ ఎంపి సంజయ్‌సింగ్ ప్రశ్నించారు. విచారణలో మొత్తం వాస్తవాలు వెలుగులోకి వస్తాయి కదా అని ఆయన పేర్కొన్నారు. మాజీ సీఎం ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్‌కేజ్రీవాల్ తన సోషల్‌మీడియా పోస్టులో మొత్తం 16మంది ఆప్ అభ్యర్థులకు బిజెపినుంచి ఆఫర్లు వచ్చాయని, వారికి మంత్రి పదవులివ్వడంతోపాటు ఒక్కొక్కరికీ రూ.15 కోట్లు ఇస్తామని ఆఫర్లు ఇస్తున్నారని కేజ్రీవాల్ విమర్శించారు. కొన్ని సర్వేసంస్థలు బిజెపికి 55 సీట్లు వస్తాయని ముందునుంచే చెపుతోందని, గడచిన రెండగు గంటల్లోనే 16 మంది తమ అభ్యర్థులకు ఈ ఆఫర్లు వచ్చాయని ఆయన చెప్పారు. ఎగ్జిట్‌పోల్స్ సర్వేల వివరాల వాస్తవికతను కేజ్రీవాల్ ప్రశ్నించారు. వారికి నిజంగా 55 సీట్లే వస్తుంటే మావాళ్లకు ఆఫర్లు ఎందుకు ఇస్తున్నారని కేజ్రీవాల్ ప్రశ్నించారు. దీన్నిబట్టే ఇవన్నీ బోగస్ సర్వేలని తెలిసిపోతున్నదని అన్నారు.

ఆప్ అభ్యర్థులను చీల్చేందుకు బిజెపి మైండ్‌గేమ్ ఆడుతోందన్నారు. అయితే ఏ ఒక్కరు కూడా అటువైపు వెళ్లబోరని కేజ్రీవాల్ అన్నారు. ఆప్ సీఎం అభ్యర్థి కల్కాజీనుంచి పోటీ చేసిన అతిశి మాట్లాడుతూ వారికి మెజారీ సీట్లు వస్తేమా అభ్యర్థులకు ఎందుకు ఆఫర్లు ఇస్తున్నారని ప్రశ్నించారు. ఢిల్లీలో ఎగ్జిట్‌పోల్స్ అన్నీ కూడా బిజెపిదే విజయం అని చెపుతూ ఆప్ అభ్యర్థులను నిస్తేజపరిచే కుట్రలుచేసారని ఇదంతా బిజెపి కుట్రల్లో భాగమేనని అన్నారు. లెఫ్టినెంట్ గవర్నర్ ఈఅంశంపై సమగ్ర విచారణ జరగాలని భివిస్తున్నారని, ఎసిబి ఈ ఆరోపణల్లో నిజమెంతుందో వెలికితీయాలని ఎల్జీవికె సక్సేనా కార్యాలయం ప్రకటన విడుదల చేసింది.

70 సీట్ల అసెంబ్లీ ఎన్నికలకుగాను ఓట్లలెక్కింపు ఈనెల 8వ తేదీన జరుగుతుంది. అదేరోజు ఫలితాలు కూడా వెల్లడి అవుతాయి.

# దేశాన్ని అస్థిరపరిచేందుకు విచ్ఛిన్నకర శక్తుల కుట్రలు

### ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7:** దేశంలో కొన్ని విచ్ఛిన్నకరశక్తులు భారత్‌ను అస్థిరపరిచే కుట్రలుచేస్తున్నాయని దేశప్రజలు అప్రమత్తంగా ఉండి తిప్పికొట్టాలని ఉపరాష్ట్రపతి జగదీప్‌ధన్‌ఖడ్ హెచ్చరించారు. వాతావరణ మార్పులకంటే ఈ శక్తులనుంచి మరింత తీవ్రస్థాయి ముప్పు ఎదురవుతుందని కొందరు వ్యక్తులు ఈ తరహా వ్యవహారశైలితో కొనసాగుతున్నారన్నారు. మరికొందరయితే ఏకంగా ప్రజల్లోనే చీలికలు తెచ్చి వేర్పాటు వాద సిద్ధాంతాలను చొప్పిస్తున్నారని, కులం, మతం, ప్రాంతం ఆధారంగా విచ్ఛిన్నకర శక్తులు కీలకపాత్రలు పోషిస్తున్నారన్నారు. ప్రాంతీయతత్వం, జాతీయ వాదంలు రెండూ సమాంతరంగా వెళుతున్నాయని తరిచితరిచి చూస్తే జాతి వ్యతిరేకశక్తుల కుట్రలే ఇవన్నీ అని తెలుస్తుందన్నారు. కర్ణాటక సాహిత్య సంస్కృతిక వైభవ వేడుకల సభలో పాల్గొన్న ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ ఈ జాతివ్యతిరేకశక్తులు విభిన్న మార్గాల్లో ఎదురవుతుంటారని, కొత్తకొత్త మార్గాలతో, అనేక అంశాలను చీలిక వాదానికి మూలంగా ఎంపికచేసుకని ప్రజల్లోకి చొప్పిస్తారని హెచ్చరించారు. దేశం సాంస్కృతిక వారసత్వ సంపదను మనమే పరిరక్షించుకోవాలని ఉపరాష్ట్రపతి అన్నారు. భారత దేశ అభివృద్ధి ఇపుడు ప్రపంచ దేశాలకు సైతం కనిపిస్తోందని, దేశ ప్రజలు ఈ అభివృద్ధి ఫలాలు అందుకుంటున్న దశలో విచ్ఛిన్నకర శక్తులు, వేర్పాటువాద శక్తులను గుర్తించి తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. భారత ఆర్థిక ప్రగతిపై మాట్లాడుతూ ప్రపంచ ఆర్థికసంస్థలు ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు ఇతర సంస్థలన్నీ కూడా భారత్ ను పెట్టుబడులకు సానుకూల గమ్యస్థానంగా చూస్తున్నాయని అన్నారు. ప్రపంచస్థాయి పెట్టుబడులకు ఇపుడు భారత్ హబ్‌గా నిలవడం మన కెంతో గర్వకారణమని అన్నారు.


# అమెరికా తుదిజాబితాలో 487 మంది భారతీయులు



**వాషింగ్టన్, ఫిబ్రవరి 7:** అక్రమ వలసదారులను తరలింపు ప్రక్రియను ముమ్మరంచేసిన అమెరికా 104 మంది భారతీయులను వెనక్కి పంపించిన తర్వాత అమెరికా బహిష్కరించిన తుది జాబితాలో మరో 487 మంది భారతీయులు ఉన్నారని విదేశాంగశాఖ ప్రకటించింది. అమెరికా ప్రభుత్వం భారత్‌కు తెలియజేసిందని వెల్లడించింది. వలసదారులకు సంకెళ్లు వేసి తరలిస్తున్నారని వస్తున్న ఆరోపణలపై స్పందిస్తూ వీటికి సంబందించి అమెరికా వద్ద ఆందోళన తెలియజేసామని విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా అమెరికాతో సంప్రదింపులు జరుపుతామని చెప్పారు. అక్రమంగా అమెరికా వెళ్లినట్లు గుర్తించిన భారతీయులను సురక్షితంగా తీసుకువస్తామన్నారు. సైనిక విమానాల్లో తరలిస్తోన్న ప్రక్రియపై మిస్రీ స్పందిస్తూ తాజా బహిష్కరణ ప్రక్రియ మునుపటి విమానాలతో పోలిస్తే భిన్నంగా ఉందన్నారు. అయినప్పటికీ జాతీయ భద్రతకు సంబంధించిన అంశమని అమెరికా ప్రభుత్వ విధానంలోనే పేర్కొన్నట్లు విదేశాంగ కార్యదర్శి స్పష్టంచేసారు. అక్రమ వలసదారులను తిరిగి స్వదేశాలకు పంపించే ప్రక్రియ కొత్తదేమీ కాదని భారత్ ఇప్పటికే ప్రకటించింది. గడచిన 15 ఏళ్లలో 15,756 మంది భారతీయులను వెనక్కి పంపించినట్లు విదేశాంగమంత్రి జైశంకర్ తెలిపారు. 2009లో ఈ సంఖ్య 734గా ఉండగా 2019లో గరిష్టంగా 2042 మందిని తిరిగిపంపించిందన్నారు. 2025లో భారత్‌కు ఇప్పటివరకూ 104 మందిని పంపించిందని విదేశాంగమంత్రి తెలిపారు.


# యుఎస్ ఎయిడ్‌లో 9700 మందికి ట్రంప్ ఉద్వాసన

**వాషింగ్టన్, ఫిబ్రవరి 7:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ నిర్ణయాలుప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. ఇప్పటికే ఇతర దేశాలపై టారిఫ్‌లు ఆంక్షలతో విరుచుకుపడుతున్న ఆయన స్వదేశంలోనూ కొన్ని సంస్థల్లో సమూల ప్రక్షాళన చేపట్టేందుకు సిద్ధం అయ్యారు. ప్రపంచంలో అతిపెద్ద సహాయ సంస్థ అయినా అమెరికా అంతర్జాతీయ అభివృద్ధి సంస్థ అనే యుఎస ఎయిడ్‌లో ఏకంగా 9700 మందికిపైగా ఉద్యోగాలను తొలగించేందుకు ట్రంప్ యంత్రాంగం ఆలోచనచేస్తోంది. ఈసంస్థకు ప్రపంచ వ్యాప్తంగా పదివేలమందికిపైగా ఉద్యోగులున్నారు. ఈ సంఖ్యను 300 దిగువకు తీసుకురావాలని చూస్తున్నారు. కేవలం 294 మంది మాత్రమే ఏజెన్సీలో పనిచేసేలా ట్రంప్‌ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధంచేస్తోంది. వీరిలో 12 మంది ఆఫ్రికా, బ్యూరో ఎనిమిది మంది ఆసియా బ్యూరోలో ఉండనున్నారట. మిగతా 9700 మందికి త్వరలోనే ఉద్వాసన పలకనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. అయితే దీనిపై అమెరికా విదేశాంగశాఖనుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ఈ సహాయ సంస్థను తీవ్రవాద ఉన్మాదులు నడుపుతున్నారని వాళ్లందరినీ వెళ్లగొట్టేస్తానని ట్రంప్ వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. అటు డోజ్ విభాగ సారథి టెస్లా అధినేత ఎలాన్ మస్క్ కూడా దీనిపై మాట్లాడుతూ యుఎస్‌ఎయిడ్ నేరగాళ్లసంస్థ అని ఆరోపించారు. ఈక్రమంలోనే ఇటీవల ఈ సంస్థలో వందలాదిమంది ఉద్యోగులను సెలవుపై పంపించారు. సుమారు 120 దేశాలకు మానవతా దృక్పథంతో సాయంచేయడానికి ఆదేశాల అబివృద్ధికి, భద్రతకు నిధులు సమకూర్చడానికి యుఎస్ ఎయిడ్‌ను నెలకొల్పారు. ఈ సంస్థ వందలకోట్ల డాలర్లను సాయంగా అందిస్తోంది. అలాగే అంతర్జాతీయ క్రిమినల్ కోర్టుపైనా ట్రంప్ ఆంక్షలు విధించారు. ఇందుకు సంబంధించిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై తాజాగా ఆయన సంతకంచేసారు. అమెరికా దాని మిత్ర



దేశం ఇజ్రాయెల్ లక్ష్యంగా నిరాధార దర్యాప్తులు చేపడుతోందని ఈసందర్భంగా అధ్యక్షుడు దుయ్యబట్టారు. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుపై అరెస్టువారంట్‌జారీచేసి అంతర్జాతీయ క్రిమినల్‌కోర్టు తన అధికారాలను దుర్వినియోగం చేసిందని మండిపడ్డారు. ఆంక్షల నేపథ్యంలో ఐసిసి అధికారులు అమెరికాలో ప్రవేశించకుండా వారిపై నిషేధాజ్ఞలు అమలు చేస్తామని ట్రంప్ ప్రకటించారు.

# 700 మంది క్యాంపస్ రిక్రూట్‌లపై ఇన్ఫోసిస్ వేటు




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7:** ఐటి దిగ్గజం ఇన్ఫోసిస్ సుమారు 700మంది కొత్త ఉద్యోగులను మైసూరు క్యాంపస్‌నుంచి ఇంటికి పంపింది. ఐటి ఉద్యోగుల సంఘం నాస్కెంట్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎంప్లాయీస్ సెనేట్ (నైట్స్) శుక్రవారం ఈప్రకటనచేసింది. జాయిన్ అయిన కొద్దినెలలకే వీరందరినీ తొలగించిందని నైట్స్ వెల్లడించింది. ఇది అత్యంత అనైతికమని ఇన్ఫోసిస్ నిర్బంధంగా ఉద్యోగులను పంపించివేయడం ప్రారంభించిందని అందులో భాగంగానే 700 మంది క్యాంపస్ రిక్రూట్‌లను తొలగించిందని నైట్స్ అధ్యక్షుడు హర్‌ప్రీత్‌సింగ్ సలూజా ఆరోపించారు. ఈ ఉద్యోగుల తొలగింపుప్రక్రియలో కంపెనీ బౌనర్లు, సెక్యూరిటీ సిబ్బందిని కూడా నియమించిందని చెపుతూ ఉద్యోగులను మొబైల్‌ఫోన్లు కూడా లోపలికి అనుమతించలేదని, ఎందుకంటే ఎవరైనా విడియో చిత్రిస్తారన్న అనుమానంతోనే ఎవ్వరి మొబైల్ ఫోన్లను అనుమతించలేదన్నారు. ఇలా ఏకపక్షంగా ఆకస్మికంగా తొలగించడం ఉద్యోగులపై తీవ్ర ప్రభావం పడుతుందని సలూజా ఆరోపించారు. అయితే ఇన్ఫోసిస్ మాత్రం తమ చర్యను సమర్థించుకుంది. క్యాంపస్ రిక్రూట్ అయిన ఉద్యోగులు కంపెనీలో నిర్వహించిన అంతర్గత పరీక్షల్లో విఫలం అయ్యారని అందువల్లనే వారిని పంపించివేస్తున్నట్లు తెలిపింది. కొత్త ఉద్యోగులు అందరికీ మూడుసార్లు అసెస్‌మెంట్ క్లియర్‌చేసే అవకావం ఇచ్చామని, విఫలం అయితే వారు కంపెనీలో కొనసాగేందుకు అర్హులు కాదని ముందే స్పష్టం చేసామన్నారు. వారి కాంట్రాక్టులో కూడా స్పష్టంగా తెలిపామని కంపెని ప్రకటించింది. రెండుదశాబ్దాలుగా ఇదే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. కంపెనీ ప్రమాణాలకు అనుగుణంగా ఉత్తీర్ణులైన వారిని కొనసాగిస్తున్నామని తెలిపింది. అయితే నైట్స్ మాత్రం కేంద్ర కార్మిక ఉపాధికల్పనశాఖకు ఫిర్యాదు చేస్తామని ప్రకటించింది. ఇలా ఎంతమాత్రం కొనసాగనీయకూడదని ఐటి వర్కర్ల హుందాతనం, హక్కులను పరిరక్షిస్తామని సలూజా వెల్లడించారు.

# మహాకుంభ్‌కు 40 కోట్లమంది భక్తులు

### కుంభమేళాప్రాంతంలో మళ్లీ అగ్నిప్రమాదం

**మహాకుంభ్‌నగర్, ఫిబ్రవరి 7:** ప్రయాగరాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళాకు భక్తులు వెలువలా వస్తున్నారు. త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలకు ప్రతినిత్యం లక్షల్లోనే భక్తులు వస్తున్నారు. కుంభమేళా ప్రారంభం అయినప్పటి నుంచి నేటివరకూ 40 కోట్లమంది భక్తులు పుణ్యస్నానాలు చేసారని యుపి ప్రభుత్వం ప్రకటించింది. శుక్రవారం నాటికి 39.74 కోట్లమంది భక్తులు త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించినట్లు అధికారులు తెలిపారు. పౌష్ పూర్ణిమ సందర్భంగా జనవరి 13వ తేదీ మహాకుంభమేళా ప్రారంభించారు. ఈనెల 26వ తేదీ శివరాత్రి వరకూ ఈకుంభమేళా కొనసాగనున్నది.





సుమారు 45రోజులపాటు జరిగే ఈ మహా కుంభమేళాకు ప్రపంచం నలుమూలల నుంచి సుమారు 50 కోట్లమంది భక్తులు వస్తారని యుపి ప్రభుత్వం అంచనావేస్తోంది. అందుకు తగిన ఏర్పాట్లుకూడా చేసింది. ఇదిలా ఉండగా మహాకుంభమేళాలో మరోసారి అగ్నిప్రమాదం సంభవించింది. శకంరాచార్య మార్గ్‌లోని సెక్టార్ 18లో శుక్రవారం ఉదయం మంటలు చెలరేగాయి. అక్కట ఏర్పాటు చేసిన టెంట్లు మంటల్లో కాలిపోతున్నాయి. వెంటనే అప్రమత్తం అయిన అధికారులు అగ్నిమాపక యంత్రాల సాయంతో మంటలను అదుపు చేసేందుకు తీవ్రంగ ఆశ్రమిస్తున్నారు. అదృష్టవ శాత్తూ ఈప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం సంభవించకపోవడంతో అంతా ఊపిరిపీల్చు కుంటున్నారు.




## లిఖిత పూర్వకంగానే జవాబిస్తాం

### కేంద్ర ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్

**ముంబయి, ఫిబ్రవరి 7:** మహారాష్ట్ర ఓటర్ల జాబితాలో అవకతవకలు చోటుచేసుకున్నాయంటే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీచేసిన వ్యాఖ్యలపై కేంద్ర ఎన్నికల సంఘం స్పందించింది. రాజకీయ పార్టీలు లేవనెత్తిన ప్రశ్నలను, సూచనలను తాము గౌరవిస్తున్నామని త్వరలోనే లిఖితపూర్వకంగా స్పందిస్తామని పేర్కొంది. మహారాష్ట్ర ఓటర్లకు సంబంధించి పూర్తి వాస్తవాలు విధానపరమైన అంశాలతోనే కమిషన్ సమాధానం ఇస్తుందని వివరించింది. కాంగ్రెస్ ఎంపి రాహుల్ గాంధీ ఇటీవల ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ మహారాష్ట్ర ఎన్నికల్లో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. ప్రతిపక్షాలకు చెందినపార్టీలు ఒక బృందాన్ని ఏర్పాటు చేసుకుని ఓటర్ల సంఖ్యపై అధ్యయనం చేస్తున్నట్లు తెలిపారు. అట్టడుగు వర్గాలకు చెందిన ఎందరో ప్రజల ఓట్లను ఓటర్ల జాబితాలనుంచి తొలగించారని, కొన్ని ప్రాంతాల్లో పోలింగ్ బూత్‌లు ఉన్నా అక్కడి ఓటర్లను మరో కేంద్రానికి మార్చారని ఆరోపించారు. ఈక్రమంలో మహారాష్ట్రలో జరిగిన అసెంబ్లీ లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల జాబితాలు తమకు ఇవ్వాలని ఈసీని కోరామని, దీనిద్వారా కొత్తగాచేరిన ఓటర్లు ఎవరనేది కచ్చితంగా తెలుస్తుందని తెలిపారు. అలాగే ఎంతమంది ఓటర్లను తొలగించారో ఒక బూత్‌నుంచి మరొక బూత్‌కు ఎందుకు బదిలీచేసారో కూడా తెలుస్తుందని పేర్కొన్నారు. అయితే ఈ విషయమై ఈసీనుచి ఎలాంటి స్పందన రాలేదన్నారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా లేదు కనకనే ఓటర్ల జాబితాను తమకు ఇచ్చేందుకు ఎన్నికల సంఘం ఆసక్తిచూపించడంలేదని రాహుల్ గాంధీ ఆరోపించారు. దీనిపై స్పందించిన కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ తాము లిఖిత పూర్వకంగానే సమాధానం ఇస్తామని ఇందులో వాస్తవాలను దాచే ప్రసక్తేలేదన్నారు.

## సిద్దరామయ్యకు భారీ ఊరట

**బెంగళూరు, ఫిబ్రవరి 7:** కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఊరటనిచ్చాయి. కర్ణాటకలో ముడా కుంభకోణం కలకలం సృష్టించిన క్రమంలో లోకాయుక్తపోలీసుల దర్యాప్తును సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్‌కు బదలీ చే యాలని వేసిన పిటిషన్‌ను కర్ణాటక హైకోర్టు కొట్టి వేసింది. ఈ కేసును దర్యాప్తు సంస్థకు అప్పగించాలనే అభ్యర్థనను నిరాకరించింది. ముడా స్కామ్ కర్ణాటక రాజకీయాల్లో కలకలం రేపుతోంది. ముడా స్థలాల కేటాయింపుల్లో ముఖ్యమంత్రి సిద్ధరా మయ్య కుటుంబసభ్యులు లబ్ధిపొందడం అందుకు ముఖ్యమంత్రి అధికారాన్ని దుర్వినియోగం చేసినట్లు దాఖలాలతో సామాజిక కార్యకర్త టిజె అబ్రహం గవర్నర్‌కు ఫిర్యాదుచేసారు. ఆయనతోపాటు స్నేహమయి కృష్ణ, ప్రదీప్‌కుమార్‌లు ముఖ్యమంత్రిపై ఫిర్యా దులు చేసారు. దీనితో ప్రథమ నిందితుడిగా సిద్ధరామయ్యపై కేసు నమోదయింది సిద్దరామయ్య సతీమణి పార్వతి, బావమరిది మల్లిఖార్జున్‌స్వామితో పాటు మరో వ్యక్తిపేరు ఈ నిందితుల జాబి తాలో చేర్చారు. ఈ విషయంపై సిద్ధరామయ్య మాట్లాడుతూ తాను ఏ తప్పు చేయలేదని తప్పుచేసి ఉంటే ఇంతకాలం రాజకీయాల్లో ఉండటం అసాధ్యమన్నారు. భగవంతుడి ఆశీస్సులు ఉన్నంత వరకూ తనను ఎవరూ ఏమీ చేయలేరని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే ఆయన సతీమణి తమ భూములను తిరిగి ముడా సంస్థకు ఇచ్చేసారు. ఈ వ్యవహారంలో తనను విచారించేందుకు గవర్నర్ అనుమతి మంజూరు చేయడాన్ని సీఎం హైకోర్టులో సవాల్ చేసినా ఆయనకు న్యాయం జరగలేదు. దీనితో ఆయన సుప్రీంకోర్టుకు అప్పీలు చేసారు.






# 25 బేసిస్‌పాయింట్లు తగ్గించిన ఆర్బీఐ

### రెపోరేట్లు తగ్గితేనే వ్యవస్థలోకి మరింత నగదు

### ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా

**ముంబయి, ఫిబ్రవరి 7:** భారతీయ రిజర్వుబ్యాంకు రెపోరేట్లను ఈ ఏడాది తొలిసారి సవరించింది. మానిటరీ పాలసీ కమిటీ సమీక్షల్లో ఏకగ్రీవడం 25 బేసిస్ పాయింట్లు తగ్గించాలని నిర్ణయించారు. 6.5నుంచి 6.25శాతానికి కుదించినట్లు గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడించారు. గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొట్టమొదటిసారి నిర్వహించిన సమీక్ష అనంతరం రెపోరేట్ల వివరాలను ప్రకటించారు. ఆర్‌బిఐ సభ్యులతోపాటు ముగ్గురు బయటిప్రముఖులు, ఏకగ్రావంగా రెపోరేట్లను తగ్గించాలని అభిప్రాయం వ్యక్తం చేసారన్నారు. 2020 మే సమీక్ష కాలంనుంచి ఇప్పటివరకూ 11 సమీక్ష సమావేశాలు జరిగినా రెపోరేట్ల జోలికి వెళ్లలేదు. ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక మందగమనం ఆర్థికవనరుల వ్యవస్థలపై ప్రభావం చూపిస్తున్నదని అందువల్లనే వృద్ధి కూడా చరిత్రాత్మక సగటునుంచి తగ్గుతున్నదన్నారు. అయితే క్రమేపీ ప్రపంచ ఆర్థికవ్యవస్థ ఊపందుకుంటున్నదని మరింత పటిష్టపడుతుందన్న అభిప్రాయం వ్యక్తం చేసారు. వడీరేట్ల కుదింపులో అమెరికా బాండ్ల రాబడులు కూడా ఒక్కసారిగాపెరిగాయి. అలాగే డాలర్‌కరెన్సీ కూడా పెరిగింది. జిడిపి వృద్ధిరేటు ఆర్థిక సంవత్సరంలో 6.4శాతంగా ఉంటుంది. రానున్న ఆర్థిక సంవత్సరంలో వాస్తవ వృద్ధి 6.7శాతంగాఉంటుందని, మొదటి త్రైమాసికంలో ఏడుశాతం, రెండోత్రైమాసికంలో 6.5శాతం, నాలుగోత్రై మాసికంలో 6.5శాతం గా ఉంటుందని ఆర్‌బిఐ వెల్లడించింది. ఇక రిటైల్ ద్రవ్యోల్బణం కూడా 48 శాతంగా ఉంటుందని గత త్రైమాసికంలో 4.4శాతంగా ఉందని మల్హోత్రా వెల్లడించారు. బ్యాంకులవద్ద నగదు లభ్యత పటిష్టంగానే ఉందని వ్యవస్థలోకి మరింత నగదును చొప్పించేందుకు అవసరమైన చర్యలు కూడా అమలవుతాయన్నారు. స్థిరాస్తులపై రాబడులు, ఈక్విటీలుకూడా బ్యాంకులకు మంచి ఫలితాలిస్తున్నట్లు ఆయన చెప్పారు. అయితే డిజిటల్ మోసాలపట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన హెచ్చరించారు. అన్నిరంగాలకు సంబంధించిన వారు కూడా కఠిన చర్యలకు ఉపక్రమించాలని బ్యాంకులు కూడా వీటిని కట్టడిచేసే కార్యాచరణ మరింతవేగంగా అమలుచేయాలని సూచించారు.

# రెపోరేట్ల ప్రభావంలేని సెన్సెక్స్ నిఫ్టీ

### కీలక కంపెనీల షేర్లన్నీ దిగువన ట్రేడింగ్

**ముంబయి, ఫిబ్రవరి 7:** రెపోరేట్లను తగ్గిస్తూ ఆర్బీఐ ప్రకటించిన ఎంపిసి సమీక్ష నిర్ణయాలు ట్రేడర్లను సంతృప్తిపరచలేదు. నిఫ్టీ, సెన్సెక్స్ రెండూ కూడా దిగువప్రాంతంలోనే ట్రేడింగ్‌ముగించాయి. ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపించడంతో విదేశీ నిధులు అధికశాతం విత్‌డ్రా అయ్యాయి. వరుసగా మూడోరోజు కూడా ఈక్విటీలు తగ్గుముఖం పట్టాయి. 30షేర్ బిఎస్‌ఇ బెంచ్‌మార్క్ సెన్సెక్స్ 197.97 పాయింట్లు క్షీణించి 77,860.19 పాయింట్ల వద్ద స్థిరపడింది. ట్రేడింగ్ ఆసాంతం అనిశ్చితంగానే కొనసాగింది. ఈ రోజు ట్రేడింగ్‌లోసుమారు 0.74శాతం క్షీణించి 77,475.4పాయింట్లకు సైతం ఒకదశలోచేరింది. ఇక ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ కూడా 43.40 పాయింట్లు క్షీణించి 23,559.95 పాయింట్లవద్ద ట్రేడింగ్ ముగించింది. ఐటిసి తన త్రైమాసిక ఫలితాల్లో తగ్గుదల నమోదుచేయడంతో రెండుశాతం షేర్లు క్షీణించాయి. నికరలాభం 5013.16క ఓట్లుగా కంపెనీ ప్రకటించింది. ఎస్‌బిఐ, ఆదాని పోర్ట్స్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, ఐసిఐసిఐబ్యాంకు, రిలయన్స్ ఇండస్ట్రీస్, పవర్‌గ్రిడ్‌లు కూడా ట్రేడింగ్‌లో వెనకబడ్డాయి. ఆర్‌బిఐ వడ్డీరేట్లకుదింపు మార్కెట్లకు ఎలాంటి ఊతం ఇవ్వలేదు. ఆర్‌బిఐ గవర్నర్ వ్యాఖ్యల్లో ఎలాంటి కొత్త అంశం లేదని భావించారు. బ్యాంకింగ్, ఆయిల్ అండ్ గ్యాస్, ఎఫ్‌ఎంసిజి, ఇంధనరంగ స్టాక్‌లన్నీ కూడా ట్రేడింగ్‌లో వెనకబడ్డాయి. వీటికితోడు ఒక్కొక్కటిగా వస్తున్న ఆర్థిక ఫలితాలు కూడా మరి కొంత ప్రభావితం చేస్తున్నాయి. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించినట్లు మెహతా ఈక్విటీస్ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ ప్రశాంత్ తాప్సే అన్నారు. టాటాస్టీల్‌మాత్రం 4శాతం పెరిగింది. భారతి ఎయిర్‌టెల్ స్టాక్



నాలుగుశాతంపెరిగింది. ఐదురెట్లు నికరలాభం పెరిగి 16,134.6 కోట్లకుచేరింది. ఇండస్ టవర్స్ బిజినెస్ జోరందుకోవడం, ట్యారిఫ్ పెంపు వంటివికూడా కొంత షేర్లకు ఊతం ఇచ్చాయి. జొమాటో, వమీంద్ర, అల్ట్రాటెక్‌సిమెంట్; టెక్‌మహీంద్రాలు కూడా లాభాల్లోనే ముగిసాయి. వడ్డీరేట్ల ఆధారిత రంగాలయిన ఆటోమొబైల్ స్టాక్స్‌కూడా లాభనష్టాలులేని దశలోముగిసాయి. ఆర్‌బిఐ రేట్లవల్ల ఆటో, హోం లోన్లు కొంతమేర వడ్డీరేట్లు తగ్గవచ్చని బ్యాంకింగ్ రంగ నిపుణులు చెపుతున్నారు. రెపోరేట్లు ఎక్కువ ఉంటే డిపాజిట్లపై రిటర్నులు పెరుగుతాయి. పొదుపు, ఇన్వెస్ట్‌మెంట్ ఉత్పత్తుల రెపోరేట్లను ఇవి నిర్ణయిస్తాయి. రెపోరేట్లు తగ్గితే వడ్డీ ఆధారిత రంగాల్లో రిటర్నులు కూడా తగ్గుతాయి. ఆసియా మార్కెట్ల పరంగా దక్షిణకొరియా, జపాన్ మార్కెట్లు దిగువన ముగిస్తే షాంఘై, హాంకాంగ్ మార్కెట్లు సానుకూలంగానే ముగిసాయి. ఇక యూరోపియన్ మార్కెట్లు కూడా దిగువస్థాయిలోనే ముగిసాయి. అమెరికా మార్కెట్లు మాత్రం ముందురోజు భారీగాపెరిగాయి. బ్రెంట్ ముడిచమురు 0.73శాతంపెరిగి బ్యారెల్‌కు 74.83డాలర్లుగా కొనసాగింది. మార్కెట్లనుంచి విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు 3549.95 కోట్ల విలువైన షేర్లను విక్రయించి లాభాల స్వీకరణ బాటపట్టారు.



### సరిహద్దుల్లో ఎన్‌కౌంటర్

# ఏడుగురు ఉగ్రవాదులు హతం

**శ్రీనగర్, ఫిబ్రవరి 7:** భారత్ భూభాగంలోకి అక్రమంగా ప్రవేశించాలన్న పాక్ ఉగ్రవాదుల కుట్రలను భద్రతా బలగాలు భగ్నంచేసాయి. నియంత్రణరేఖను దాటేందుకు యత్నిస్తుండగా ఏడుగురు చొరబాటుదారులను హతమార్చాయి. మృతుల్లో పాకిస్థాన్ ఆర్మీ సిబ్బందికూడా ఉన్నట్లు తెలుస్తోంది. జమ్ముకాశ్మీర్‌లోని పూంఛ్ జిల్లాలో గల కృష్ణఘాటి సెక్టార్‌లో ఈనెల 4,5 తేదీలమధ్యరాత్రివేళ ఈ ఘటన చోటుచేసుకుంది. నియంత్రణ రేఖను దాటి భారత ఫార్వర్డ్‌పోస్టుపై దాడికి యత్నిస్తున్న పాకిస్థాన్ బోర్డర్ యాక్షన్ టీమ్‌పై సైన్యం మెరుపుదాడికి పాల్పడింది. ఈ క్రమంలోజరిగిన కాల్పుల్లో ఏడుగురు చొరబాటుదారులు హతమైనట్లు ఆర్మీ వర్గాలు తెలిపాయి. మృతుల్లో ఇద్దరు ముగ్గురు పాకిస్థానీ ఆర్మీ రోగ్యులర్ సిబ్బందికూడా ఉన్నారు. మిగిలిన వారు ఉగ్రవాదులన అల్ బదర్‌గ్రూప్‌నకు చెందిన వారయి ఉండవచ్చని ఈ వర్గాలుతెలిపాయి. పాక్‌ప్రధాని షెహబాజ్ షరీఫ్ శాంతిమంత్రం వల్లెవేసిన కొద్దిరోజులకే ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. కాశ్మీర్ సహా అన్ని సమస్యలకు భారత్‌తోసంప్రదింపుల ద్వారానే పరిష్కరించుకోవాలని కోరుకుంటున్నట్లు ఇటీవల ఆయన ఒక కార్యక్రమంలో వ్యాఖ్యానించారు.

ఇదిలా ఉండగా జైషేమహ్మద్ లష్కరే తాయిబా వంటి ఉగ్రసంస్థలు తాజాగా పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో కశ్మీర్ సంఘీభావ దినం పేరుతో సంయుక్త సదస్సు నిర్వహించినట్లు తెలిసింది. దీనికి హమాస్ ప్రనతినిధులు కూడా హాజరైనట్లుప్రచారం జరగడంతో భారత నిఘా వర్గాలు మరింతగా అప్రమత్తం అయ్యాయి.

## సెలవు ఇవ్వలేదని సహోద్యోగులపై దాడి: నలుగురికి కత్తిపోట్లు

**కోల్‌కత్తా, ఫిబ్రవరి 7:** అత్యవసరపనిపై వెళ్లాలని సెలవు కావాలని అడిగిన ప్రభుత్వ ఉద్యోగికి సెలవు ఇవ్వకపోవడంతో సహనం కోల్పోయాడు. ఉన్నతాధికారి కాదనడంతో ఆతడి కోపం కట్టలు తెంచుకుంది. తన వెంట తెచ్చుకున్న కత్తితో ఉన్నతాధికారితోపాటు సహచర ఉద్యోగులపైనా దాడిచేసాడు. తర్వాత అదే కత్తితో తిరుగతూ కనిపించాడు. పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కత్తాలో న్యూటౌన్‌ప్రాంతానికిచెందిన కారిగరి భవన్‌లోని సాంకేతిక విద్యావిభాగంలో అమిత్‌కుమార్ సర్కార్ విధుల్లో ఉన్నాడు. ఎప్పటిలాగే ఆఫీస్‌కు వచ్చిన కుమార్ లీవ్ కావాలని ఉన్నతాధికారిని కోరితే ఆయన తిరస్కరించారు. అదే విషయంలో తన సహోద్యోగులతో గొడవకూడా జరిగింది. ఈ గొడవలో అమిత్‌వెంట తెచ్చుకున్నకత్తితో సహచర ఉద్యోగులపై దాడికి దిగాడు. వీపున బ్యాగ్, రక్తంతో తడిసిన కత్తితో వెళుతున్న అమిత్‌ను స్థానికులు విడియోలు తీయడంతో



అసలు విషయం వెలుగులోకి వచినచంది. ఆఫీస్ లో జరిగిన ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై పోలీస్ అధికారి మాట్లాడుతూ నిందితుడు తన సహోద్యోగులతో సెలవు విషయంలో గొడవపడ్డాడని, సెలవు నిరాకరించడానికి గల కారణం, సహోద్యోగులపై కత్తితో ఎందుకు దాడిచేసారో ఆరా తీస్తున్నట్లు తెలిపారు. నిందితుడికి మానసిక ఆరోగ్య సమస్యలున్నాయని అనుమానిస్తున్నామని ఆ కోణంలో కేసు దర్యాప్తు చేస్తామన్నారు. అమిత్ కత్తిదాడలో జయదేబ్ చక్రవర్తి, శంతను సాహా, సర్తాలేట్, షేక్ సతాబుల్‌లు గాయపడ్డారని వీరిలో ఇద్దరిపరిస్థితి విషమంగా ఉందన్నారు.

8- 02 Pg6exHMNWJQE.qxd:8- 02 Pg6exHMNWJQE.qxd 01/01/01 9:26 AM Page 1



# మొబైల్‌లోనే అన్ని ధృవపత్రాలు, ప్రతి ఒక్కరికి డిజి లాకర్ సదుపాయం

## - ఐటి, ఆర్టీజి శాఖ కార్యదర్శి భాస్కర్ కాటంనేని

**విజయవాడ,ఫిబ్రవరి7,ప్రభాతవార్తప్రతినిధి:** రాబోయే రోజుల్లో పౌరులు తమకు సంబంధించిన ధృవీకరణ పత్రాలేవీ భౌతికంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉండబోదని, తమ మొబైల్ ఫోన్లోనే అన్ని పత్రాలు డిజిటల్ రూపేణా పొందుపరచవచ్చని, ఆ దిశగా ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర ఐటీ మరియు ఆర్టీజీ శాఖ కార్యదర్శి భాస్కర్ కాటంనేని తెలిపారు. దీనికోసం ప్రతి పౌరుడికి ప్రత్యేకంగా డిజీ లాకర్ సదుపాయం కల్పించున్నామన్నామని వెల్లడించారు. ప్రభుత్వంలోని వివిధ శాఖల మధ్య డేటా అనుసంధాన ప్రక్రియ గురించి అన్నీ శాఖలు, విభాగాధిపతులతో రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) శుక్రవారం సచివాలయంలో ఒక సమీక్షా సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో భాస్కర్ కాటంనేని మాట్లాడుతూ ప్రభుత్వంలో ఇప్పటికీ కూడా ఒక సింగిల్ సోర్స్ ఆఫ్ డేటా అనేది లేదన్నారు. ఆయా శాఖల్లో చాలా డేటా ఉన్నప్పటికీ అది ఇప్పటికి కూడా ఒకచోట అనుసంధానం కాలేదని, దానివల్ల పౌరులకు ప్రభుత్వం అందించే సేవలు మరింత సమర్థవంతంగా అందించడానికి సాంకేతిక అవరోధాలు ఏర్పడుతున్నాయన్నారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగేపని లేకుండా పౌరులకు వారికి కావాల్సిన అన్ని సేవలు వారి చేతిలోని మొబైల్ ఫోన్ ద్వారానే అందించాలన్నది ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయమన్నారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ఆర్టీజీఎస్ ఒక పెద్ద డేటా లేక్‌ను ఏర్పాటు చేస్తోందన్నారు. దీనిద్వారా రాష్ట్ర ప్రభుత్వంలోని అన్ని శాఖల్లో ఉన్న డేటాను ఈ డేటా లేక్‌తో అనుసంధానం చేస్తామని, తద్వారా పౌరులకు డిజిటల్ సేవలు మరింత మెరుగ్గా అందించే సదుపాయం కల్పిస్తామన్నారు. పౌరులెవ్వరు కూడా తమకు ప్రభుత్వం నుంచి కావాల్సిన సర్టిఫికెట్ల కోసం ఏ కార్యాలయానికి, ఏ అధికారి వద్దకు వెళ్లకుండా కేవలం తమ వద్ద ఉన్న సెల్ ఫోన్ ద్వారనే ఇట్టే సులభంగా పొందేలా చేయాలన్నదే ప్రభుత్వ ఆశయమన్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వం ఇటీవలే వాట్సాప్ గవర్నెన్స్ ప్రారంభించిందన్నారు. దీనికోసం మెటా సంస్థతో ప్రభుత్వం అవగాహన ఒప్పందం చేసుకుందని తెలిపారు. ప్రస్తుతం వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా 161 సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. రానున్న రోజుల్లో ప్రజలకు కావాల్సిన అన్ని సేవలు, అన్ని రకాల ధృవీకరణ పత్రాలు ఇందులో పొందే సదుపాయం కల్పిస్తుందన్నారు. ఒక పౌరుడు తనకు సంబంధించిన విద్యార్హత, కుల, ఆదాయ, జనన, మరణ తదితర ధృవీకరణ పత్రాలన్నీ కూడా వాట్సాప్ ద్వారానే డౌన్ లోడు చేసుకోవచ్చని ఎవరి వద్దకు తిరగాల్సిన పని ఉండబోదన్నారు. అలాగే రాబోయే రోజుల్లో పౌరులు తమకు సంబంధించి సర్టిఫికెట్లను భౌతికంగా తమతో తీసుకెళ్లాల్సిన అసవరం ఉండబోతదని, తమ చేతిలోని మొబైల్ ఫోన్లోనే ఆ సర్టిఫికెట్లను డౌన్ లోడు చేసుకుని పొందుపరచవచ్చన్నారు.



# బైకుల చోరీ ముఠా అరెస్ట్

## - 56 మోటార్ సైకిళ్ల స్వాధీనం

**నెల్లూరు క్రైమ్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త :** వ్యసనాలు ఒకటి చేశాయి. చెడు వ్యసనాలకు బానిసై నలుగురు ఒక ముఠాగా ఏర్పడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న ఈ ముఠాను నెల్లూరు జిల్లా పోలీసులు పట్టుకున్నారు. ముఠా కదలికలపై నిఘా ఉంచిన నెల్లూరు సీసీఎస్, కొడవలూరు పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి 56 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం నెల్లూరు ఉమేష్‌చంద్ర సమావేశ మందిరంలో ఎస్పీ జి. కష్ణకాంత్ నిందితుల వివరాలను వెల్లడించారు. ఆయన పేర్కొన్న సమాచారం మేరకు అల్లూరు మండలం నార్త్ ఆమలూరుకు చెందిన ఎ.శివ చెడువ్యసనాలకు బానిసయ్యాడు. 2017లో హత్యాయత్నం కేసులో పోలీసులు అతనిని అరెస్ట్‌చేసి జైలుకు పంపారు. బెయిల్‌పై బయటకు వచ్చిన అతడు తన చిన్నమ్మ కుమారుడైన రవిదుర్గతోకలిసి బైక్ దొంగతనాలు చేస్తూ పోలీసులకు చిక్కి ఇద్దరూ జైలుపాలయ్యారు. అనంతరం పాతనేరస్థులైన అల్లూరు మండలం చవటపాలెం గ్రామానికి చెందిన కె. నాని, హోసన్నలను కలుపుకుని ముఠాగా ఏర్పడి రాష్ట్రం లోని పలు జిల్లాలో బైక్ దొంగతనాలకు పాల్పడసాగారు. ఇటీవల బైక్ దొంగతనాలు అధిక మైన నేపథ్యం లో జిల్లా ఎస్పీ జి. కష్ణకాంత్ ఆదేశాల మేరకు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్లు సిహెచ్ సీతారామయ్య, అశోక్, కొడవలూరు సిఐ సురేంద్రబాబు తమ సిబ్బందితో ప్రత్యేక బృందంగా ఏర్పడి బైక్ దొంగతనాలు, నిందితుల కదలికలపై నిఘా ఉంచారు. ఈనెల ఆరోతేదిన వారు కొడవలూరు మండలం పద్మనాభ సత్రం వద్ద వాహనతనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన నిందితులను అదుపులోకి తీసుకుని విచారించారు. నెల్లూరు జిల్లాలో 24, తిరుపతి జిల్లాలో 21, ప్రకాశం జిల్లాలో 8, బాపట్ల, వైఎస్సార్ కడప, తూర్పు గోదావరి జిల్లాల్లో మూడు బైక్‌లు మొత్తంగా రూ. 30లక్షలు విలువచేసే 56 బైక్‌లను దొంగలించినట్లు నిందితులు అంగీకరించడంతో వారిని అరెస్ట్ చేశారు. వారి వద్దనుంచి బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. కేసుల చేధనలో ప్రతిభ కనపరిచిన సీసీఎస్, కొడవలూరు సిఐలతో పాటు కొడవలూరు, విడవలూరు, సీసీఎస్ ఎస్ఐలు కోటిరెడ్డి, నరేష్, వెంకటాద్రి నాయుడుతో పాటు వారి సిబ్బందిని ఎస్పీ అభినందించి నగదుప్రోత్సాహకాలను అందజేశారు. ఈ సమావేశంలో ఎఎస్పీ సిహెచ్ సౌజన్య, నెల్లూరు, డిఎస్పీలు పి. సింధుప్రియ, శ్రీనివాసరావు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్‌లు సీతారామయ్య, అశోక్ కుమార్, కొడవలూరు సిఐ సురేంద్రబాబు, ఎస్ఐలు పాల్గొన్నారు.

# విజయవాడ రైల్వే డివిజన్‌లో ట్రాక్‌ల ఆధునీకరణ..

## 130 కి.మీ వేగంతో ప్రయాణం

**విజయవాడ,ఫిబ్రవరి 7,ప్రభాతవార్త ప్రతినిధి:** ట్రాక్ మౌలిక సదుపాయాలను ఆధునీకరించడంలో విజయవాడ రైల్వే స్టేషన్ పనులను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా 1287.76 కిలోమీటర్ల మేర ట్రాక్‌ను గంటకు 130 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేలా అప్‌గ్రేడ్ చేసే పనులను ముమ్మరం చేసింది. గంటకు 130 కిలోమీటర్ల వేగంతో రైళ్ళు ప్రయాణించేలా డివిజన్ పరిధి లోని 58 శాతం ట్రాక్ ప్రస్తుతం అందుబాటులోకి వచ్చినట్లు రైల్వే అధికారులు తెలిపారు. నిడదవోలు- భీమవరం, రసాపూర్-గుడివాడ-మచిలీపట్నం,కాకినాడ పోర్టు-సామర్ల కోట మార్గంలో 473.4 కిలోమీటర్ల మేర ట్రాక్‌ను అప్‌గ్రేడ్ చేసినట్లు సీనియర్ డివిజనల్ ఇంజనీర్ వరుణ్‌బాబు వెల్లడించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 129 కి.మీల మీర స్లీపర్ రెన్యువల్,164 కి.మీల మేర రైల్ రెన్యువల్ సాధించినట్లు వరుణ్‌బాబు తెలిపారు. పీక్యూఆర్ఎస్,టీఆర్‌టీ మెషీన్లను ఉపయోగించి త్వరితగతిన ఆధునీకరణ పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. కీలకంగా పనిచేసిన సిబ్బందిని ఈ సందర్భంగా విజయవాడ డిఆర్ఎం నరేంద్రపాటిల్ అభినందించారు.

# దుర్గమ్మ ఆలయంలో వైభవంగా శ్యామలా నవరాత్రుల పూర్ణాహుతి

**ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త :** దుర్గమ్మ వారి ఆలయంలో మాఘమాసం శుద్ద పాడ్యమి నుండి నిర వ్రహిస్తున్న శ్యామలా నవరాత్రులకు సంబంధించిన పూర్ణాహుతిని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. వేదపండితులు మంత్రోచ్చారణల నడుమ పూర్ణాహుతి, పూజాదికాలు నిర్వహించారు.



మంత్రి బిసి జనార్దనరెడ్డి దంపతులకు దుర్గమ్మవారి జ్ఞాపిక అందిస్తున్న డిప్యూటి ఇఓ ఎం

**- దుర్గమ్మవారి సేవలో మంత్రి జనార్ధనరెడ్డి :**

దుర్గమ్మవారిని శుక్రవారం రాష్ట్ర మంత్రి బిసి జనార్ధన రెడ్డి దంపతులు దర్శించుకున్నారు. వారికి దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలను డిప్యూటి ఇఓ ఎం రత్నరాజు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనం పలికారు.

**- మాఘమాసంలో లోకకళ్యాణార్ధం సూర్యోపాసన సేవ:** దుర్గమ్మ ఆలయంలో లోకకళ్యాణార్ధం మాఘమాసం సందర్భంగా వేదోక్తంగా నిర్వహించే సూర్యోపాసన సేవలో పాల్గొనాలని ఇఓ తెలిపారు. ఈ మాఘమాసంలో సూర్యోపాసన సేవలను ఈనెల 8వ తేదీ శనివారం భీష్మఏకాదశి, 9వ తేదీ ఆదివారం మాఘశుద్ద ద్వాదశి, 12వ తేదీ మాఘమాస పూర్ణిమ, 16 ఆదివారం, 23వ తేదీ ఆదివారం, 24 సోమవారం బహుళ ఏకాదశి, 26 బుధవారం మాఘబహుళ చతుర్థశి పర్వదినాల్లో ఉదయం 8 గంటలకు అరుణ పారాయణ, సూర్యనమస్కారాలు, ఆదిత్యహృదయం, సూర్యాష్టకం పఠిస్తూ పండితులు పూజాదికాలు నిర్వహిస్తారని, రు.1000ల ఉభయంతో దంపతులు పూజలో పాల్గొనవచ్చని తెలిపారు. దుర్గమ్మవారి ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదానపథకానికి రు.1లక్ష విరాళాన్ని విజయవాడచు చెందిన గోలీ శ్రీనివాసరావు దంపతులు విరాళంగా అందించారు. వారికి దుర్గమ్మ దర్శన ఏర్పాట్లు చేసిన తదుపరి దుర్గమ్మవారి మెమంటో, ప్రసాదం, శేషవస్త్రంలను డిప్యూటి ఇఓ ఎం రత్నరాజు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

# మంగళగిరి ఎయిమ్స్ అభివృద్ధికి పూర్తి సహకారం

## మంత్రిని కలిసిన నూతన ఎయిమ్స్ డైరెక్టర్

**సచివాలయం. ఫిబ్రవరి 7. ప్రభాతవార్త.** ప్రతిష్టాత్మక మంగళగిరి ఎయిమ్స్‌ను దేశంలోనే అత్యున్నత స్దాయికి తీసుకెళ్లేందుకు కూటమి ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలందిస్తుందని నూతన ఎయిమ్స్ డైరెక్టర్ ఆచార్య అహంతేమ్ శాంతాసింగ్‌కు వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ హామి ఇచ్చారు. శుక్రవారం సచివాలయంలో మంత్రి సత్యకుమార్ యాదవ్‌ని నూతన ఎయిమ్స్ డైరెక్టర్ ఆచార్య అహంతేమ్ శాంతాసింగ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్బంగా మంత్రి మాట్లాడుతూ భౌగోళికంగా మంగళగిరిలోని సుందరమైన, ఆహ్లాదభరితమైన కొండల నడుమ ఎయిమ్స్‌ను కేంద్ర ప్రభుత్వం నెలకొల్పిందన్నారు. 2018లో ప్రారంభమైన దీనికి గత ప్రభుత్వ హయంలో మంచి నీటి సౌకరాన్ని కూడా కల్పించలేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ సమస్యను పరిష్కరించిందన్నారు. అలాగే ప్రత్యామ్నాయా విద్యుత్ సరఫరాను కూడా కల్పించిందన్నారు. 183 ఎకరాల్లో ఏర్పాటైన ఎయిమ్స్‌లో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటుకు స్దలం లేనందున, కొలనుకొండలో 10 ఎకరాల స్దలాన్ని మంజూరు చేసేందుకు సీఎం చంద్రబాబు ఇటీవలే ఆదేశాలిచ్చారన్నారు. త్వరితగతిన ట్రామాకేర్ సెంటర్‌ను నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే 965 పడకల ఆసుపత్రిగా మంజూరైన ఎయిమ్స్‌లో ప్రస్తుతం 650 పడకలున్నాయని,

విస్తరణకు తగు చర్యలు తీసుకోవాలని నూతన ఎయిమ్స్ డైరెక్టర్ ఆచార్య అహంతేమ్ శాంతాసింగ్‌కు వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ సూచించారు. మంగళగిరి ఎయిమ్స్ అభివృద్ధికి భవిష్యత్‌లో అన్ని విధాల సహకరించేందుకు కూటమి ప్రభుత్వం సిద్దంగా ఉందన్నారు.

# వివేకా హత్య కేసులో అప్రూవర్ దస్తగిరి విచారణకు హాజరు!

## కేసు పై దృష్టి పెట్టిన కూటమి పెద్దలు

పులివెందుల, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త :

మాజీమంత్రి వై.ఎస్ వివేకా నందరెడ్డి హత్య కేసులో అప్రూవర్ గా వున్న షేక్ దస్తగిరి కడప సెంట్రల్ జైలులో శుక్రవారం విచారణకు హాజరయ్యారు.

కడప సెంట్రల్ జైలులో షేక్ దస్తగిరిని ఏడాది క్రిందట పెట్టిన ప్రలోభాలు, ఇబ్బందులు, బెదిరింపులు ఘటన పై రాష్ట్ర ప్రభుత్వం విచారణకు ఆదేశించిన నేపథ్యంలో విచారణ కడపలో ప్రారంభం అయింది. షేక్ దస్తగిరి ఓ అట్రాసిటీ కేసులో 2023 అక్టోబరు నుండి 2024 ఫిబ్రవరి వరకు కడప సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా వున్న సందర్భంలో వివేకానందరెడ్డి హత్య కేసులో ఏ 5 గా వున్న దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి కుమారుడు డాక్టర్ దేవిరెడ్డి చైతన్యరెడ్డి(ఏ1) అప్పటి సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ ప్రకాష్ (ఏ 2), జమ్మలమడుగు డి.ఎస్పీ నాగరాజు(ఏ 3), ఎర్రగుంట్ల సి.ఐ ఈశ్వరయ్య(ఏ 4)లు తనను బెదిరించారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పట్లో వై.సి.పి ప్రభుత్వం అధికారంలో వుండడంతో అప్పటి అధికారులు పట్టించుకోలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ కేసు విచారణ వేగవంతం చేశారు. దస్తగిరి ఫిర్యాదు మేరకు ఈనెల 3వతేదీ ఆ నలుగురి పై పులివెందుల పోలీసు స్టేషన్ లో కేసు నమోదు చేశారు. దస్తగిరి తన ఫిర్యాదులో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో కడప సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా వున్న తనను 2023 నవంబరు 28న జైల్ లోని ఎస్ ఎస్.ఆర్ బ్యారక్ లోకి డాక్టర్ చైతన్యరెడ్డి వచ్చి తాను వివేకా హత్య కేసులో అప్రూవర్ గా మారినందున వివేకాహత్య కేసులో వై.ఎస్ అవినాష్ రెడ్డి, వై.ఎస్ భాస్కర్ రెడ్డి, డి శివశంకర్ రెడ్డిలు ఇబ్బందులు పడుతున్నారని, వారికి అనుకూలంగా సాక్ష్యం చెప్పాలని బెదిరించారని, అప్పటి సిబిఐ అధికారి రామ్ సింగ్ కు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పాలని ప్రలోభ పెట్టారని, తమకు అనుకూలంగా మాట్లాడితే రూ.20 కోట్లు ఇస్తామని ఆఫర్ ఇచ్చారని అప్పట్లో దస్తగిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఒక వేళ మేము చెప్పినట్లు వినకపోతే జైలు నుండి బయటకు వచ్చిన తర్వాత నిన్ను చంపుతామని బెదిరించారని దస్తగిరి పోలీసులకు ఫిర్యాదులో తెలిపారు.చైతన్యరెడ్డి తనను బెదిరించే సమయంలో అప్పటి జైలు సూపరింటెండెంట్ ప్రకాష్ వారించలేదని ఫిర్యాదు చేశారు.జైలు సూపరిం టెండెంట్ వారం రోజుల పాటు చీకటి గదిలో బంధించారని ఫిర్యాదు చేశారు. అలాగే తనను అప్పటి జమ్మలమడుగు డి.ఎస్పీ నాగరాజు, ఎర్రగుంట్ల సి.ఐ ఈశ్వరయ్యలు బెదిరించారని పోలీసులకు ఫిర్యాదు చేశారు.ప్రభుత్వం ఈ సంఘటనకు సంబంధించి విచారణ అధికారిగా రాజమండ్రి సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ రాహూల్ శ్రీరామ్ ను విచారణ అధికారిగా నియమించింది. ఈ మేరకు ఆయన గురువారం సాయంత్రం కడప సెంట్రల్ జైలుకు చేరుకున్నారు. శుక్రవారం ఉదయం కడప సెంట్రల్ జైలులో రాహూల్ శ్రీరామ్ షేక్ దస్తగిరిని 3 గంటల పాటు విచారించారు. రాహూల్ శ్రీరామ్ ఎవరెవరు నీకు బెదిరించారు, ఏమి ఇబ్బందులకు గురి చేశారు, ఏ ఏ అధికారి నిన్ను ఇబ్బందులకు గురి చేశారో అనే కోణంలో దస్తగిరిని విచారించి వాంగ్మూలం నమోదు చేశారు. అలాగే ఆ సమయంలో పని చేసిన సిబ్బందిని కూడ విచారించినట్లుతెలిసింది. షేక్ దస్తగిరి 2023 నవంబరు 28న ఎస్.ఎఎస్.ఆర్ బ్యారక్ లో జరిగిన సంఘటన కు సంబంధించి పూర్తి వివరాలను విచారణ అధికారికి వివరించినట్లు తెలిసింది. తనను అన్యాయంగా అధికారులు కేసులో ఇరికించి ఇబ్బంది పెట్టిన వైనాన్ని ఆయన వివరించినట్లు తెలియ వచ్చింది. విచారణ అనంతరం దస్తగిరి సెంట్రల్ జైలు వద్ద విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 3వ తేదీన నలుగురి పై నమోదైన కేసుకు సంబంధించి విచారణకు హాజరు కావాలని విచారణ అధికారి ఆదేశించడంతో విచారణకు వచ్చాను అన్నారు.

# మరో వివాదంలో చిక్కుకున్న ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు

**విజయవాడ,ఫిబ్రవరి7,ప్రభాతవార్తప్రతినిధి:** ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మరో వివాదంలో చిక్కుకున్నారు. కొలికపూడి వేధింపులు తాళలేక డేవిడ్ అనే టీడీపీ కార్యకర్త ఆత్మహత్యాయత్నం చేశాడు. పార్టీ కోసం కష్టపడిన తనని అక్రమ కేసులతో ఎమ్మెల్యే వేధిస్తున్నారంటూ బాధితుడు ఆత్మహత్యకు యత్నించాడు. ఆత్మహత్యకు గల కారణాలను వివరిస్తూ సెల్ఫీ వీడియో తీసుకున్నాడు. తనను ఏ విధంగా ఎమ్మెల్యే వేధింపులకు గురి చేస్తున్నారో చెబుతూ వీడియో రికార్డు చేసిన అనంతరం పురుగులమందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు డేవిడ్‌ను చికిత్స నిమిత్తం హుటాహుటిన విజయవాడకు తరలించారు. అయితే బాధితుడి సెల్ఫీ వీడియో బయటకు రాకుండా కొలికపూడి గురువారం రోజున అందరినీ బెదిరించాడంటూ పెద్దఎత్తున ఆరోపణలు వస్తున్నాయి. వీడియో ఆలస్యంగా వెలుగులోకి వచ్చినప్పటికీ సోషల్ మీడియాలో తెగ వైరల్‌గా మారింది. ఇప్పటికే వరస వివాదాలతో అధిష్ఠానానికి కంటిలో నలుసుగా కొలికపూడి తీరు మారింది. కాగా, గతంలోనూ పలు వివాదాల్లో చిక్కుకున్న ఎమ్మెల్యే కొలికపూడిపై టీటీపీ అధిష్ఠానం సీరియస్ అయ్యింది. టీటీడీ క్రమశిక్షణ కమిటీ ఎదుట హాజరుకావాలంటూ ఆదేశాలు జారీ చేసింది. అయినా ఎమ్మెల్యే తీరులో మాత్రం మార్పు రాలేదు.గతేదాడి ఓ ప్రైవేటు కార్యక్రమం నిమిత్తం ఎమ్మెల్యే కొలికపూడి ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు మండలం గోపాలపురం గ్రామానికి వెళ్లారు. ఇద్దరి అన్నదమ్ముల స్థల వివాదంలో తలదూర్చిన ఆయన.. భూక్యా కృష్ణ, చంటి దంపతులపై దాడి చేశారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన బాధితురాలు పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీంతో ఆమెను హుటాహుటిన విజయవాడకు తరలించారు. అలాగే తన సొంత నిధులతో కాలువలు తవ్వించానని, కుక్కలకు ఉన్న విశ్వాసం రైతులకు లేకుండా పోయిందంటూ ఎమ్మెల్యే వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఇవి కాస్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

# మేనకోడలు, మేనలుడి ఆస్తులు కాజేయాలని జగన్ కుట్ర!

## పిసిసి అధ్యక్షురాలు షర్మిల సంచలన వ్యాఖ్యలు

**విజయవాడ,ఫిబ్రవరి7,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డిపై ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. వైసీపీకి ఇటీవల రాజీనామా చేసిన మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి ని కలిసి అనేక అంశాలు చర్చించినట్లు ఆమె తెలిపారు. తనపై అన్న జగన్ చేసిన కుట్రలు సాయిరెడ్డి చెప్తుంటే విని కన్నీళ్లు పెట్టుకున్నట్లు షర్మిల వెల్లడించారు. జగన్ తనపై చేసిన అరాచకాలు, తన క్యారెక్టర్‌ను కించపరిచేలా చేయించిన వ్యాఖ్యలు తెలుసుకుని నిర్ఘాంతపోయినట్లు చెప్పుకొచ్చారు. చట్టప్రకారం తనకు రావాల్సిన వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆస్తులను జగన్ ఎలా దోచేయాలని చూశారో తెలిసి తీవ్ర మనోవేదనకు గురైనట్లు షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏపీసీసీ చీఫ్ షర్మిల మాట్లాడుతూ.. "విజయసాయిరెడ్డిని కలిసి చాలా అంశాలు మాట్లాడాం. జగన్ మోహన్ రెడ్డి వల్ల పడిన ఇబ్బందుల గురించి ఆయన చెప్పారు. సాయిరెడ్డి అనేక విషయాలు చెప్పినప్పటికీ నేను కేవలం నా బిడ్డలకు సంబంధించిన విషయాలు మాత్రమే చెబుతున్నా. వైఎస్ ఆస్తులకు సంబంధించి షేర్స్ తనకే చెందాలంటూ జగన్.. నాపై, తల్లి విజయలక్ష్మిపై కేసు వేశారు. అందుకే ఆస్తుల గురించి వైఎస్ ఆనాడు అన్న మాటలు గతంలో మీడియాకు చెప్పా. అప్పుడు విజయసాయిరెడ్డితో జగనే ప్రెస్ మీట్ పెట్టించి నా మాటలు అబద్ధాలని చెప్పించారు. ఆ తర్వాత వైవీ సుబ్బారెడ్డి, విజయసాయిరెడ్డి మాటలు అబద్ధమని మా అమ్మ విజయలక్ష్మి లేఖ రాసి మరీ చెప్పారు. ఆ తర్వాత కూడా విజయసాయిరెడ్డిపై జగన్ ఒత్తిడి తెచ్చారంట. ఆయన అంగీకరించకుంటే సుబ్బారెడ్డితో మాట్లాడించారు. అనంతరం జగన్ మళ్లీ విజయసాయిరెడ్డిని పిలిపించారు. 40 నిమిషాలపాటు జగనే స్వయంగా విజయసాయిరెడ్డికి డిక్టేట్ చేశారంట. ఎలా చెప్పాలి, నాపై ఏం మాట్లాడలో ఆయనే మొత్తం వివరించారంట. ఆ తర్వాత సాయిరెడ్డి ప్రెస్ మీట్ పెట్టకపోవడంతో జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారంట. వైఎస్ కోరికకు భిన్నంగా అబద్ధం చెప్పాలని విజయసాయిరెడ్డిపై ఒత్తిడి చేశారు. నా పరువు పోతుందని.. వదిలేయండని సాయిరెడ్డి చెప్పినా జగన్ ఊరుకోలేదట. ఏ అబద్ధాలు ఎలా చెప్పాలో జగన్ చెబితే విజయసాయి రెడ్డి రాసుకున్నారంట.ఈ విషయాలను విజయసాయి రెడ్డే నాకు స్వయంగా చెప్పారు. ఇవన్నీ పల్లు పోకుండా సాయిరెడ్డి చెప్పిన మాటలే. ఈ విషయాలు విని నా కళ్ల వెంట నీళ్లు వచ్చాయి. ఇదీ జగన్ మోహన్ రెడ్డి మహోన్నతమైన క్యారెక్టర్. వైఎస్ బిడ్డ, తోడబుట్టిన చెల్లి అని కూడా చూడకుండా జగన్ దిగజారిపోయి వ్యవహరించారు. నా క్యారెక్టర్‌పై ఇంత నీచంగా మాట్లాడించారు. ఇటీవల ఆయన క్యారెక్టర్ గురించి పెద్దపెద్ద డైలాగులు చెబుతున్నారు. అసలు క్యారెక్టర్ అంటే ఏంటో జగన్ మరచిపోయారు. సొంత మేనకోడలు, మేనల్లుడు ఆస్తులు కాజేయాలని ఇంత కుట్రలు చేశారు. జగన్, అతని భార్య బైబిల్ ముందు కూర్చుని ఎంత దిగజారిపోయారో ఆలోచన చేయాలి. నా పిల్లలకు మీ ముఖం చూపించే ధైర్యం ఉందా?" అంటూ షర్మిల ప్రశ్నించారు.

# బిటెక్ విద్యార్థిని ఆత్మహత్య

**వికారాబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** బిటెక్ విద్యార్థిని ఉరి వేసుకుని ఆత్మ హత్య చేసుకున్న సంఘటన వికారాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కుల్కచర్ల మండలం ముజాహిద్‌పూర్ గ్రామానికి చెందిన క్షీరసాగర్ సత్యనారాయణ పిల్లల చదువు నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి వికారాబాద్ పట్టణంలోని గాంధీ కాలనీలో అద్దెకు ఇల్లు తీసుకుని నివాసం ఉంటున్నాడు. సత్యనారాయణ కూతురు జ్యోతి హైదరాబాద్ నగరంలో ఓ కళాశాలలో బీటెక్ చదువుతుంది. ఇదిలా ఉండగా, సత్యనారాయణ దగ్గరి బంధువులకు సంబంధించి పెళ్ళి ఉండటంతో కుటుంబ సభ్యులందరు వారి స్వగ్రామమైన ముజాహిద్‌పూర్‌కి ఈ నెల 5న వెళ్ళారు. కూతురు జ్యోతి తనకు పరీక్షలు ఉన్నాయని, చదువుకోవాలని చెప్పి 6వ తేదీన వికారాబాద్‌కు తిరిగి వచ్చింది. బంధువుల పెళ్ళికి కావాల్సిన బట్టలు వికారాబాద్‌లోని అద్దె రూమ్‌లో ఉండటంతో సత్యనారాయణ కుటుంబంతో సహా తిరిగి వికారాబాద్‌కు శుక్రవారం ఉదయం వచ్చారు. ఎంతసేపు కూతురు జ్యోతి ని పిలువగా తలుపులు తెరవకపోవడంతో అనుమానం వచ్చి తలుపులు బద్దలు కొట్టి తెరిచి చూశారు. కూతురు జ్యోతి(19) ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకోవడాన్ని చూసిన తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతురాలి తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ భీమకుమార్ తెలిపారు.

### ఉరివేసుకుని టెన్త్ విద్యార్థిని ఆత్మహత్య

**హైదరాబాద్ (ఉప్పల్), ఫిబ్రవరి 7, ప్రభాతవార్త :** ఉరివేసుకుని పదో తరగతి చదవుతున్న ఒక విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ కోటేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. రామంతాపూర్ ఇందిరానగర్‌లో నివసించే నీలం విజయ్‌కుమార్, పావనిలకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె నీలం పవిత్ర (15) రామంతాపూర్‌లోని ఒక ప్రైవేటు స్కూల్‌లో పదో తరగతి చదువుతోంది. అయితే శుక్రవారం ఉదయం పదిన్నర సమయంలో తల్లి పావని తన కుమార్తె పవిత్రను స్కూల్ నుంచి ఇంటికి తీసుకుని వెళ్లి మెటిమలు వస్తున్నాయని ఆసుపత్రి తీసుకెళ్లి చూయించింది. అనంతరం తిరిగి 12.30 గంటల ప్రాంతంలో ఇంటి వద్ద వదిలి బ్యాంక్ పని మీద బయటికి వెళ్లినట్లు పోలీసులు తెలిపారు. తిరిగి వచ్చి చూసే సరికి ఇంట్లో ఫ్యాన్‌కు విద్యార్థిని పవిత్ర ఉరివేసుకుని కనిపించిందని తెలిపారు. దీంతో వెంటనే స్థానికుల సహాయంతో కిందకు దింపు చూడగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు.

# తీన్మార్ మల్లన్నపై కామారెడ్డిలో కేసు నమోదు

**హైదరాబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** ఎంఎల్‌సి తీన్మార్ మల్లన్నపై మరో కేసు నమోదయింది. మల్లన్న తమ కులాన్ని దూషించడంతోపాటు కించపరుస్తూ ప్రసంగం చేశారని ఆరోపిస్తూ కామారెడ్డి జిల్లా బాన్సువాడ పోలీసు స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదయింది. రెడ్డి సంఘం సభ్యులు చేసిన ఫిర్యాదు మేరకు బాన్సువాడ పోలీసులు ఈ కేసును నమోదు చేశారు.

# నేతకానీలకు ప్రత్యేక గ్రూప్ కేటాయించాల్సిందే

## ఎమార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ, మాజీ ఎంపి వెంకటేష్ నేత

**హైదరాబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కులాల జనాభాను తప్పుల తడకగా భావిస్తూ నేతకాని సమాజాన్ని తక్కువ జనాభాగా చూపించడం జరిగిందని నేతగాని కులస్తులు నిరసన తెలియజేస్తున్నారు. ఈనేపథ్యంలో శుక్రవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ నందు నేతకాని కులసంఘాల ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రకటనపైన 'నేతకానిల నిరసన గలం' పేరుతో పాత్రికేయుల సమావేశాన్ని" నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ, మాజీ ఎంపి వెంకటేష్ నేతలు హజరై మాట్లాడారు.ఎస్సీ కులాలలో అధిక జనాభాను కలిగిన మూడవ పెద్ద కులం నేతకానిలకు కులగణనలో తీవ్ర అన్యాయం చేశారని మండిపడ్డారు. వాస్తవలెక్కులను దాచిపెట్టి అశాస్త్రీయంగా తక్కువ సంఖ్యను ప్రపంచానికి తెలియజేస్తూ న్యాయబద్ధంగా చట్టబద్ధంగా రావలసిన వాటాను అందించకుండా కుట్రలు చేశారన్నారు.

మాల ద్వారానే ప్రభుత్వం మాపట్ల అణచివేత ధోరణి ప్రదర్శించి తీవ్ర అన్యాయం చేశారని మండిపడ్డారు. మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ నేతకానిలకు అన్యాయం జరిగిన మాట వాస్తవమేనని వారి న్యాయబద్ధ పోరాటానికి ఎమ్మార్పీఎస్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని భవిష్యత్తులో వాస్తవ జనాభాను తెలియజేసి వారి వాటాను వారు కేటాయించాల్సిందిగా ప్రభుత్వంపై పోరాటం చేస్తామన్నారు. నేతకాని విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు సాయిని ప్రసాద్ నేత మాట్లాడుతూ ఈ రిజర్వేషన్ వర్గీకరణ ద్వారా భవిష్యత్తు అంధకారమైందన్నారు.

# ముంబయిలో ఆగని డ్రగ్స్ స్మగ్లింగ్

## ఎన్‌సిబి దాడిలో రూ.200 కోట్ల కొకైన్, హైబ్రిడ్ గంజాయి జప్తు

**హైదరాబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** దేశ ఆర్థిక రాజధాని ముంబాయిలో డ్రగ్స్ దందాలు ఆగడం లేదు. ఓవైపు పోలీసులు మరోవైపు కోస్ట్ గార్డ్ ఇంకోవైపు నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సిబి) వరుసగా దాడులు చేస్తున్నా మాదకద్రవ్యాల స్మగ్లింగ్ ముఠాల కార్యకలాపాలు యధేచ్ఛగా కొనసాగుతూనే వున్నాయి. తాజాగా శుక్ర వారం నవీ ముంబాయిలో 200 కోట్ల రూపాయల విలువ చేసే కొకైన్, హైబ్రీడ్ గంజాయిని జప్తు చేశారు. ఈ సందర్భంగా నలుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. నెల రోజుల క్రితం ముంబాయి తీర ప్రాంతంలో ఓ పడవలో 200 గ్రాముల కొకైన్ లభ్యం కాగా దీనిపై విచారణ జరిపిన ఎన్‌సిబి అధికారులు నవీ ముంబ యిలో ఓ ప్రాంతంలో దాచి వుంచిన 11.54 కిలోల నాణ్యమైన కొకైన్‌తోపాటు 5.5 కిలోల హైబ్రీడ్ గంజాయిని జప్తు చేశారు.

గంజాయిని 200 ప్యాకెట్లలో ప్యాకింగ్ చేసి వుండ గా పట్టుకున్నారు. పట్టుబడ్డ మాదకద్రవ్యాల విలువ అంతర్జాతీయ మార్కెట్‌లో 200 కోట్ల రూపాయలుగా తేలింది. కొకైన్, హైబ్రీడ్ గంజాయి అమెరికా నుంచి కొరియ ర్‌లో పార్శిల్ ద్వారా ముంబాయి వచ్చినట్లు తేలింది.

8-2pg7exHMNWJQE.qxd:8-2pg7exHMNWJQE.qxd 01/01/01 9:25 AM Page 1



# ట్రంప్‌కు భయపడుతున్న విశ్వగురువు




శుక్రవారం గాంధీభవన్ వద్ద భారీ నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపి విహెచ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షీ, షబ్బీర్‌అలీ తదితరులు

## ఇజ్రాయెల్ యుద్ధం ఆపిన మోడీ వలసవెళ్లిన భారతీయుల ఇక్కట్లను ఆపలేరా?: ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

**హైదరాబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త :** అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు విశ్వగురువుగా ప్రచారం చేసుకొంటున్న భారత ప్రధానమంత్రి భయపడుతున్నారని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ఎద్దేవా చేశారు. శుక్రవారం గాంధీభవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ విదేశాంగ మంత్రి జై శంకర్‌కు దమ్ము లేదు, విదేశాంగ మంత్రి పూర్తిగా విఫలమయ్యారు అని ఆవేదన చెందారు. విశ్వ గురువులు భయపడుతారా?కానీ ఏం బలహీనతతో ట్రంప్ కి మోదీ భయపడుతున్నారు అని అన్నారు. రష్యా, ఉక్రెయిన్ దాడులను ఆపేవాళ్ళు అమెరికాలో ఉన్న మనవాళ్ళని తీసుకురాలేరా? అని ప్రశ్నించారు. ట్రంప్ అమెరికా ప్రెసిడెంట్ అయ్యాక ఇండియాకి ఇబ్బంది ఉండదని ప్రచారం చేసారని గుర్తుచేసుకున్నారు. సరైన పత్రాలు లేని104 మంది భారతీయులను అమెరికా ప్రభుత్వం గుర్తించి ఇండియాకు పంపిందని ఆయన తెలిపారు. ఛార్జ్ తీసుకున్నాక ట్రంప్ ఆయన ఫారిన్ పాలసీ క్లియర్ గా చెప్పాడు. అమెరికా కాళ్ళకు చేతులకు సంకెళ్లు వేసి 104 మందిని టెర్రరిస్టుల లాగా తీసుకువచ్చిందని ఆయన వివరించారు. కుంభమేళాను చూపిస్తున్న మోదీ మీడియా 104 మంది పరిస్థితిపై మాట్లాడడం లేదని అన్నారు. మోదీకి ప్రపంచమంతా బయపడుతని బీజేపీ వాళ్లు డబ్బా కొడతారు కానీ దానికి భిన్నంగా జరుగుతోన్నది. ఇజ్రాయెల్ యుద్ధం అపగలిగిన మోదీ అమెరికాలో ఇబ్బంది పడుతున్న వాళ్ళని క్షేమంగా తీసుకరాలేకపోతున్నారని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు విదేశాల్లో ఉన్న జైళ్ల నుండి44,000 మంది ని తెలుగు రాష్ట్రానికి తీసుకువచ్చామని షబ్బీర్ గుర్తుచేసుకొన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ ఉన్నప్పుడు ఇలాంటి పరిస్థితి వస్తే ప్రజలకు ఇబ్బంది లేకుండా చూసుకున్నామని నెమరేసుకొన్నారు. మా హిస్టరీ చూసి కేంద్ర ప్రభుత్వం నేర్చుకోవాలని షబ్బీర్ అలీ హితవు చెప్పారు.

**వలసదారులకు సంకెళ్లు వేయడంపై కాంగ్రెస్ నాయకుల ఆగ్రహం**

అమెరికాలో భారతీయులను అక్రమ వలసదారులుగా పేర్కొంటూ ట్రంప్ ప్రభుత్వం అమనవీయంగా, అవమానకరంగా కాళ్లకు, చేతులకు బేడీలు వేసి ఇండియా పంపిస్తున్న కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడాన్ని నిరసిస్తూ ఏఐసీసీ పిలుపు మేరకు టీపీసీసీ ఆధ్వర్యంలో నాంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి ఫిరోజ్‌ఖాన్ నేతృత్వంలో శుక్రవారం గాంధీ భవన్ వద్ద భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ ఆలీ నాంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జ్ ఫిరోజ్ ఖాన్, మాజీ ఎంపీ విహెచ్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీత రావు ఆధ్వర్యంలో నిరసన చేతులకు బేడీలు వేసుకొని వినూత్న రీతిలో నిరసన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీత రావ్, టీపీసీసీ. సీనియర్ ఉపాధ్యక్షులు కుమార్ రావ్ తదితరులు పాల్గొన్నారు. అమెరికా నుంచి భారత పౌరులను నిర్దాక్షిణ్యంగా బేడీలు వేసి బలవంతంగా తరలిస్తుండడం భారత విదేశంగా మంత్రిత్వ శాఖ వైఫల్యంగా చూడాలని వారు ఆగ్రహం వ్యక్తంచేశారు. భారత పౌరులకు బేడీలు వేసి అమెరికా నుంచి పంపిస్తున్న చలనం లేనట్లు కేంద్రం వ్యహరిస్తుందని దుయ్యబట్టారు. అమానవీయ ఘటనకు మోదీ, బీజేపీ సిగ్గు పడాలి అని ఆరోపించారు. అమెరికాకు గులాంగిరి బంద్ ఖరో అంటూ కాంగ్రెస్ నేతలు నినాదాలు చేశారు.



మల్లు అనంతరాములు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి తదితరులు

## మల్లు అనంతరాములుకు నివాళులర్పించిన సిఎం

**హైదరాబాద్, ఫిబ్రవరి 7,ప్రభాతవార్త:** పిసిసి మాజీ అధ్యక్షుడు మల్లు అనంతరాములు వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి న్యూఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాగర్‌కర్నూల్ ఎంపీగా రెండుసార్లు ఎన్నికైన మల్లు అనంతరాములు ఆ ప్రాంత అభివృద్ధికి ఎంతగానో కృషిచేశారని ముఖ్యమంత్రి కొనియాడారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి దీప్‌దాస్‌మున్షీ, కాంగ్రెస్ నేత రోహిన్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఆర్టీసి యాజమాన్యం, కార్మిక సంఘాలతో లేబర్ కమిషనర్ చర్చలు

### 10న లేబర్ కమిషనర్ ఆఫీసులో భేటీ

**హైదరాబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** ఆర్‌టీసీ సంస్థని ప్రభుత్వంలో విలీనం చేయడంతోపాటు.. ఆర్‌టీసీ పరీరక్షణకు ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం గత నెల జనవరి 27న ఆర్‌టీసీలోని కొన్ని సంఘాలు జేఏసీ పేరుతో సమ్మె నోటిస్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సమ్మె నోటీసు ఇచ్చిన సంఘాలతోనూ అలాగే ఆర్‌టీసీ యాజమాన్యంతోనూ చర్చలు జరపడానికి కార్మిక శాఖ సిద్ధ పడింది. సమ్మె నోటీసు ఇచ్చిన జేఏసీ సంఘాలతోపాటు యాజమాన్యంతో లేబర్ కమిషనర్ ఈ నెల 10(సోమవారం)న సాయంత్రం 4 గంటలకు హైదరాబాద్‌లోని లేబర్ కమిషనర్ ఆఫీస్(అంజయ్య భవన్)లో చర్చలు చేపట్టనుంది. చర్చలకు సంబంధించి హాజరు కావాలని జేఏసీ యూనియన్లకు ఆర్‌టీసీ ఎండీకి జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ శుక్రవారం లేఖలు రాసినట్టు జేఏసీ నాయకులు తెలిపారు. ఆర్‌టీసీ ఉద్యోగులకు ఇచ్చిన ప్రధాన హామీలైన ప్రభుత్వంలో ఆర్‌టీసీ ఉద్యోగుల విలీనం, ట్రేడ్ యూనియన్లపై ఆంక్షలు ఎత్తివేత, 2021 నుంచి వేతన సవరణ చేయాలని కోరుతూ సమ్మె నోటీసును జేఏసీ అందజేసింది. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతాలు, పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని నోటీసులో పేర్కొంది.



కేంద్రమంత్రి పీయూష్‌గోయల్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎంపి ఆర్.కృష్ణయ్య, గుజ్జ కృష్ణ తదితరులు

## బిసిల బడ్జెట్‌ను 2 లక్షల కోట్లకు పెంచండి

### కేంద్రమంత్రి పీయూష్‌గోయల్‌కు ఎంపి ఆర్.కృష్ణయ్య వినతి

**హైదరాబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** కేంద్రంలో బిసిల బడ్జెటు 2లక్షల కోట్లకు పెంచాలని, బిసిలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని, జనగణనలో కులగణన చేపట్టాలని కోరుతూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం కేంద్రమంత్రి పీయూష్ గోయల్ విజ్ఞప్తి చేసింది. ఈమేరకు శుక్రవారం సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం కేంద్రమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి పలుఅంశాలపై చర్చించి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా దేశవ్యాప్తంగా బిసిలు ఎదుర్కొంటున్న సమస్యలు, డిమాండ్లను కేంద్రమంత్రికి వివరించారు. పీయూష్ గోయల్ స్పందిస్తూ బీసీల డిమాండ్ న్యాయమైనవని సంఘం ఇచ్చిన డిమాండ్లపై ప్రత్యేక చొరవ తీసుకుంటామని హామీ ఇచ్చారని కృష్ణయ్య తెలిపారు. ఇప్పటికే కేంద్రం లో 27 మంది బీసీలకు కేంద్ర మంత్రివర్గంలోకి తీసుకోవడం జరిగిందని ఆరు మంది గవర్నర్లను, జాతీయ బీసీ కమిషన్ కు రాజ్యాంగ బద్ధమైన హోదా ఇచ్చామని. బీసీల రిజర్వేషన్లను ఏ,బి,సి,డి వర్గీకరణకు కమిషన్ నియమించాం. ఇక తొందరలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేస్తామని, బీసీలకు పెద్ద ఎత్తున బడ్జెట్ పెంచుతామని హామీ ఇచ్చినట్లు కృష్ణయ్య పేర్కొన్నారు. మంత్రిని కలిసినవారిలో జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, బోను దుర్గ నరేష్, కర్రి వేణుమాధవ్, రాజునేత, మనికంఠ, బీమారపు సురేష్ తదితరులు ఉన్నారు.

## పోలీసుల అదుపులో కీచక ఉపాధ్యాయుడు




పోలీసుల అదుపులో నిందితుడు కృష్ణయ్య

**ధారూరు, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** గత సంవత్సరం డిసెంబరు 13న ధారూర్ స్టేషన్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో విద్యార్థినిలతో అసభ్యంగా ప్రవర్తించిన తెలుగు ఉపాధ్యాయుడుపై తల్లిదండ్రులు ఫిర్యాదు చేయగా, ఫోక్సో చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేసిన విషయం పాఠకులకు విదితమే. ఇప్పటివరకు పరారీలో ఉన్న ఉపాధ్యాయుడు పెద్దగొల్ల కృష్ణయ్యను శుక్రవారం ధారూర్ పోలీసులు వికారాబాద్‌లో అదుపులోకి తీసుకొని రిమాండ్ నిమిత్తం కోర్టుకు హాజరుపరిచినట్లు ధారూరు ఎస్సై వేణుగోపాల్‌గౌడ్ తెలిపారు.

## రిజర్వేషన్‌ల పరిరక్షణకు బిజెపి పోరాడాలి

### పిసిసి మాజీ అధ్యక్షుడు వి.హనుమంతరావు

**హైదరాబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** బిజేపి కి రిజర్వేషన్ ఇవ్వాలని లేదని రిజర్వేషన్ పరిక్షణకోసం బీజేపీ మీద పోరాటం చేయాలని పిసిసి మాజీ అధ్యక్షుడు రాజ్యసభ మాజీ సభ్యులు వి.హనుమంతరావు పిలుపునిచ్చారు. శుక్రవారం గాంధీ భవన్‌లో వి. హనుమంత రావు మాట్లాడుతూ కులగణన చేసి బీసీలకు మేము న్యాయం చేస్తున్నామని అన్నారు. సూర్యాపేట లో రాహుల్ గాంధీ తో సభ పెడుతున్నామని తెలిపారు. ఎస్సి రిజర్వేషన్ చేసినందుకు గజ్వేల్ లో మలికార్జున ఖర్గే తో సభ పెడుతున్నాం అని ఆయన వివరించారు. సీఎం రేవంత్ రెడ్డి బీసీ పక్షపాతి అని విహెచ్ ధృవీకరించారు. సూర్యాపేట, గజ్వేల్ సభకు నా పూర్తి మద్దతు ఉంటుంది అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి కులగణన జరగాలని అసెంబ్లీ లో బిల్ పెట్టారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయ భాస్కర్ రెడ్డి తో సూర్యాపేటలో సభ పెడితే 2లక్షల మంది వచ్చారని గతంను నెమరేసుకున్నారు.

## వ్యవసాయ వర్సిటీకి అమెరికా ఆబర్న్ వర్సిటీ బృందం

### ఉపకులపతి ఆల్డాస్ జానయ్య.. పలు అంశాలపై ప్రతినిధి బృందం చర్చ

**అత్తాపూర్ ఫిబ్రవరి 7, ప్రభాతవార్త :** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రణాళికల్ని రూపొందిస్తున్నామని ఉప కులపతి డాక్టర్ ఆల్డాస్ జానయ్య అన్నారు. అందులో భాగంగా అమెరికాలోని ప్రఖ్యాత విశ్వ విద్యాలయం అయిన ఆబర్న్ విశ్వవిద్యాలయానికి చెందిన ఉన్నత స్థాయి బృందం శుక్రవారం ఉపకులపతి ఆల్డాస్ జానయ్య మరియు ఇటీవల నియమితులైన పూర్తిస్థాయి విశ్వవిద్యాలయ అధికారులతో పిజెటీఎయూ పరిపాలన భవనంలో సమావేశం అయింది. అంతర్జాతీయ సంస్థలతో విస్తృతంగా ఒప్పందాలు కుదుర్చుకుని బోధన, పరిశోధన తదితర రంగాల్లో పరస్పరం కలిసి పనిచేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు జానయ్య ఆ బృందానికి తెలిపారు. అమెరికా దేశంలోని అలబామా రాష్ట్రానికి చెందిన ఈ ఆబర్న్ విశ్వవిద్యాలయం ప్రతినిధి బృందం గ్రాడ్యుయేట్ స్కూల్ డీన్ మరియు మెకానికల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ డాక్టర్ జార్జ్ ఫ్లవర్స్ నేతృత్వంలో ఉపకులపతి డాక్టర్ ఆల్డాస్ జానయ్యతో సమావేశం అయ్యి అనేక అంశాలపై చర్చించారు. విశ్వవిద్యాలయ పూర్వ ఉపకులపతి, ప్రస్తుత రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి, అగ్రికల్చర్ ప్రొడక్షన్ కమిషనర్ ఎం . రఘునందన్ రావు, ఐఏఎస్ గతేడాది ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఈ రెండు విశ్వవిద్యాలయాల మధ్య ఒప్పందం కుదిరేలా చేశారని జానయ్య అన్నారు. తద్వారా వ్యవసాయ విశ్వ విద్యాలయానికి చెందిన ఇద్దరు విద్యార్థులు తొలి సారిగా రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక సాయంతో ఆబర్న్ విశ్వవిద్యాలయంలో విద్య నభ్యసించడానికి వెళ్లారని వివరించారు. వచ్చే విద్యా సంవత్సరం నుండి పిజెటీ ఎయూ నుంచి ఆబర్న్ విశ్వ విద్యాలయంతో పాటు ఇతర ప్రఖ్యాత విశ్వ విద్యాలయాలకి 8 10 మంది విద్యార్థుల్ని పంపించడానికి అవసరమైన ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వానికి పంపనున్నట్లు ఉపకులపతి తెలిపారు. అదేవిధంగా ఎం ఎస్ సి విద్యార్హతతో వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న వారు కూడా పి హెచ్ .డి పూర్తి చేసి సాంకేతిక పరిజ్ఞానం, ప్రతిభ, సామర్థ్యాన్ని పెంపొందించుకొని మరల ఇక్కడే పనిచేసే అవకాశాలని పరిశీలిస్తామని ఆల్డాస్ జానయ్య తెలిపారు. తర్వాత రాజేంద్రనగర్ లోని వ్యవసాయ కళాశాల ఆడిటోరియంలో ఆబర్న్ విశ్వవిద్యాలయ బృందం ప్రతినిధులు డిగ్రీ చివరి సంవత్సర విద్యార్థులతో సమావేశం అయ్యారు. ఆబర్న్ విశ్వవిద్యాలయంలో ప్రవేశ ప్రక్రియ గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థుల సందేహాల్ని నివృత్తి చేశారు. ఈ కార్యక్రమాల్లో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ జి .ఈ .సి హెచ్ . విద్యాసాగర్, పరిశోధన సంచాలకులు డాక్టర్ ఎం . బలరాం, విస్తరణ సంచాలకులు డాక్టర్ ఎం . యాకాద్రి, పీజీ స్టడీస్ డీన్ డాక్టర్ కె .బి ఈశ్వరి, విశ్వవిద్యాలయ అంతర్జాతీయ కార్యక్రమాల విభాగం సంచాలకులు డాక్టర్ వి . రాములు, సీనియర్ ప్రొఫెసర్లు డాక్టర్ జెల్లా సత్యనారాయణ, డాక్టర్ రఘురామిరెడ్డి, డాక్టర్ జమునా రాణి, ఆబర్న్ విశ్వవిద్యాలయ డైరెక్టర్ డాక్టర్ షీనా స్టీవార్ట్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వృషాంక్ రాఘవ్, డీన్ ఆఫ్ కాలేజీ ఆఫ్ ఫారెస్ట్రీ, వైల్డ్ లైఫ్ అండ్ ఎన్విరాన్మెంట్ డాక్టర్ జానకి అలవలపాటి, ప్రొఫెసర్ డాక్టర్ గోవింద్ కన్నన్ లు పాల్గొన్నారు.



వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరిగిన సమావేశంలో ఆబర్న్ విశ్వవిద్యాలయం ప్రతినిధి బృందం

## ఒకటో తరగతి చిన్నారిపై వ్యాన్ డ్రైవర్ లైంగిక దాడి

### ఇబ్రహీంపట్నం ఘటన మరువకముందుకే మరో ఘటన

**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** ఒకటవ తరగతి చదువుతున్న చిన్నారి(7)పై వ్యాన్ డ్రైవర్ లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఇబ్రహీంపట్నంలో ఓ పాఠశాల ప్రిన్సిపాల్ పదవ తరగతి చదువుతున్న విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడ ఘటన మరువకముందుకే శంషాబాద్ లో ఒకటవ తరగతి చదువుతున్న చిన్నారిపై మంచాల లో లైంగిక దాడికి పాల్పడిన ఘటన వెలుగులోకి వచ్చింది. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలంలోని అన్ ఫ్రెంట్ జీసస్ పాఠశాలకు చెందిన విద్యార్థులు పిక్నిక్ కోసం ఈనెల 4న మంచాల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ రిసార్ట్ కు వచ్చారు .చిన్నారి వాష్ రూమ్ కు వెళ్ళింది చూసి వ్యాన్ డ్రైవర్ ఈ దారుణానికి ఒడిగట్టినట్లు పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. కాగా చిన్నారి తన ఆరోగ్యం బాలేదని తన తల్లికి తెలిపింది. చిన్నారికి రక్తస్రావం అవుతుండడంతో తల్లి ఆస్పత్రికి తీసుకెళ్ళింది. దీంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. శుక్రవారం పాఠశాల ఎదుట చిన్నారి కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. ఈ ఘటనపై చిన్నారి తల్లిదండ్రులు మంచాల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.పోలీసులు నిందితులపై పోక్సో కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

## సమస్య కోసం వస్తే లైంగికదాడి చేసిన కానిస్టేబుల్

### విషయం బయటకు పొక్కితే అంతుచూస్తానని బెదరింపు

### వేధింపులు భరించలేక ఫిర్యాదు చేసిన బాధిత యువతి

**మేడ్చల్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త :** తనకు సమస్య ఉందని ఓ యువతి పోలీస్ స్టేషన్‌కు వెళితే అక్కడ కానిస్టేబుల్ ఆమెకు సహాయం చేస్తానని చెప్పి లోబర్చు కుని గర్భవతిని చేసిన సంఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్‌కు చెందిన ఓ యువతి (31) డబ్బుల విషయంలో కొందరు తనను ఇబ్బందికి గురిచేస్తున్నారని ఫిర్యాదు చేసేందుకు గతేడాది మార్చి 21న తన తల్లితో కలిసి మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లింది. అనంతరం ఆమె తిరిగి వెళుతున్న సమయంలో అక్కడే ఉన్న క్రైం విభాగంలో పనిచేసే కానిస్టేబుల్ సుధాకర్‌రెడ్డి వారికి తగిన న్యాయం చేయిస్తా నని చెప్పి తన సెల్‌ఫోన్ నంబర్‌ను ఆ యువతికి ఇచ్చాడు. మర్నాడు ఆ యువతి కేసు విషయమై కానిస్టేబుల్ సుధాకర్‌రెడ్డికి ఫోన్‌చేయగా లాయర్‌తో చర్చించి సమస్యను పరిష్కరించుకునేలా చేస్తానని చెప్పి అందుకు ఆమెను ఇంటికి రమ్మని తెలిపాడు. ఇంటికి వెళ్లిన ఆమెను కాసేపు కూర్చోబెట్టి లాయర్ ఇంకా రాలేదని, వచ్చేవరకు ఉండమని చెప్పి తనకు పెళ్లి కాలేదని, తాను పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి ఆమెను లోబర్చుకుని లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ క్రమంలో బాధితురాలు గర్భవతి అయితే ఆమె చేత బలవంతంగా మాత్రలు మింగిచ్చి ఆబార్షన్ అయ్యేలా చేశాడు. గత డిసెంబరు 16న సుధాకర్‌రెడ్డి తన వాహనంపై ఆ యువతిని బలవంతంగా తీసుకెళ్లి బెదరించడమే కాకుండా గిర్మాపూర్ రోడ్డులో ఆమెను బండిపై నుండి కిందకి తోసెయడంతో యువతి తీవ్రగాయాల పాలైంది. కాగా, సదరు కానిస్టేబుల్‌ను మేడ్చల్ సిఐ సత్యనారాయణ సైబరాబాద్ కమిషనరేట్‌కు అటాచ్ చేయించాడు. అయినా అతని వేదింపులు, బెదరింపులు ఆగకపోవడంతో ఆగకపోవడంతో బాధిత యువతి సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో మేడ్చల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని కానిస్టేబుల్ సుదాకర్‌రెడ్డిని రిమాండ్‌కు తరలించారు.



కానిస్టేబుల్ సుధాకర్‌రెడ్డి

## మూడు గ్రూపులుగా ఎస్సీ వర్గీకరణ

### బిజెపి, బిఆర్‌ఎస్ వర్గీకరణను అడ్డుకొన్నాయి

### ఎఐసిసి కార్యదర్శి సంపత్‌కుమార్

**హైదరాబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** సుప్రీంకోర్టు ఆదేశాలతో వేసిన ఏకసభ్య కమీషన్ జస్టిస్ షామిమ్ అక్తర్ నివేదిక ఆధారంగా ఎస్సీ వర్గీకరణలో మూడు గ్రూపులుగా ప్రభుత్వం విభజించిందని ఎఐసిసి కార్యదర్శి సంపత్‌కుమార్ అన్నారు. గాంధీభవన్‌లో విలేఖరులతో ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం 2011 జనాభా లెక్కల ప్రకారం తీసుకు న్నామని తెలిపారు. 2011 జనాభా లెక్కలు ప్రభుత్వ అధికారిక లెక్కలు కావడంతో వాటిని ప్రామాణికంగా తీసుకోవడం సరైన నిర్ణయం అని ఆయన సమర్థించుకున్నారు. సుప్రీం కోర్టు ఆదేశాలమేరకు వేసిన ఏకసభ్య కమీషన్ నివేదికకు అనుగుణంగా మూడు గ్రూపులు విభజించారని ఇందులో సిఎం రేవంత్‌రెడ్డిని, మంత్రి రాజనర్సింహకు ఏ దోషం ఆపాదించకూడదని ఆయన హితవు చెప్పారు. మాల సామాజిక వర్గంతో పోల్చితే మాదిగల జనాభా డబుల్ ఉందని తెలిపారు. గ్రూప్ -2లోని కులాలకు 11శాతం రిజర్వేషన్ ఇవ్వకుండా9 శాతం రిజర్వేషన్ ఎందుకు కేటాయించారు అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని సంపత్ అభిప్రాయపడ్డారు .ఉమ్మడి ఆంధ్రనరపదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ హయాంలోనే 59 ఎస్సీ కులాలను ఎబిసిడిగా వర్గీకరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉషా మెహర్ కమిటీ వేసింది. ఆ తర్వాత తెలంగాణ ఉద్యమం ఉధృతం కావడం. తెలంగాణ ఏర్పాటు కావడం కేంద్రంలో బిజెపి అధికారంలోకి రావడం జరిగిందని చరిత్రను సంపత్ నెమరేసుకున్నారు. కేంద్రంలోని బీజేపీ, బిఆర్ఎస్ లు వర్గీకరణ ను అడ్డుకున్నాయి. కాంగ్రెస్ తెలంగాణ లో అధికారంలోకి వచ్చాక.. సుప్రీం కోర్టులో బలమైన వాదనలు వినిపించడం జరిగింది. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఏకసభ్య కమిషన్ వేసి నివేదిక ఆధారంగా మూడు గ్రూపులు రేవత్ ప్రభుత్వం చేసింది. ఆంధ్రప్రదేశ్ తో విడిపోయాక కొన్ని కులాలు తెలంగాణ లో లేవు కాబట్టి మూడు గ్రూపులు గా చేశారని ఆయన వివరణ ఇచ్చుకున్నారు. .గ్రూప్ 1 కి 1శాతం, గ్రూప్2 కి 9శాతం, గ్రూప్ 3 కి 5 శాతం రిజర్వేషన్ కేటాయించడం జరిగిందని ఆయన చెప్పారు. గ్రూప్ 1 లో 15 కులాలు ఉన్నాయి.గ్రూప్ 2 లో 18 కులాలు ఉన్నాయి. గ్రూప్ 3 లో 26 కులాలు ఉన్నాయి. 33.96 శాతం మాత్రానే ఎస్సీ జనాభాలో ఉన్నారు ఏ ఒక్క కులానికి ఇచ్చిన రిజర్వేషన్ కాదు ఇది అని ఆయన స్పష్టం చేశారు. ఆ గ్రూప్ లో ఉన్న అన్ని కులాల కు వర్తిస్తుంది. గ్రూపు 3లో ఉన్న 5శాతం రిజర్వేషన్ మాలలకు మాత్రమే కాదు అందులో ఉన్న ఇతర కులాల జనాభా 2 లక్షల 44వేల మందికి వర్తిస్తుంది.గ్రూప్ 3 కి కేటాయించిన 9 శాతం లో మాదిగలకు మాత్రమే కాదని ఆయన వివరించారు. అందులో ఉన్న ఇతర కులాల కు కూడా వర్తిస్తుంది.ఎస్సీ వర్గీకరణ ద్వారా ఎవరికి అన్యాయం జరగదని భరోసా ఇచ్చే ప్రయత్నం సంపత్ చేశారు. ఎవరికి ఎక్కువ న్యాయం కూడా జరగదు.8వేల పైగా జస్టిజ్ షామిమ్ అక్తర్ కమిషన్ కి విజ్ఞప్తులు వచ్చాయి. ఎబిసిడి వర్గీకరణ నుంచి మూడు గ్రూప్ లలో కుదించేందుకు భావ స్వరూపృతా.. సంప్రదాయాలు కలగాల్సిన కులాలను ఒక్కటి చేశారు.సీఎం రేవంత్ రెడ్డి,దామోదర రాజనర్సింహ లు ఎలా దోషులు అవుతారు.ఎస్సీ వర్గీకరణ చేసిన జస్టిస్ షామిమ్ అక్తర్ గారికి,ప్రభుత్వానికి,సీఎం,సబ్ కమిటీ కి ప్రత్యేక ధన్యవాదాలని అన్నారు.

## రైతుల బిల్లులు చెల్లింపునకే స్థిరాస్తుల విక్రయాలు

### నార్మల్ మదర్ డెయిరీ ఛైర్మన్




సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్మన్ మధుసూదన్‌రెడ్డి

**హైదరాబాద్ (హయత్‌నగర్), ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** బ్యాంకుల్లో తీసుకున్న అప్పును చెల్లించడంతోపాటు రైతులకు చెల్లించాల్సిన పాలబిల్లుల బకాయిలను చెల్లించి సంస్థను గాడిన పడేసేందుకుకే స్థిరాస్థులను అమ్మడానికి పాలక వర్గం నిర్ణయం తీసుకుందని... సొసైటీ ఛైర్మన్లు తీర్మాణాన్ని ఆమోదించి సహ కరించాలని నార్మల్ మదర్ డెయిరీ ఛైర్మన్ గుడిపాటి మధు సూదన్‌రెడ్డి అన్నారు. హయత్ నగర్‌లోని మదర్‌డెయిరీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక సర్వసభ్య సమా వేశంలో ఆయన మాట్లా డుతూ 2014 వరకు లాభాల బాటలో ఉన్న మదర్ డెయిరీ క్రమంగా పదేళ్లల్లో 60 కోట్ల మేర అప్పులో కూరుకు పోయిందన్నారు. సంస్థ లాభాల్లో ఉన్నట్లు చూపుతూ బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్నామని... ప్రస్తు తం నష్టాల్లో ఉన్నట్లు బ్యాంకులు గుర్తిస్తే మార్టిగేజ్ చేసుకున్న నికర ఆస్తులను వేలం వేసే ప్రమాదం ఉందన్నారు. అప్పుల్లో నుంచి బయట పడేందుకు తప్పని పరిస్థితుల్లో మార్టిగేజ్ చేసిన చిట్యాలోని 29.36 ఎకరాల భూమితో పాటు నకిరేకల్, చందూరులోని స్థలాలను విక్రయించి వచ్చిన డబ్బుతో అప్పులు తీర్చడం, రైతులకు చెల్లిం చాల్సిన పాలబిల్లులను చెల్లించడం, సంస్థకు అవసరమైన మిషనరీ కొనడం చేయడం సముచితమని నిర్ణయించినట్లు తెలిపారు.

**స్థిరాస్తుల విక్రయాల్లో పారదర్శకత పాటించాలి**

మదర్ డెయిరీ ఢిల్లీ వారితో పాలవిక్రయాల ఒప్పందం రద్దు, కరోనా పరిస్థితుల కారణంగానే గతంలో సంస్థ లాభాల నుంచి నష్టాల బాటలోకి వెళ్లిందని మాజీ ఛైర్మన్ గుత్తా జితేందర్‌రెడ్డి అన్నారు. మార్కెట్‌లో నెలకొన్న పోటీ కారణంగా ఎప్పటికపుడు విక్రయాలు తగ్గడంతో నష్టాలు పెరుగుతూ వచ్చాయన్నారు. స్థిరాస్థి విక్రయాలకు బదులుగా దిద్దుబాటు చర్యలు తీసుకుని సంస్థను గాడిన పెట్టాలని సూచించారు. సొసైటీ ఛైర్మన్లు భాస్కర్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్ మాట్లా డుతూ... నష్టాలను పూడ్చుకోవడానికి ఆస్తులను విక్రయించడంపై తమకు అభ్యంతరాలు లేవని, స్థిరాస్తుల విక్రయాలలో పారదర్శకత పాటించాలని భవిష్యత్తులో తిరిగి నష్టం వస్తే పాలకవర్గం బాధ్యత తీసుకుని పదవులకు రాజీనామాలు చేయాలన్నారు.



ప్రజావాణిలో దరఖాస్తుదారులతో డా.జి.చిన్నారెడ్డి

## ప్రజావాణికి అందిన దరఖాస్తులు 4,901

**హైదరాబాద్ (బేగంపేట), ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 4,901 దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 157 దరఖాస్తులు, విద్యుత్ శాఖకు సంబంధించి 105 దరఖాస్తులు, రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 30 దరఖాస్తులు, ఇందిరమ్మ ఇళ్ల పథకం కోసం 2,865 దరఖాస్తులు వచ్చాయి. పౌర సరఫరాల శాఖకు సంబంధించి 1,640 దరఖాస్తులు (రేషన్ కార్డుల కోసం) వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 109 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డా.జి. చిన్నారెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు. ప్రజాభవన్‌కు వచ్చిన వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

08-02pg10exHMNWJQEV.qxd:08-02pg10exHMNWJQEV.qxd 01/01/01 7:24 AM Page 1



# ఛాంపియన్స్ ట్రోఫీలో.. భారత్‌కు బిగ్ షాక్

## అంపైర్స్, రిఫరీ టీముల్లో నో ప్లేస్
## ఐసిసి కీలక నిర్ణయం


అనంత పద్మనాభన్


జవగళ్ శ్రీనాథ్


నితిన్ మీనన్

**న్యూఢిల్లీ:** ఇంటర్నేషన్ క్రికెట్ కౌన్సిల్ (ఐసిసి) భారత్‌కు బిగ్ షాకిచ్చింది. త్వరలో జరగబోయే ప్రతిష్టాత్మక ఛాంపియన్స్ ట్రోఫీ-2025 కోసం ఏర్పాటు చేసిన అంపైర్లు, రిఫరీ బృందంలో భారత్‌కు చోటు దక్కలేదు. ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీ ఈ నెల 19 నుంచి పాకిస్తాన్, దుబాయ్‌లలో ప్రారంభం కానుంది. ఇందుకు గాను ఐసిసి 12 మంది అంపైర్ల పేర్లను ప్రకటించింది. ఇందులో ఒక్క భారతీయ అంపైర్‌కు కూడా స్థానం దక్కలేదు. అలాగే, భారత మ్యాచ్ రిఫరీకి కూడా చోటు లభించలేదు. భారత్‌కు సంబంధించిన అంపైర్లలో నితిన్ మీనన్, కెఎన్ అనంత పద్మనాభన్, ఉల్హాస్ గాంధీ, సదాశివ అయ్యర్, కృష్ణరాజ్ శ్రీనాథ్, శంషుద్దీన్ తదితరులు ఉండగా, రిఫరీలకు సంబంధించి జవగళ్ శ్రీనాథ్, వృంధా రతి, శివానీ మిశ్రా, జిఎస్ లక్ష్మి తదితరులు ఉన్నారు. ఇక హైబ్రిడ్ మోడల్ ఆధారంగా జరిగే ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో, టీం ఇండియా తన అన్ని మ్యాచ్‌లన్నింటినీ హైబ్రీడ్ మోడల్‌లో దుబాయ్‌లో ఆడుతుంది. మిగిలిన మ్యాచ్‌లు పాకిస్తాన్ దేశంలో జరగనున్నాయి. ఈ ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీ కోసం భారతీయ అంపైర్లు లేదా మ్యాచ్ రిఫరీలు ఎవరూ పాకిస్తాన్‌కు వెళ్లకపోవడమే ఇందుకు కారణం. ఇందులో ఐసిసి మ్యాచ్ రిఫరీ జవగళ్ శ్రీనాథ్, ఎలైట్ ప్యానెల్ అంపైర్ నితిన్ మీనన్ పేర్లు ఉన్నాయి.

కానీ, ఐసిసితో చర్చల తర్వాత వారిద్దరూ పాకిస్తాన్ వెళ్లడం లేదు. టీమిండియా మ్యాచ్‌లు దుబాయ్‌లో జరగాల్సి ఉండగా, ఈ ఇద్దరు సభ్యులు టీమ్ ఇండియా మ్యాచ్‌లో మ్యాచ్ ఆఫీసర్ బాధ్యతను నిర్వర్తించలేరు. భారత మాజీ ఫాస్ట్ బౌలర్లు జవగళ్ శ్రీనాథ్, నితిన్ మీనన్ ఇప్పుడు ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీ 2025 నుంచి దూరంగా ఉండటానికి ఇదే కారణమని తెలుస్తోంది. ఇక ఐసిసి ప్రకటించిన 12 మంది అంపైర్ల టీం, ముగ్గురు మ్యాచ్ రిఫరీల్లో ఒక్క భారతీయుడు కూడా లేడు. 2025 ఛాంపియన్స్ ట్రోఫీకి ఎంపికైన అంపైర్లులో కుమార్ ధర్మసేన, క్రిస్ గాఫ్నీ, మైఖేల్ గౌఫ్, అడ్రియన్ హోల్డ్‌స్టాక్, రిచర్డ్ ఇల్లింగ్‌వర్త్, రిచర్డ్ కెటిల్‌బరో, ఎహ్సాన్ రాజా, పాల్ రీఫెల్, షరాఫ్ ఉద్దౌలా, రోడ్నీ టక్కర్, అలెక్స్ వార్ఫ్, జోయెల్ విల్సన్. అలాగే మ్యాచ్ రిఫరీల్లో డేవిడ్ బూన్, రంజన్ మదుగలే, ఆండ్రూ పైక్రాఫ్ట్ ఉన్నారు.

## సౌతాఫ్రికా టీ20 లీగ్‌లో...
# ఫైనల్లోకి సన్‌రైజర్స్
## రాయల్స్ 8 వికెట్ల తేడాతో ఓటమి

**న్యూఢిల్లీ:** సౌతాఫ్రికా టీ20 లీగ్-2025 ఫైనల్లోకి సన్‌రైజర్స్ ఈస్ట్రన్ కేప్ (సన్‌రైజర్స్ హైదరాబాద్ యాజమాన్యం) అడుగుపెట్టింది. సెంచూరియన్ వేదికగా జరిగిన క్వాలిఫయర్-2లో పార్ల్ రాయల్స్‌ను 8 వికెట్ల తేడాతో చిత్తు చేసిన సన్‌రైజర్స్ వరుసగా మూడోసారి తమ ఫైనల్ బెర్తును ఖారారు చేసుకుంది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పార్ల్ రాయల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 175 పరుగుల భారీ స్కోర్ సాధించింది. పార్ల్ బ్యాటర్లలో రూబిన్ హెర్మాన్ అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. కేవలం 53 బంతులు మాత్రమే ఎదుర్కొన్న హెర్మాన్ 8 ఫోర్లు, 3 సిక్స్‌లతో 81 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. అతడితో పాటు ఓపెనర్ లువాన్ డ్రే ప్రిటోరియస్ (59) హాఫ్ సెంచరీతో మెరిశాడు. సన్‌రైజర్స్ బౌలర్లలో ఓవర్టన్, మార్కో జానెసన్, బార్టమన్, మార్క్రమ్ తలా వికెట్ సాధించారు. అనంతరం 176 పరుగుల లక్ష్యాన్ని సన్‌రైజర్స్ కేవలం 2 వికెట్లు మాత్రమే కోల్పోయి 19.2 ఓవర్లలో చేధించింది. లక్ష్య చేధనలో ఈస్ట్రన్ కేప్ ఓపెనర్ టోనీ డి జోర్జి ఆకాశమే హద్దుగా చెలరేగాడు. రాయల్స్ బౌలర్లను టోనీ ఊచకోత కోశాడు. కేవలం 49 బంతుల్లోనే 11 ఫోర్లు, 2 సిక్స్‌లతో 78 పరుగులు చేసి ఔటయ్యాడు. అతడితో పాటు జోర్డాన్ హెర్మాన్ సైతం కీలక ఇన్నింగ్స్ ఆడాడు. 48 బంతుల్లో 4ఫోర్లు, 4 సిక్స్‌లతో 69 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. రాయల్స్ బౌలర్లలో మఫాక, దునిత్ వెల్లలాగే తలా వికెట్ సాధించారు. మిగితా బౌలర్లంతా దారుణంగా విఫలమయ్యారు. ఇక ఈనెల 8న జోహాన్స్‌బర్గ్ వేదికగా జరగనున్న ఫైనల్ పోరులో సన్‌రైజర్స్, ఎంఐ కేప్‌టౌన్ జట్లు అమీతుమీ తెల్చుకోనున్నాయి. కేప్‌టౌన్‌కు ఇదే తొలి ఫైనల్ కాగా, సన్‌రైజర్స్‌కు మాత్రం ఇది ముచ్చటగా మూడో ఫైనల్. తొలి రెండుసీజన్లలోనూ మార్క్రమ్ సారథ్యంలోనే సన్‌రైజర్స్ ఈస్ట్రన్ కేప్ ఛాంపియన్గా నిలిచింది. కాగా ఈస్ట్రన్ కేప్ జట్టు ఐపీఎల్ ఫ్రాంఛైజీ సన్‌రైజర్స్ హైదరాబాద్ యాజమాన్యానికి సంబంధించినదే కావడం గమనార్హం.

# రెండో టెస్టులో..ఆధిక్యంలో ఆస్ట్రేలియా




**న్యూఢిల్లీ:** శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టులో ఆస్ట్రేలియా ఆధిక్యంలో కొనసాగుతోంది. గాలే వేదికగా ఈ మ్యాచ్‌లో శ్రీలంక 330 పరుగులు చేయగా, ఆస్ట్రేలియా 330 పరుగులతో ముందుంది. ఆసీస్ వికెట్‌కీపర్, బ్యాటర్ అలెక్స్ క్యారీ శతక్కొట్టాడు. ఈ మ్యాచ్‌లో ఐదోస్థానంలో బరిలోకి దిగిన క్యారీ 156 బంతుల్లో 13 ఫోర్లు, 2 సిక్సర్ సాయంతో కెరీర్లో రెండోటెస్ట్ సెంచరీని పూర్తిచేసుకున్నాడు. ఇదే మ్యాచ్‌లో క్యారీకిముందు స్టీవ్ స్మిత్ కూడా సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఇలా స్మిత్, క్యారీ సెంచరీలతో కదం తొక్కడంతో ఆస్ట్రేలియా ఆధిక్యంలోకి వెళ్లింది. 74 ఓవర్ల అనంతరం తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ స్కోర్ 3 వికెట్లు నష్టానికి 330 పరుగులుగా ఉంది. క్యారీ (139), స్మిత్ (120) సెంచరీల అనంతరం అదే జోరుతో ఇన్నింగ్స్‌ను కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం ఆస్ట్రేలియా 73 పరుగుల ఆధిక్యంలో ఉంది. ఆసీస్ ఇన్నింగ్స్‌లో హెడ్ 21, ఉస్మాన్ ఖ్వాజా 36, లబూషేన్ 4 పరు గులు చేసి ఔటయ్యారు. లంక బౌలర్లలో నిషాన్ పెయిరిస్ 2, ప్రభాత్ జయసూర్య ఓ వికెట్ పడగొట్టారు. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 257 పరుగు లకు ఆలౌటైంది. చండీమల్ (74), కుసాల్ మెండిస్ (85 నాటౌట్) అర్ధ సెంచరీలతో రాణించి శ్రీలంకకు గౌరవప్రదమైన స్కోర్ అందించారు. కెరీర్లో చివరి మ్యాచ్ ఆడుతున్న దిముత్ కరుణరత్నే 36 పరుగులకే ఔట య్యాడు. రమేశ్ మెండిస్ (28), కమిందు మెండిస్ (13), పథుమ్ నిస్సంక (11) రెండం కెల స్కోర్లు చేశారు. ఆసీస్ బౌలర్లలో స్టార్క్, కుహ్నెమన్, లయోన్ తలో 3 వికెట్లు పడగొట్టగా, ట్రవిస్ హెడ్ ఓ వికెట్ దక్కించుకున్నాడు.

కాగా రెండు టెస్టు మ్యాచ్‌లు, రెండు వన్డేల సిరీస్ కోసం ఆస్ట్రేలియా శ్రీలంకలో పర్యటిస్తోంది. ఈ సిరీస్‌లోని తొలి మ్యాచ్‌లో ఆసీస్ ఇన్నింగ్స్ 242 పరుగుల భారీ తేడాతో గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో ఉస్మాన్ ఖ్వాజా (232) డబుల్ సెంచరీతో కదంతొక్కగా, జోష్ ఇంగ్లిస్ (102), స్టీవ్ స్మిత్ (141) సెంచరీలతో మెరిశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 165 పరుగులకే ఆలౌట్ అయి ఫాలో ఆన్ ఆడింది. సెకెండ్ ఇన్నింగ్స్‌లోనూ (247 ఆలౌట్) లంక పరిస్థితి మారలేదు. ఫలితంగా ఘోర పరాభవాన్ని మూటగట్టుకుంది. ఆసీస్ బౌలర్లు కుహ్నెమన్ 9, నాథన్ లయోన్ 7 వికెట్లు తీసి లంక పతనాన్ని శాశించారు. కాగా, ఈ టెస్ట్ సిరీస్ అనంతరం ఈ నెల 12, 14 తేదీల్లో కొలొంబో వేదికగా శ్రీలంక, ఆస్ట్రేలియా మధ్య రెండు వన్డేలు జరుగనున్నాయి.







# 38వ జాతీయ క్రీడల్లో..
## దీపికకు స్వర్ణం, స్వప్నిల్‌కు కాంస్యం
# ఛాంపియన్‌గా జూయెల్

**న్యూఢిల్లీ:** జాతీయ క్రీడల్లో ఒలింపిక్ పతక విజేత స్వప్నిల్ కుసాలె కాంస్య పతకంతో సరిపెట్టుకున్నాడు. డెహ్రాడూన్‌లో జరిగిన షూటింగ్ పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రిపొజిషన్ విభాగంలో మహారాష్ట్ర షూటర్ స్వప్నిల్ మూడో స్థానంలో నిలిచాడు. ఈ విభాగంలో సర్వీసెస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డు (ఎస్ఎస్సీబీ) తరఫున బరిలోకి దిగిన 25ఏళ్ల నీరజ్ కుమార్ 464.1 పాయింట్లతో స్వర్ణం చేజిక్కించుకున్నాడు. అలాగే మధ్యప్రదేశ్‌కు చెందిన ఐశ్వరి ప్రతాప్ సింగ్ (462.4 పాయింట్లు) రజత పతకం దక్కించుకోగా, పారిస్ ఒలింపిక్స్ కాంస్యం నెగ్గి ఈ విభాగంలో దేశానికి తొలిపతకం అందించిన స్వప్నిల్ (447.7 పాయింట్లు) కాంస్యం గెలుచుకున్నాడు. మరోవైపు 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్డ్ టీమ్ ఈవెంట్లో సురుచి సింగ్-ప్రమోద్ (హరియాణా) 17-7 పాయింట్ల తేడాతో అంజలి షెఖావత్-ఉమేశ్ చౌదరి(రాజస్తాన్)పై గెలిచి పసిడి ఖాతాలో వేసుకుంది. ఇక రాహి సర్నోబత్-ప్రణవ్ అరవింద్ పాటిల్ (మహారాష్ట్ర) జట్టు కాంస్యం గెలుచుకుంది. సుదీర్ఘకాలంగా భారత టాప్ ఆర్చర్గా ఉన్న దీపిక కుమారి పసిడిని అందుకుంది. పారిస్ ఒలింపిక్స్‌లో పతకం సాధించడంలో విఫలమైన దీపిక నేషనల్ గేమ్స్‌లో జార్ఖండ్ తరఫున బరిలోకి దిగి వ్యక్తిగత విభాగంతో పాటు, టీమ్ ఈవెంట్లోనూ స్వర్ణం కైవసం చేసుకుంది. కాగా పురుషుల విభాగంలో నాలుగుసార్లు ఒలింపిక్స్‌లో పాల్గొన్న సీనియర్ ఆర్చర్ తరుణ్‌దీప్ రాయ్‌ను ఓడించిన 18 ఏళ్ల బెంగాల్ ఆర్చర్ జుయెల్ సర్కార్ జాతీయ ఛాంపియన్‌గా అవతరించాడు. మరోవైపు బాక్సింగ్స్‌లో లవ్లీనా బోర్గొహైన్, ఆరు సార్లు ఆసియా చాంపియన్ శివ థాపా విజయాలు సాధించారు. మహిళల 75 కేజీల విభాగంలో లవ్లీనా తిరుగులేని ప్రదర్శన కనబర్చగా, పురుషుల 64 కేజీల విభాగంలో శివ థాపా (అసోం) సత్తాచాటాడు.

## ఇండియన్ సూపర్ లీగ్‌లో..
# గోవా ఫుట్‌బాల్ క్లబ్ సంచలనం
## 2-1 స్కోరుతో ఒడిశాపై విజయం



**న్యూఢిల్లీ:** ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్)-2025 ఫుట్‌బాల్ టోర్నమెంట్లో గోవా ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్సీ) 2-1 స్కోరుతో ఒడిశా జట్టుపై విజయం సాధించింది. గోవాలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో గోవా తరఫున బ్రిసన్ డ్యూబెన్ ఫెర్నాండెజ్ 29వ నిమిషంలో గోల్ సాధించి గోవాకు తొలి ఆధిక్యం ఇచ్చాడు. ఒడిశా ఆటగాడు లాల్తతంగ ఖవ్ల్రింగ్ (47వ నిమిషంలో) చేసిన సెల్ఫ్ గోల్ గోవా ఆధిక్యాన్ని రెట్టింపు చేసింది. 54వ నిమిషంలో ఒడిశా స్ట్రయికర్ కెపి రాహుల్ గోల్ చేసినప్పటికీ గోవా విజయాన్ని మాత్రం అడ్డుకోలేక పోయాడు. నిజానికి ఈ మ్యాచ్‌లో ఒడిశా తమ దాడులకు పదును పెట్టలేకపోయింది. అవతలివైపు నుంచి గోవా ఎఫ్సీ ఆటగాళ్లు మాత్రం పదే పదే ప్రత్యర్థి గోల్‌ఫోస్ట్ వైపు దూసుకొచ్చి ఏకంగా 20 షాట్లు కొట్టారు. లక్ష్యంపై ఆరుసార్లు గురిపెట్టగా ఒకసారి గోల్‌తో విజయవంతమైంది. ఒడిశా 15 షాట్లు ఆడినా, కేవలం ప్రత్యర్థి గోల్‌పోస్ట్‌పై రెండే సార్లు దాడి చేసింది. ఇందులో ఒకసారి మాత్రం ఫలితాన్ని సాధించింది. గోవా ఆటగాళ్లు మైదానంలో పాదరసంలా కదిలారు. బంతిని ప్రత్యర్థుల కంటే తమ ఆధీనంలో ఉంచుకునేందుకు అదే పనిగా చకచకా పాస్లు చేశారు.

# పన్ను చెల్లింపుదారులకు ఏది బెస్ట్?

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7:** నిర్ణీత పరిమితికి మించిన ఆదాయం సంపాదించే దేశంలోని పౌరులందరూ ప్రభుత్వానికి ఆదాయపు పన్ను చెల్లించాలి. అయితే వారికి ఖర్చులు, పెట్టుబడులకు సంబంధించి కొన్ని మినహాయింపులు లభిస్తాయి. ప్రస్తుతం పాత, కొత్త విధానాల్లో ఆదాయపు పన్ను చెల్లింపులు చేయవచ్చు ఏ విధానంలో ఎక్కువ మినహాయింపు లభిస్తుందో లెక్కించుకుని నిర్ణయం తీసుకోవాలి. కొత్త విధానంలో ఏడాదికి రూ.12.75 లక్షల వరకు సంపాదించేవారు (రూ.75 వేల ప్రామాణిక తగ్గింపుతో సహా) 2025-26 ఆర్థిక సంవత్సరంలో సున్నా పన్ను చెల్లిస్తారు. అయితే ఈ విధానంలో రూ.75 వేల ప్రామాణిక మినహాయింపు ఉన్నప్పటికీ పెట్టుబడులకు తగ్గింపులు లేవు. ఒక వేళ ఆర్థిక సంవత్సరంలో రూ.12.75 లక్షల ఆదాయం దాటితే మొత్తం ఆదాయంపై పన్ను వర్తిస్తుంది. ఎటువంటి తగ్గింపులు ఉండవు. ఎందుకంటే ఈ విధానంలో హెచ్‌ఆర్‌ఏ, ఈఎల్ఎస్ఎస్, ఐదేళ్ల ఫిక్స్‌డ్ డిపాజిట్, ఎన్పీఎస్ తదితర వాటిని క్లెయిమ్‌చేసుకునే వీలుండదు. బడ్జెట్‌లో పాత పన్ను విధానాన్ని మార్చలేదు. దీనిలో రిబేటు కారణంగా రూ.5లక్షల వరకూ ఆదాయం పన్ను రహితంగా ఉంటుంది. అలాగే ఈ విధానంలో సెక్షన్ 80సీ కింద పీపీఎఫ్, ఈఎల్ఎస్ఎస్, ఎల్ఐసీ ప్రీమియాలకు రూ.1.50 లక్షల వరకూ మినహాయింపు ఉంటుంది. సెక్షన్ 80డీ కింద ఆరోగ్య బీమాప్రీమియాలను క్లెయిమ్‌చేసుకోవచ్చు. సెక్షన్ 24(బి) ప్రకారం రూ.2లక్షల వరకూ హౌసింగ్ రుణంపై వడ్డీని మినహాయింపు లభిస్తుంది. వీటితో పాటు




హెచ్‌ఆర్ఏ, ఎల్టీఏ తదితర ఇతర ప్రయోజనాలు కూడా కలుగుతాయి. ఆదాయపుపన్ను నిపుణుల అభిప్రాయం ప్రకారం, యేడాదికి రూ.12.75లక్షల వరకూ సంపాదించే వారికి కొత్తఆదాయపు పన్ను విధానం చాలా బాగుంటుంది. అంతకంటే ఎక్కువ సంపాదించే వారుమాత్రం తమ పెట్టుబడులు, ఇతర తగ్గింపులను లెక్కించుకోవాలి. పాతవిధానంలో వచ్చే మినహాయింపులను పరిగణనలోకి తీసుకోవాలి. ఏ విధానంలో ఎక్కువ మినహాయింపు ఉంటుందో గమనించి, దాని ప్రకారం పన్ను చెల్లించాలి.

## ఈ రంగాల్లో పెట్టుబడులు భేష్: మోతీలాల్ ఓస్వాల్!

**ముంబై, ఫిబ్రవరి 7:** బడ్జెట్ ప్రవేశపెట్టి దాదాపు రెండు రోజులు గడుస్తోంది. బడ్జెట్ తర్వాత దేశీయ స్టాక్‌మార్కెట్లు తెరచుకున్నప్పటికీ అమెరికాఅధ్యక్షుడు చైనా, కెనడా, మెక్సికోలపై వాణిజ్య యుద్ధాన్ని ప్రకటించటంతో మార్కెట్లు కుప్పకూలిన సంగతి తెలిసిందే. అలాగే బడ్జెట్ 2025 ప్రధానంగా దేశంలోని సామాన్యం ప్రజలను ఈసారి ఫోకస్ చేస్తూ తీసుకురాబడిన సంగతి తెలిసిందే. ప్రధాన ప్రకటనలను పరిశీలిస్తే 2025 బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మధ్యతరగతికి పెద్ద ఉపశమనం కల్పించారు. ఈ క్రమంలో ఆమె ప్రజల వద్ద వినియోగానికి అధిక నిధుల లభ్యతను పెంచేందుకు.. కొత్త పన్ను విధానంలో ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని రూ.7 లక్షల నుండి రూ.12 లక్షలకు పెంచటం జరిగింది. ప్రభుత్వ ఈ నిర్ణయం పన్ను చెల్లింపుదారులకు ఎంతో ఉపశమనం కలిగించింది. ప్రధానంగా హై పెయిడ్ ఉద్యోగాలు చేస్తున్న ఐటీరంగంలోని ఉద్యోగులకు దీని నుంచి పెద్ద ప్రయోజనం దక్కింది. ఈ క్రమంలో దేశీయ స్టాక్ మార్కెట్లు పెట్టుబడిదారులు ఏఏ రంగాల్లో ఇన్వెస్ట్ చేయవచ్చు, బడ్జెట్ తర్వాత ఎలా ముందుకు సాగాలని ఆలోచిస్తున్నారు. దీనిపై ప్రముఖ దేశీయ బ్రోకరేజ్ సంస్థ మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ చైర్మన్ రామ్‌దేవ్ అగర్వాల్ స్పందిస్తూ.. తాజా బడ్జెట్లో ప్రభుత్వ నిర్ణయం వినియోగాన్ని పెంచడం ద్వారా మూలధన మార్కెట్‌కు ప్రయోజనం చేకూర్చే అవకాశం ఉందన్నారు. ఈ నిర్ణయం ఎఫ్ఎంసిజి వంటి రంగాలు లేదా చిన్న వస్తువులతో వ్యవహరించే జొమాటో వంటి కంపెనీలు ప్రయోజనం పొందే అవకాశం ఉందని అగర్వాల్ అభిప్రాయపడ్డారు. పన్నుల తగ్గింపు వల్ల కన్స్యూమర్ డ్యూరబుల్ కంపెనీలకు ప్రయోజనం దక్కుతుందని చెబుతున్నారు. రూ.25 లక్షలు లేదా అంతకంటే ఎక్కువ సంపాదన కలిగిన వ్యక్తులు తమ ఆదాయాన్ని ఖర్చు చేయవలసిన అవసరం లేదని అగర్వాల్ అన్నారు. అటువంటి పరిస్థితిలో వారు పన్ను ఆదా ద్వారా వచ్చే డబ్బులో ఎక్కువ భాగాన్ని మూలధన మార్కెట్లో పెట్టుబడి పెట్టవచ్చని పేర్కొన్నారు. క్విక్ కామర్స్ కంపెనీలు ప్రస్తుతం వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని పేర్కొన్నారు. జెప్టో, బ్లింకిట్, టాటా బిగ్‌బాస్కెట్, ఇన్ స్టామార్ట్ వంటి కంపెనీలు మంచి గ్రోత్ నమోదు చేయగలవని అంచనాలను వ్యక్తం చేశారు. ఇదే క్రమంలో పాత కంపెనీలకు ఆదాయ వృద్ధి నెమ్మదిగా ఉన్నప్పటికీ విలువలు ఎక్కువగా ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.




## భారత్ మార్కెట్‌కు ఫారిన్ లగ్జరీ బ్రాండ్స్

**ముంబై, ఫిబ్రవరి 7:** విదేశీ బ్రాండ్లను భారత రిటైల్ మార్కెట్ ఊరిస్తోంది. 2024లో దాదాపు 27కొత్త విదేశీ రిటైల్ బ్రాండ్ దేశీయ విపణిలోకి ఎంట్రీ ఇచ్చాయి. విలాసవంత వస్తువుల కోసం పెరుగుతున్న డిమాండ్ ప్రస్తుతం తమ ఉనికిని చాటుకోవడానికి ఇవి భారత్‌లో రంగ ప్రవేశం చేస్తున్నాయని రియల్టీ కన్సల్టెంట్ జేఎల్ఎల్ ప్రదర్శన. అంత క్రితం. ఏడాదితో భారత్‌లో అడుగుపెట్టిన బ్రాండ్ల సంఖ్య 2024లో రెట్టింపు అయిందని, పట్టణీకరణ, ఖర్చు చేయదగ్గ ఆదాయం పెరగడం, షాపింగ్ ప్రాధాన్యతల్లో మార్పు లగ్జరీ ఉత్పత్తులకు డిమాండ్‌ను పెంచుతోందని వివరించింది. భారత్‌ను ప్రపంచవ్యాప్తంగా చురుకైన రిటల్ మార్కెట్లలో ఒకటిగా మార్చిందని, 2023లో 14 బ్రాండ్లు ఇక్కడికి ప్రవేశించాయి. నాలుగేళ్లలో 60 విదేశీ బ్రాండ్లు భారతకు వచ్చాయి. దేశీయ రిటైల్ బ్యూటీ, సాధనాలు, ఆరోగ్య సంరక్షణ పాదరక్షలు,బ్యాగ్స్, యాక్సెసరీస్,ప్యాషన్, దుస్తుల విభాగాల్లో టాప్3లో నిలిచాయి. భారత రిటైల్ రంగం అంతర్జాతీయ కంపెనీల దృష్టిని ఆకర్షించింది. నాలుగేళ్లుగా ఇక్కడి విపణిలో ఉనికిని నెలకొల్పడానికి ప్రయత్నాలను క్రమంగా పెంచుతుంది. గత సంవత్సరం ప్రవేశించిన కంపెనీలలో 56 శాతం యూరప్, మధ్యప్రాచ్య, ఆఫ్రికా స్థాపించబడినవి. ఫ్రెంచ్ ఇటాలియన్ సంస్థలు కూడా ఉన్నాయి.



# వాణిజ్యం


# ఆధార్‌పై కేంద్రం కీలక అప్‌డేట్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7:** భారతీయ పౌరులకు ఆధార్ అత్యంత ముఖ్యమైన గుర్తింపు కార్డులలో ఒకటి. ఆధార్ కార్డులో కాలానుగుణంగా కొన్ని మార్పులు చేస్తోంది కేంద్రం. ఆ విషయంలో కేంద్ర ప్రభుత్వం ఆధార్ కార్డుకు సంబంధించి కొత్త నోటిఫికేషన్ జారీ చేసింది. అంటే ప్రైవేట్ కంపెనీలు ఆధార్ కార్డు వివరాలను ఉపయోగించుకోవడానికి అనుమతించింది. కేంద్ర ప్రభుత్వం చేసిన ఈ కొత్త ప్రకటన ఏంటో చూద్దాం. భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ భారతదేశంలోని ప్రతి పౌరుడికి 12 అంకెల ఆధార్ కార్డును జారీ చేస్తుంది. 12 అంకెల సంఖ్యతో పాటు, ఆధార్ కార్డులో పేరు, వయస్సు, చిరునామా, మొబైల్ నంబర్, వేలిముద్రతో సహా కొన్ని ముఖ్యమైన వ్యక్తిగత సమాచారం కూడా ఉంటుంది. ఆధార్‌లో అంత ముఖ్యమైన వివరాలు ఉన్నందున, దానిని భారతపౌరులకు ముఖ్యమైన గుర్తింపు పత్రంగా పరిగణిస్తారు.ప్రభుత్వ మంత్రిత్వ శాఖ, విభాగం కాకుండా ఏదైనా సంస్థ ఆధార్ ప్రామాణీకరణను ఉపయోగించాలనుకుంటే తప్పనిసరిగా అందుకు కారణాలను కేంద్రానికి గానీ, యూఐడీఏకి గానీ వివరించాలని కేంద్రం నోటిఫికేషన్‌లో పేర్కొంది. ఈ ప్రతిపాదన ఒక నిర్దిష్ట ప్రయోజనం కోసం ప్రామాణీకరణ ఎందుకు అవసరమో, అది ప్రజలకు ఎలా ప్రయోజనం చేకూరుస్తుందో కూడా ప్రైవేట్ సంస్థలు వివరించాల్సి ఉంటుంది. దానిని సంబంధిత ప్రభుత్వ మంత్రిత్వ శాఖ,విభాగానికి పంపాలి. ఏదైనా దుర్వినియోగానికి సంబంధించినవి ఉంటే అనుమతి ఉండదు. అయితే ఈ ప్రైవేట్ సంస్థలు ఆధార్ యాక్సెస్ చేసేందుకు పలు నిబంధనలు విధించింది కేంద్రం. సంస్థలు ఆధార్ యాక్సెస్ చేసేందుకు కారణాలు ఏమిటి? ఆధార్ వివరాలను పొందాలంటే అందుకు కారణాలు కేంద్ర ప్రభుత్వానికి గానీ, యూఐడీఏఐకి గానీ ప్రైవేట్ సంస్థలు వివరించాలి. అలాగే ఆ వివరాలన్నీ కూడా ప్రజలకు సమ్మతమైనవిగా ఉండాలి. కేంద్రం విధించిన నిబంధనలకు సరిగ్గా ఉండాలి. అందులో ఏ ఒక్కటి కూడా వ్యతిరేకంగా ఉంటే కేంద్రం అనుమతి ఇవ్వదు. ఆధార్ కార్డులపై వేలిముద్రలు, ఐరిస్ వంటి సమాచారాన్ని ఉపయోగించి మోసానికి పాల్పడిన సంఘటనలు అనేకం జరుగుతున్నాయి.




# ఐపిఒకు అజాక్స్ ఇంజినీరింగ్

**ముంబై, ఫిబ్రవరి 7:** ఇన్వెస్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీ కేదారా కేపిటల్ మద్దతు కలిగిన కాంక్రీట్ ఎక్విప్‌మెంట్ తయారీదారు అజాక్స్ ఇంజినీరింగ్ పబ్లిక్ ఇష్యూ ఫిబ్రవరి 10న ప్రారంభం కానుంది. ఫిబ్రవరి 12న సబ్‌స్క్రిప్షన్ ముగియనుంది. మొత్తం రూ.1269 కోట్లు సమీకరించనుంది. ఐపిఒలో భాగంగా ఒక్కో షేరు ధరల శ్రేణిని రూ.599-629గా కంపెనీ నిర్ణయించింది. యాంకర్ ఇన్వెస్టర్లకు ఫిబ్రవరి ఏడో తేదీన సబ్‌స్క్రిప్షన్ విండో తెరుచుకోనుంది. ఐపిఒ పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ రూపంలో జరగనుంది. పబ్లిక్ ఇష్యూలో భాగంగా 2.01 కోట్ల షేర్లను ప్రమోటర్లు, షేర్ హోల్డర్లు విక్రయించనున్నారు. కేదారా కేపిటల్ మొత్తం 74.37 లక్షల షేర్లను విక్రయించనుంది. పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ రూపంలో జరగనుండడంతో కంపెనీకి ఎలాంటి డబ్బులూ రాబోవు. అప్పర్ ప్రైస్ బ్యాండ్ వద్ద కంపెనీ మార్కెట్ విలువరూ.7200 కోట్లుగా ఉండనుంది. ప్రముఖ కాంక్రీట్ ఎక్విప్‌మెంట్ తయారీ కంపెనీలో అజాక్స్ ఇంజినీరింగ్ ఒకటి. కర్ణాటకలో నాలుగు అసెంబ్లింగ్, తయారీ యూనిట్లుఉన్నాయి. కర్ణాటకలో మరో యూనిట్ ఈ యేడాది ఆగస్టు నాటికి అందుబాటులోకి రానుంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.17441 కోట్ల ఆదాయాన్ని, రూ.225 కోట్ల నికర లాభాన్ని కంపెనీ ప్రకటించింది. ఈ ఐపిఒకు ఐసిఐసిఐ సెక్యూరిటీస్, సిటీగ్రూప్ గ్లోబల్ మార్కెట్స్ ఇండియా, జెఎం ఫైనాన్షియల్, నువామా వెల్త్ మేనేజ్‌మెంట్, ఎస్‌బిఐ కేపిటల్ మార్కెట్స్ బుక్ రన్నింగ్ లీడ్ మేనేజర్లుగా వ్యవహరించనున్నాయి.




# పోస్టల్ శాఖలో పెను మార్పులు

**ముంబై, ఫిబ్రవరి 7:**150 ఏళ్లకుపైగా చరిత్ర కలిగిన, ప్రపంచంలోనే అతి పెద్ద పోస్టల్ నెట్‌వర్క్ అయిన ఇండియాపోస్ట్‌ను 1.5లక్షల గ్రామీణ తపాలా కార్యాలయాలతో పెద్ద లాజిస్టిక్స్ సంస్థగా మార్చనున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతా రామన్ తెలిపారు. కేంద్ర బడ్జెట్ 2025ను సమ ర్పిస్తూ గ్రామీణ ఆర్థికవ్యవస్థకు ఇండియా పోస్ట్‌కు సంబంధించిన పరివర్తన ఒక ఉత్ప్రేరకంగా పని చేస్తుందని సీతారామన్ హామీ ఇచ్చారు. గ్రామీణ రంగానికి సంబంధించిన ఇతర సంస్కరణ చర్యలలో రుణ కార్యకలాపాల కోసం నేషనల్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు మద్దతు ఉందని చెప్పారు. ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్‌తో 1.5 లక్షల గ్రామీణ తపాలా కార్యాలయాలు, 2.4 లక్షల మంది డాక్ సేవకుల విస్తృత నెట్‌వర్క్ ఏర్పాటు చేస్తే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ఊపందుకుంటుందని వివరించరు. ఇండియా పోస్ట్‌ను మార్చే ప్రణాళికలను టెలికం మంత్రి జ్యోతిరాదిత్య సింధియా గతేడాది సెప్టెంబర్‌లో మొదటిసారి ప్రకటించారు. దీన్ని లాజిస్టిక్స్ సంస్థగా మార్చడం వల్ల వచ్చే మూడు, నాలుగేళ్లలో శాఖ ఆదాయం 50నుంచి 60శాతం పెరుగుతుందనిఆయన చెప్పారు. దీని కోసం ఆక్న డిసెంబరులో ఆర్థిక మంత్రిత్వశాఖ నుంచి నిధులను కోరారు. తద్వారా 2029 నాటికి డిపార్ట్‌మెంట్‌ను లాభదాయకంగా మార్చడానికి, లాజిస్టిక్స్ కంపెనీగా మార్చడానికి, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వస్తువుల డెలివరీ సేవలను పెంపొందించడానికి సహాయం చేస్తుందని వివరించారు. ముఖ్యంగా మారుమూల ప్రాంతాల్లో శాఖ పాత్రను పెట్టుబడిగా పెట్టుకునే దిశగా ముందుకు సాగింది. డిసెంబరులో డిపార్ట్‌మెంట్ కోసం కొత్త డెవలప్‌మెంట్ ప్లాన్ కోసం తన ప్రెజెంటేషన్‌ను ఇస్తూ త్వరలోనే పోస్టల్ సేవలను ప్రజల ఇంటి వద్దకు తీసుకెళ్తామని సింధియా చెప్పారు. డిపార్ట్‌మెంట్ ఆదాయాన్ని పెంచడానికి, ఖర్చులను హేతుబద్ధీకరించడం, మెజారిటీ ప్రక్రియలను డిజిటలైజ్ చేయాలనే లక్ష్యంతో సహా అన్ని సంభావ్య సేవలను పరిశీలిస్తామన్నారు.



Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14